అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 12-05-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 132 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00



ఆలోచించి ఓటెయ్యాలి

అన్ని రంగాల్లో మోడీ ప్రభుత్వం విఫలం

- భువనగిరిలో సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించాలి : రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య
- నన్ను గెలిపించండి మీ గొంతుకనవుతా : జహంగీర్

నవతెలంగాణ-భువనగిరి/ భువనగిరి అర్బన్

ఎన్నికల్లో మోడీ సర్కార్ కుట్రలను తిప్పికొట్టి, మతతత్వ బీజేపీని ఓడించాలి.. ప్రజలు ఆలోచించి ఓటెయ్యాలి.. అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ చౌరస్తా నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్‌కు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు భారతదేశం, ప్రజల భవిష్యత్‌ను నిర్దేశించే ఎన్నికలన్నారు. ప్రజలంతా ఆలోచించి ఓట్లు వేయాలని కోరారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం తన పనితనం చూపించి ఓట్లను అడిగే స్థితిలో లేదన్నారు. అన్ని రంగాల్లో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజలు ...13లో



కార్పొరేట్లకే దేశ సంపద

పదేండ్లుగా దోచిపెట్టిన మోడీ

- ప్రజలకు చేసిందేమీ లేదు
- చేసిన పనులు చెప్పుకోలేక మతచిచ్చు రాజేస్తున్న బీజేపీ
- తెలంగాణా చైతన్యం మరోసారి చాటాలి
- పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ అమలు చేస్తాం : ఏఐసీసీ కార్యదర్శి ప్రియాంక గాంధీ

నవతెలంగాణ-తాండూరు/కామారెడ్డి

"మోడీ పాలనలో బడా వ్యాపారులకే మేలు జరిగింది.. సామాన్య ప్రజలకు చేసిందేమీ లేదు.. మోడీ ఏదైనా పని చేసినట్లయితే నేను ఈ పనులు చేశానని చెప్పేవారు. కానీ దేశ సంపదనంతా అతని స్నేహితులకే దోచిపెట్టారు.. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా వారికి అప్పజెప్పారు. రైతులు, మహిళలు, కార్మికులు, ఉద్యోగులు, యువత సంక్షేమం వారికి అవసరం లేదు. సమస్యల నుంచి దృష్టి మరల్చేందుకు అన్నదమ్ముల్లా కలిసి ఉన్న ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారు.." అని ఏఐసీసీ ప్రధాని కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజ్యాంగాన్ని మార్చనివ్వబోమన్నారు. పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పదేండ్లలో ప్రధాని మోడీ రూ.16 లక్షల కోట్లు తన దోస్తులకు దోచి పెట్టాడని, పేద రైతులకు సంబంధించి ఒక రూపాయి అయినా బ్యాంకులో మాఫీ చేశాడా అని ప్రశ్నించారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్, వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ కేంద్రంలో చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ జనజాతర సభలు నిర్వహించారు. ఈ సభల్లో ప్రియాంక గాంధీ ...13లో

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకునేందుకు 'ఇండియా'ను గెలిపించండి : వీడియో సందేశం ద్వారా ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు ...13లో



మతాల మధ్య బీజేపీ చిచ్చు

- రిజర్వేషన్ల రద్దు ప్రాతిపదికపైనే ఈ ఎన్నికలు
- రామలక్ష్మణుల్లా కలిసి పని చేయండి : పటాన్‌చెరు కార్నర్ మీటింగ్‌లో సీఎం
- ఈడీ, సీబీఐ, అదానీ, అంబానీలే మోడీ పరివార్

నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రస్తుత ఎన్నికలు సంక్షేమం, అభివృద్ధి ప్రాతిపదికన జరగడం లేదని.. రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దు ప్రాతిపదికన జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ...13లో



మోడీ పాలనంతా గ్యాస్..ట్రాష్..

ప్రజానీకాన్ని భ్రమల్లో ముంచిన బీజేపీ

- ఆ పార్టీకి 200 సీట్లు కూడా దాటవు
- రాష్ట్రంలో కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోబోతోంది
- 9 స్థానాల్లో ఆ పార్టీకి మూడోస్థానం
- బీజేపీకి వస్తే ఒకటి లేదంటే అది కూడా లేదు
- బీఆర్ఎస్‌కు 12 నుంచి 14 సీట్లు..
- కచ్చితంగా కేంద్రంలో క్రియాశీలక పాత్ర పోషిస్తాం
- ఈసారి ప్రాంతీయ పార్టీలదే హవా : విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



వివరాలు 5లో

రాబోయేది ఇండియా ఫోరమే

బీజేపీ కుట్రలపై పోరాటం : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రాబోయేది ఇండియా ఫోరం ప్రభుత్వమేనని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. శనివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడారు. మద్యం స్కాం కేసులో తనను అరెస్టు చేసినప్పటికీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయకపోవడానికి గల కారణంపై ఆయన వివరణ ఇచ్చారు. బీజేపీ సారథ్యంలోని కేంద్రం అనుసరిస్తున్న నియంతృత్వం, నకిలీ కేసులో తనను జైలుకు పంపేందుకు జరిగిన కుట్రపై మడమతిప్పని పోరాటం చేస్తాననే సందేశం ఇచ్చేందుకే తాను రాజీనామా చేయలేదన్నారు. తనను కటకటాల వెనక్కి పంపి, ఢిల్లీలోని తన ప్రభుత్వాన్ని కుప్పకూల్చేందుకు బీజేపీ కుట్ర చేసిందని కేజ్రీవాల్ ఆరోపించారు. రాబోయే 20 ఏండ్లలో 'ఆప్' ను ఏ పార్టీ కూడా ఓడించలేదని ధీమా వ్యక్తం చేశారు.

"నేను జైలులో ఉన్నప్పుడు, కొందరు వ్యక్తులు కేజ్రీవాల్ ఎందుకు రాజీనామా చేయరంటూ ప్రశ్నించారు. కేజ్రీవాల్‌కు పదవీ వ్యామోహం లేదు. ఆదాయం పన్ను కమిషనర్ పోస్టును విడిచిపెట్టా. ఢిల్లీ ప్రజల కోసం పదేండ్లు పని చేశా. తొలిసారి ముఖ్యమంత్రి అయ్యా. 49 రోజుల్లో రాజీనామా చేశా. ఇవాళ ఎందుకు రాజీనామా చేయడం లేదు? ఢిల్లీలో మమ్మల్ని ఓడించలేమని బీజేపీకి తెలుసు. ఢిల్లీలో వచ్చే 20 ఏండ్లలో ఏ పార్టీ కూడా ఆప్‌ను ఓడించలేదు. కేజ్రీవాల్ రాజీనామా చేస్తే ప్రభుత్వాన్ని పడగొట్టొచ్చనే కుట్ర జరిగింది. అందుకే రాజీనామా



చేయరాదని నిర్ణయించుకున్నా. ప్రజాస్వామ్యాన్ని కటకటాల వెనక్కి నెట్టేస్తే జైలు నుంచే మేము ప్రజాస్వామ్యాన్ని నడిపిస్తాం. మీ వలలో మాత్రం చిక్కం" అని కేజ్రీవాల్ అన్నారు.

జూన్ 4 తరువాత ఎన్డీఏ రాదు

ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాదని, పలు చోట్ల సీట్లు కోల్పోతుందని కేజ్రీవాల్ చెప్పారు. మెజారిటీ మార్క్ వరకూ చేరదని, సుమారు 230 వరకు సీట్లు రావచ్చని జోస్యం చెప్పారు. జూన్ 4 తరువాత ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం లేదని అన్నారు. హర్యానా, రాజస్థాన్, బీహార్, యూపీ, ఢిల్లీ, కర్నాటక, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ సహా ప్రతి చోట వారి సీట్లు తగ్గుతాయని తెలిపారు. కేంద్రంలో 'ఇండియా' ఫోరం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, కూటమి భాగస్వామిగా ...6లో

కాంగ్రెస్‌కు సర్జికల్ దాడులు చేసే దమ్ముందా..?

ప్రధాని మోడీపై ఒక్క అవినీతి మరకా లేదు : వికారాబాద్ సభలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా



వివరాలు 6లో

పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

- రాష్ట డీజీపీ రవిగుప్త

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సజావుగా సాగేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్టు రాష్ట్ర పోలీస్ ర్ జనరల్ (డీజీపీ) రవిగుప్త ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17 పార్లమెంట్, సికింద్రాబాద్ ...5లో



పోలింగ్‌కు సర్వం సిద్ధం

నేటి సాయంత్రానికి పోలింగ్ స్టేషన్లకు చేరుకోనున్న సిబ్బంది

- 13 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉదయం 7నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు పోలింగ్
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- పోలింగ్ స్టేషన్లకు 100 మీటర్ల దూరంలో నిషేధాజ్ఞలు
- ఇతర ప్రాంతాలవారు వెంటనే ఖాళీ చేసి వెళ్లి పోవాలి
- 13న సెలవివ్వని కంపెనీలు, సంస్థలపై చర్యలు
- ఫిర్యాదులపై 100 నిమిషాల్లో చర్యలు : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్


సమస్యాత్మక ప్రాంతాల్లో మూడంచెల భద్రత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

" పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. నేటి సాయంత్రానికి ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు చేరుకుంటారు. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన 13 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు, మిగతా 106 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. 160 కంపెనీల ...6లో



సైలెన్స్



మూగబోయిన ఎన్నికల మైకులు

- కోడ్ భాషలో ప్రలోభాలు షురూ...
- చివరి అస్త్రాల ప్రయోగంలో రాజకీయపార్టీలు
- అంతుపట్టని ఓటరు నాడి...
- రేపే పోలింగ్

పది రూపాయలు, 20 రూపాయల నోట్లే ఓటర్ల తాయిలాలకు కోడ్‌భాషగా నిలుస్తున్నాయి. హవాలా సొమ్ము లావాదేవీల్లో సగం చినిగిన నోటును చూపిస్తే, మిగిలిన సగం ముక్కతో పోల్చిచూసి, సెట్ చేసినట్టే... రూ.10 నోటు ఇస్తే, చివరి మూడు అంకెలు చూసి క్వార్టర్ మద్యం, రూ.20 నోట్ ఇస్తే వెయ్యి రూపాయలు క్యాష్ చేతిలో పెడుతున్నారని సోషల్ మీడియా కోడై కూస్తోంది.

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాజకీయ రణగొణ ధ్వనులకు చెక్ పడింది. ఎన్నికల ప్రచారం పరిసమాప్తమైంది. ఇప్పటి వరకు నువ్వు అవినీతిపరుడివి అంటే... నువ్వే అవినీతిపరుడివి అని తిట్టుకున్న నోళ్లు ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్నాయి. వచ్చే 24 గంటల్లో ఓటర్లను సైలెంట్‌గా ఆకట్టుకొనేందుకు ప్రధాన రాజకీయపార్టీలు ఎక్కడికక్కడ లోకల్ మేనేజ్‌మెంట్ చేస్తున్నాయి. మద్యం షాపులు కూడా 48 గంటలు మూతపడటంతో శనివారం సాయంత్రానికే కాటన్ల కొద్ది 'మందు' పట్టణాలు, పల్లెలకు తరలిపోయింది. బూత్ లెవల్లో ఎవరి బలం ఎంత అనే లెక్కల్లో రాజకీయపార్టీల నేతలు తలమునకలై ఉన్నారు.

ప్రత్యర్థులు బలంగా ఉన్న చోట ఎక్కువ ఓట్లను ఎలా రాబట్టాలనే చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని పార్టీలు పోల్ మేనేజ్‌మెంట్ పైనే ప్రధానంగా దృష్టిపెట్టాయి. ఇక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలు ఎన్నికల బందోబస్తులో భాగస్వామ్యం అవుతున్నాయి. ఓటర్ల ప్రలోభాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసింది. ఎలాంటి సమాచారం అందినా తక్షణం స్పందించేందుకు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ దళాలను సిద్ధం చేశారు. ఎన్నికల బరిలో నిలిచిన అన్ని పార్టీల అభ్యర్థుల వెంట ఎన్నికల సంఘం షాడో పార్టీలను ఏర్పాటు చేసింది. అభ్యర్థులు ఎక్కడికి వెళ్తే, వారిని వెంబడిస్తూ ఎన్నికల సూక్ష్మ పరిశీలకులతో ...13లో

ఎన్నికల సిబ్బందికి మెనూలో వ్యత్యాసం

తెలంగాణాలో టామాటా పప్పు.. కోడిగుడ్డు కూర.. ఏపీలో విందు భోజనం





నవతెలంగాణ–హైదరాబాద్

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సిబ్బందికి సమతుల ఆహారం అందించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఒక రోజు ముందుగానే పోలింగ్ కేంద్రాలకు చేరుకునే ఎన్నికల సిబ్బందికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. కానీ తెలంగాణాలో పోలింగ్ సిబ్బందికి టామాటా పప్పు.. కోడిగుడ్డు కూర అందజేస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లోని పోలింగ్ సిబ్బందికి మాత్రం విందు భోజనమే అందజేయనున్నారు. తెలంగాణాలో ఈ నెల 12న ఆదివారం ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బందికి సాయంత్రం 4 గంటలకు సమోసా, మజ్జిగ, 5 గంటలకు మజ్జిగ లేదా నిమ్మరసం అందించనున్నారు. రాత్రి 7 నుంచి 8 గంటల మధ్యలో భోజనం (అన్నం, కూర, చపాతీ, టమాటా పప్పు, పెరుగు, చట్నీ) అందిస్తారు. పోలింగ్ రోజు 13న ఉదయం 6 గంటలకు టీ, రెండు అరటి పండ్లు, 8 నుంచి 9 గంటల మధ్య క్యారెట్, టమాటాతో కూడిన ఉప్మా, పల్లీల చట్నీ, 11, 12 గంటల సమయంలో మజ్జిగ పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనం (కోడిగుడ్డు కూర, ఓ కూరగాయ, చట్నీ, సాంబారు, పెరుగు) అందిస్తారు.

మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల ప్రాంతంలో మజ్జిగ లేదా నిమ్మరసం అందజేస్తారు. సాయంత్రం 5.30 గంటలకు టీ, బిస్కెట్లు అందిస్తారు. ఈ ప్రక్రియ గ్రామాల్లో పంచాయతీ అధికారులు, పురపాలికల్లో ప్రత్యేకంగా నియామకమైన వారు పర్యవేక్షించేలా కార్యాచరణ రూపొందించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఫ్యాన్లు, అవసరమైతే కూలర్లు ఏర్పాటు చేయనున్నారు.

ఏపీలో పోలింగ్ సిబ్బందికి విందు భోజనం

ఆంధ్రప్రదేశ్‌లో ఒక రోజు ముందు ఆదివారం సాయంత్రం తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి పోలింగ్ సిబ్బంది చేరుకోగానే వారికి బొండాలు, గారెలు అల్పాహారం, మజ్జిగ లేదా టీ ఇవ్వనున్నారు. రాత్రి 7.30 గంటలకు చపాతి లేదా రోటీ, అన్నం, ఆకుకూర పప్పు, పచ్చడి, ఆలూ టమాట కూర, రసం, పెరుగు, వడియాలు, అరటిపండుతో భోజనం పెట్టనున్నారు. పోలింగ్ రోజు 13వ తేదీ ఉదయం 4.30 గంటలకు టీ, 5 గంటలకు వేడి ఇడ్లీ, గారె, రెండురకాల చెట్నీలతో అందించనున్నారు. 9 గంటలకు ఫ్రూట్స్, మజ్జిగ లేదా కొబ్బరినీరు, 11 గంటలకు కేకు, టీ, మధ్యాహ్నం 12.30 గంటలకు వెజిటబుల్ బిర్యానీ, పెరుగన్నం, నిమ్మకాయ పచ్చడి, 3 గంటలకు ఉస్మానియా బిస్కెట్లు, టీ లేదా ఫ్రూట్‌సలాడ్, సాయంత్రం 6 గంటలకు బొండా, గారె, చెట్నీ, టీ, మజ్జిగ ఇస్తారు. ఇవన్నీ స్థానికంగా తయారు చేయించి, వేడివేడి ఆహారపదార్థాలను ఫ్రెష్‌గా వడ్డించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఒక్కో పోలింగ్ కేంద్రానికి 15 మంది సిబ్బంది చొప్పున మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలని ఆదేశించారు.

గుండెపోటుతో ప్రముఖ కవి కన్నుమూత

పంజాబ్ : పంజాబ్‌కు చెందిన ప్రముఖ కవి, రచయిత సుర్జిత్ పటార్ (79) కన్నుమూశారు. గుండెపోటుతో శనివారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. దీంతో పంజాబ్ సాహిత్య సమాజం శోకసంద్రంలో మునిగిపోయింది. ఆయన మతి పట్ల వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు, కవులు, రచయితలు, అభిమానులు సంతాపం తెలిపారు. 1945లో జలంధర్ జిల్లాలోని పతర్ కలాన్ గ్రామంలో జన్మించిన డాక్టర్ పటార్.. పాటియాలాలోని పంజాబ్ యూనివర్శిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం అమత్‌సర్‌లోని గురునానక్ దేవ్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. పంజాబ్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు.

అంతేగాక సాహిత్య రంగంలో ప్రత్యేక ముద్ర వేశారు. పటార్ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2012లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.అలాగే ఆయనకు 1979లో పంజాబ్ సాహిత్య అకాడమీ అవార్డు, 1993లో సాహిత్య అకాడమీ అవార్డు, 1999లో పంచానంద్ పురస్కారం, 2007లో ఆనంద్ కావ్య సమ్మాన్, 2009లో సరస్వతి సమ్మాన్, గంగాధర్ జాతీయ పద్య పురస్కారం లభించాయి. 2014లో కుసుమాగ్రజ్ లిటరరీ అవార్డు సైతం లభించింది. అయితే కేంద్ర తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న రైతులకు సుర్జిత్ మద్దతు తెలిపారు. చట్టాలను వెనక్కి తీసుకోకపోతే తన పద్మశ్రీని వెనక్కి ఇస్తానని ప్రకటించారు.

న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు

- సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాష్ట్రంలోని న్యాయవాదుల ఆరోగ్య బీమాకు త్వరలోనే రూ.100 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం తనను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులకు ఈ మేరకు సీఎం మాట ఇచ్చారు. తమకు ఆరోగ్య బీమా పథకానికి అవసరమైన నిధులు కేటాయించాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు సీఎంకు విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం తగిన సహకారం అందించాలని కోరారు. గతంతో పోలిస్తే న్యాయవాదుల సంఖ్య పెరిగిందనీ, అందుకు తగినట్టుగా న్యాయవాదుల సంక్షేమ సంఘానికి తగినంత ఆర్థిక సాయం అందించాలని విన్నవించారు. న్యాయవాదుల వృత్తి పట్ల తనకు ఎంతో గౌరవముందని సీఎం తెలిపారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనీ, న్యాయవాదుల ఆరోగ్య బీమాకు తగినన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే సంక్షేమ సంఘానికి రూ.100 కోట్లు విడుదల చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సహకారం సోదర న్యాయవాదులందరికీ మేలు చేస్తుందని సీఎం ఈ సందర్భంగా చెప్పారు.



ఎవడబ్బ సొమ్మనీ..!

వ్యంగ్య రచన

ఎన్నికల నియమావళి ఇంత ఘోరంగా పదే పదే ఉల్లంఘించబడుతూంటే ఎన్నికల సంఘం (ఈసీ) ఏం చేస్తున్నట్టు? ఉల్లంఘించేవారు మెజారిటీ భారతీయుల్ని మైనారిటీపై రెచ్చగొట్టేందుకు రకరకాల 'కత'లు పడుతున్నా వారిపై ఈసీ చేష్టలుడిగి చూడ్డం యేమైనా బాగుందా? ఇద్దరి మధ్యా ఇంత ఘర్షణ వాతావరణం తేవడం సబబేనా ఆలోచించండి. 'సంపద పున:పంపిణీ' అంటూ పాత చింతకాయ పచ్చడి సోషలిస్టు వాగాడంబరాన్ని ప్రదర్శించడం, అదీ ఇరవై ఒకటో శతాబ్దపు మొదటి భాగంలో చెప్పటం ఏవిధంగా చూసినా కరెక్టు కాదు.

నేను ఇప్పటిదాకా చెప్పింది కాంగ్రెస్ మేనిఫెస్టో గురించేనని సూక్ష్మబుద్ధులైన మీరు గుర్తు పట్టే ఉంటారు. నేను ఆర్థికవేత్తను కానని ముందే ఒప్పుకుంటున్నాను. అలానే రస్సెల్‌క్రో లాగా లెక్కల మాస్టరు వేషాలేసిన సినీ నటుడ్నీ కాదు. ఏమాటకామాటే చెప్పుకోవాలి. ఆర్థిక శాస్త్రం రాకెట్ సైన్స్ కాదు. నా ఉద్దేశంలో అసలు సైన్సే కాదు. మీలో కొందరు ఒక ప్రఖ్యాత 'ఆర్థిక కాలమ్' చూసుంటారు. దాని పేరు "రుజువులు అవసరం లేదు. కాబట్టి రుజువైంది". తెలివైన వారు సంపద పున:పంపిణీ వంటి ఆర్థికాంశాలకు సులభంగా పరిష్కారాలు చెప్పేస్తూంటారు. కాబట్టి ఆర్థిక పరమైన అంశాలపై నాకున్న ఇంగితజ్ఞానంపై ఆధారపడి ఈ చర్చలోకి నేను ప్రవేశిస్తున్నాను. నన్ను భరించగలిగితే మీకు లోతైన విషయాలు అనుభవంలోకొస్తాయి.

కీలకప్రశ్ననే పరిశీలిద్దాం. ఏ పార్టీ అధికారంలో ఉందనే దాంతో సంబంధం లేకుండా ఎల్లవేళలా సంపద పున:పంపిణీ జరుగుతూనే ఉంటుంది. ఇది రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి మంచి విధానం. అంటే సామాజికంగా నిచ్చెన మెట్లలో ఎవరుండాల్సిన చోట వారిని కులవ్యవస్థలాగా, నిలిపి సాంఘిక వ్యవస్థ నిలబడి ఉండేలా చూడటం. రెండవది చెడ్డ పద్ధతి. సాంఘిక వ్యవస్థలో ఒకరితో ఒకరు తగాదా పడేలా చేసి వ్యవస్థలో అనవసర ఘర్షణ వాతావరణాన్ని సృష్టించడం. ఆ రకంగా సాంఘిక సమస్యలు సృష్టించడం.

పేదలు ఆనందంగా ఉన్నారు

గత దశాబ్ద కాలంగా మధ్య తరగతి వారి నుంచి, పేదల నుంచి శత, సహస్ర కోటీశ్వరులకు సంపద పున:పంపిణీ జరుగుతూంటే నేటి వరకు పేదలంతా ఆనందంగా ఉన్నారు. వారి సంపద పెరుగుతోంది కాబట్టి సంపన్నులు హ్యాపీగా ఉన్నారు. రామ మందిరం దక్కినందుకు పేదలు ఆనందంగా ఉన్నారు. పైగా వాట్సాప్ యూనివర్సిటీలో భాగస్వాములవడం వల్ల కూడా వారి ఆనందానికి అవధుల్లేవు. పేదలుగా ఉన్నందుకు పేదవారికి ఇంకేమి గుర్తింపు కావాలి. ఈ దశలో సంపద పున: పంపిణీని రివర్స్ మార్గంలో అంటే ధనికుల నుంచి పేదలకు పంపిణీ చేస్తానని చెప్పడం ఎలా న్యాయం చెప్పండి; ఇది సహజ న్యాయానికి భిన్నం కదా? మీ మామ నిజంగా ఎలాన్‌మస్క్ కాకున్నా ఎలాన్‌మస్క్‌లా వెలిగిపోవడానికి ఉన్నదారులన్నీ ఇది మూసేయడం కదా!? రెండవ ముఖ్యమైన అంశం హెచ్ఎన్ఐ (హైనెట్ వర్త్ ఇండివిడ్యువల్స్) కొన్ని కోట్లాది మందిని అవమానించడం కదా! (వార్షికాదాయం పది లక్షల డాలర్లున్న వారిని హెచ్ఎన్ఐ లంటారు)

శతాబ్దాలుగా కొద్ది మందిగా ఉన్న సంపన్నులను విజయవంతంగా మోస్తున్న కష్టజీవుల గురించి అంత అవమానకరంగా ఎందుకు కాంగ్రెస్ ఆలోచిస్తున్నది. ప్రపంచ అసమానతా సూచీ ప్రకారం పై ఒక శాతంగా ఉన్న భారతీయుల చేతిలో కేవలం 40.1 శాతం సంపదుంది. 99 శాతం మంది చేతిలో మిగిలిన 59.9 శాతం సంపదంతా ఉంది. ప్రధాని ఉపన్యాసాల్లో చెప్తున్నట్టు మన జనాభా 140 కోట్లు (జనాభా లెక్కల్లేవు కదా!) దాన్లో 1 శాతం, అంటే 1.40 కోట్లు. 138.60 కోట్ల మంది 1.40 కోట్లకు మద్దతుగా నిలబడకపోవడం తప్పంటే, ఏ ఆర్థికశాస్త్రవేత్త అయినా కాదనగలరా? కాంగ్రెస్ పార్టీ యొక్క విప్లవాత్మక మేనిఫెస్టో బలపరచలేరం టోంది ఎందుకు? ధనికుల పై పేదల బుర్రల్లో ద్వేషాగ్నిని రగుల్కొల్పడమే వారి ఉద్దేశం.

నిరుద్యోగంపై వారి యావ!

ధనికులు, పేదలనే మాటలు 1960 ల నాటివి. అలానే నిరుద్యోగం గురించి కూడా కాంగ్రెస్ యావ అలాంటిదే. కృత్రిమ మేధ రోజుల్లో మెడ మీద తలున్న ఎవరైనా ఉద్యోగా ల గురించి మాట్లాడతారా? నేడు పేదలైనా, ధనికులైనా సంపద సృష్టికర్తలుగా ఉండాలనుకుంటున్నారు. ఉద్యోగాల కోసం దేబిరించే వారిగా కాదు. కాంగ్రెస్ చేసే ప్రయత్నమంతా ఇలాంటి చర్చ ద్వారా ఓట్లను తనవైపు లాక్కోవాలనే! ఇది అతి తక్కువగా ఉన్న మైనారిటీ ధనికులపై విద్వేష ప్రసంగమే.

దీనిపై ఈసీ నోరు మెదపకపోవడం దుర్మార్గం కదా!

(హిందూ సౌజన్యంతో) అనువాదం : ఆరెస్బీ

ప్రతికూల పవనాలు..!

బెడిసికొడుతున్న బీజేపీ వ్యూహాలు

పట్టున్న రాష్ట్రాల్లో పడిపోతున్న బలం

ప్రతిపక్ష నేతలకు ఎర...కొత్త పొత్తులకు వల

దారికి రాకపోతే దండనే

అయినా కానరాని సానుకూల వాతావరణం



న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల పోరులో మూడు దశలు పూర్తయ్యాయి. ఏప్రిల్ 19న జరిగిన తొలి దశ పోలింగ్‌లో 17 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 102 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. రెండో దశలో 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 88 స్థానాలకు గత నెల 26న పోలింగ్ జరిగింది. ఇక మూడో విడత ఎన్నికల్లో భాగంగా ఈ నెల 7న 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 93 స్థానాలకు పోలింగ్ ముగిసింది. మొత్తంగా ఇప్పటి వరకూ 283 స్థానాల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. అంటే సగానికి పైగా నియోజకవర్గాల్లో అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేశారన్న మాట. అయితే ఏడు విడతల ఎన్నికలు పూర్తయ్యే వరకూ...అంటే జూన్ 1వ తేదీ వరకూ ఎగ్జిట్‌పోల్ ఫలితాలను ప్రకటించకుండా ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. కానీ ఓటర్ల మనోభావాలను పసిగట్టిన అనేక సంస్థలు ఫలితాలపై అంచనాలు వేస్తున్నాయి.

బీజేపీ ఆశించిన విధంగా ఫలితాలు ఏకపక్షం కాబోవని పలు సర్వేలు ఇప్పటికే అనధికారికంగా తేల్చి చెబుతున్నాయి. బీజేపీకి వరుసగా మూడోసారి ఓటు వేయడానికి ప్రజలకు కారణాలేవీ కన్పించడం లేదు. బీజేపీకి ఓటేస్తే ఉద్యోగాలు ఇస్తుందన్న ఆశతో 2014 ఎన్నికల్లో ఆ పార్టీకి మద్దతు తెలిపిన యువత ఇప్పుడు తీవ్ర నిరాశలో కూరుకుపోయింది. మోడీ పాలనలో నిరుద్యోగం గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ గణాంకాలతో పోలిస్తే నిరుద్యోగ రేటు చాల అధికంగా ఉంది. జన్మకో శివరాత్రి మాదిరిగా ఎప్పుడో ఓ ఉద్యోగ ప్రకటన వెలువడుతోంది. పదుల సంఖ్యలో ఉద్యోగాలకు వేలు, లక్షల్లో నిరుద్యోగులు పోటీ పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నిరుద్యోగ యువత ఏ ఆశతో బీజేపీకి మరోసారి ఓటేస్తుంది? మరోవైపు 2014తో పోలిస్తే 80 శాతం మంది భారతీయుల ఆదాయాలు పడిపోయాయి. దీంతో అటు కొనుగోలు శక్తి, ఇటు కుటుంబ పొదుపు తగ్గిపోయాయి. తమ సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చాలా మంది నిందిస్తున్నారు.

కానరాని సానుకూలత

మోడీ కరిష్మా సంగతలా ఉంచితే... బీజేపీ అభ్యర్థుల విషయంలో మాత్రం ఓటర్లలో సానుకూలత కన్పించడం లేదు. పైగా ఇటీవల కాలంలో ముస్లిం మైనారిటీలపై మోడీ చేస్తున్న వ్యాఖ్యలు కమలదళానికి నష్టం కలిగిస్తున్నాయి. విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తే హిందువులు భావోద్వేగానికి గురై బీజేపీకి గంపగుత్తగా ఓట్లు వేస్తారని బీజేపీ ఆశిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కన్పిస్తున్నాయి.

బీజేపీ ఎత్తుగడలు

బీజేపీ నేతల విద్వేష ప్రసంగాల్లో వారి నిరాశానిస్పృహలు, అసహనం స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఉదాహరణకు బీజేపీ ఓటమి చెందితే దేశంలో షరియా చట్టం ప్రవేశిస్తుందని హోం మంత్రి అమిత్ షా హెచ్చరించారు. మత ప్రాతిపదికన ఓట్లను సమీకరించడానికి బీజేపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు ఆ పార్టీ ఎత్తుగడలో భాగమే. ముస్లింలను దుర్మార్గులుగా, విలన్లుగా చిత్రీకరించడం ద్వారా దేశ జనాభాలో 80 శాతంగా ఉన్న హిందువుల ఓట్లలో కనీసం సగం సంపాదించుకోగలిగినా మరో భారీ విజయాన్ని సొంతం చేసుకోవచ్చునని బీజేపీ కలలు కంటోంది.

అయితే ఈ వ్యూహం పెద్దగా ఫలించేలా కన్పించకపోవడంతో బీజేపీ మరో ఎత్తుగడ వేసింది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులను పార్టీలో చేర్చుకోవడం ద్వారా బలాన్ని పెంచుకోవచ్చునని బీజేపీ భావిస్తోంది. ముఖ్యంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతిపక్ష నేతలను నయానో భయానో ఒప్పించి, తన గూటికి చేర్చుకుంటోంది. విచారణను తప్పించుకోవడానికి వారు కూడా కమలదళంలో చేరిపోతున్నారు. బీజేపీ వాషింగ్ మెషిన్ కళంకిత రాజకీయ నాయకులను శుభ్ర పరుస్తుందన్న మాట ఇప్పుడు ఓ జాతీయ జోక్‌గా మారిపోయింది.

ప్రతిపక్షాలతో జట్టుకు ప్రయత్నాలు

ఓ వైపు ఈ ప్రయత్నాలు చేస్తూనే మరోవైపు వివిధ ప్రతిపక్ష పార్టీలతో బీజేపీ కూటములు కడుతోంది. కొద్ది సంవత్సరాల క్రితం మోడీ ప్రభుత్వంపై లోక్‌సభలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు ఎన్డీఏ భాగస్వామ్య పక్షంగా మారిపోయింది. ప్రధాని మోడీపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గతంలో పలు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. వాటన్నింటినీ ఇప్పుడు రెండు పార్టీలూ మరిచిపోయాయి. తూర్పున ఉన్న ఒడిషాలో బిజూ జనతాదళ్‌తో, పశ్చిమాన ఉన్న పంజాబ్‌లో అకాలీదళ్‌తో జట్టు కట్టేందుకు బీజేపీ ఉత్సుకత ప్రదర్శించింది. అయితే ఆ ప్రయత్నాలు ఫలించలేదు. బీజేపీ ఉత్సాహంపై ఆ రెండు పార్టీలు నీళ్లు చల్లాయి.

వెంటాడి వేటాడుతూ...

తన ప్రయత్నాలు పెద్దగా ఫలించకపోవడంతో బీజేపీ ప్రతిపక్షాలను భయపెట్టడం మొదలు పెట్టింది. మద్యం స్కాం కేసులో ఆమ్‌ఆద్మీ పార్టీ అధ్యక్షుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపింది. ఆ పార్టీ ప్రస్తుతం ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. చివరికి సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో కేజ్రీవాల్ బయటపడ్డారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా సంవత్సరకాలానికిపైగా జైలు జీవితం గడుపుతున్నారు. కానీ ఆయనపై ఇప్పటి వరకూ అభియోగాలే మోపలేదు. ఎన్నికల ప్రచారం ప్రారంభ దశలోనే ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేసింది. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను సోదా చేసింది. ఈ చర్యలన్నీ అసహనంతో కూడుకున్నవే. ప్రజల మద్దతు తమకే ఉన్నదని చెప్పుకునే పార్టీ ఇలాంటి కక్షసాధింపు చర్యలకు దిగాల్సిన అవసరమే లేదు. అధికారం చేజారిపోతుందన్న బాధే ఈ చర్యలకు ఉసిగొల్పుతోందని అర్థమవుతోంది.

బలం తగ్గుతోంది

2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఆరు రాష్ట్రాల్లో క్లీన్‌స్వీప్ చేసింది. మూడు రాష్ట్రాల్లో ఒక్కో స్థానం మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలనూ కైవసం చేసుకుంది. రెండు రాష్ట్రాల్లో రెండేసి సీట్లను మాత్రమే కోల్పోయింది. అయితే ప్రస్తుతం ఈ రాష్ట్రాలన్నింటిలోనూ బీజేపీ బలం తగ్గుముఖం పట్టిందే తప్ప పెరిగిందేమీ లేదు. ఒక్కో రాష్ట్రంలో కొన్ని సీట్లను కోల్పోయినప్పటికీ మొత్తంగా మెజారిటీ చేజారుతుంది. ప్రస్తుతం బీజేపీకి సాధారణ మెజారిటీ కంటే 32 స్థానాలు మాత్రమే ఎక్కువ ఉన్నాయి.

కానరాని భావోద్వేగాలు

2019 ఎన్నికల్లో బీజేపీ విజయానికి 'ఉగ్రవాద దాడి' కూడా దోహదపడింది. కాశ్మీర్‌లో సైనిక వాహనంపై జైషే మహమ్మద్ ఉగ్రవాదులు దాడి జరిపారు. దీనిని బీజేపీ ఎన్నికల అంశంగా మార్చుకుంది. అయితే ఇప్పుడు అలాంటి భావోద్వేగపూరితమైన ఘటనలేవీ జరగకపోవడంతో పూర్వ ప్రాభవాన్ని పొందే అవకాశాలు లేవని బీజేపీకి అర్థమైపోయింది. అదీకాక గతంలో ఎన్నికల సమయంలో బీజేపీ ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదు. మరోవైపు ప్రతిపక్షాల్లో దృఢ విశ్వాసం కన్పిస్తోంది. మొత్తంమీద గాలిలో మార్పు కన్పిస్తోంది !.

బీజేపీ హిందుత్వానికి.. మా హిందుత్వానికి తేడా ఉంది : ఉద్ధవ్ ఠాక్రే

ముంబయి : 'ఇండియా' బ్లాక్‌లో భాగస్వామ్య పార్టీ అయిన శివసేన (యూబీటీ) అధినేత, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీజేపీ హిందుత్వానికి, తమ హిందుత్వానికి తేడా ఉందని ఎన్నికల ప్రచార సభలో అన్నారు. మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఠాక్రే మాట్లాడుతూ.. 'మా హిందుత్వం ఇంట్లో పొయ్యిలు వెలిగిస్తుంటే.. బీజేపీ హిందుత్వం ఇండ్లను తగలబెడుతోంది.' అన్నారు. ప్రచార సభల్లో ప్రధాని మోడీ పదే పదే ముస్లింల జనాభా పెరుగుదలపై మాట్లాడుతున్నారు. దేశంలో ముస్లిం జనాభా పెరగడం ఆయన విజయమా? లేక వైఫల్యమా అనే విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. ముస్లింల జనాభా పెరుగుదలపై మోడీని అభినందించాలా? లేక విమర్శించాలా అనే దానిపై అయోమయం నెలకొందని ఉద్ధవ్ ఠాక్రే మండిపడ్డారు. ఇప్పటికైనా హిందువు- ముస్లింల పేరుతో రాజకీయాలు చేయడం బిజెపి మానుకోవాలని ఠాక్రే సూచించారు. మోడీ డ్రామా కేవలం 4వ తేదీ వరకే కొనసాగుతుందని ఆయన జోస్యం చెప్పారు.

ముగిసిన నాలుగో దశ ప్రచారం

10 రాష్ట్రాల్లో 96 స్థానాలకు పోలింగ్

- బరిలో 1,717 మంది అభ్యర్థులు
- ఏపీ, ఒరిస్సాలో అసెంబ్లీకీ పోలింగ్

ఏపీలో 2,368 మంది ఎమ్మెల్యే, 454 మంది ఎంపీ అభ్యర్థులు

- తెలంగాణలో 525 మంది ఎంపీ అభ్యర్థులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో నాలుగో దశ పోలింగ్ రేపు (సోమవారం) జరగనుంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 6 గంటలతో ముగిసింది. ఈ దశలో మొత్తం 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మొత్తం 96 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ (25), తెలంగాణ (17), ఉత్తరప్రదేశ్ (13), మహారాష్ట్ర (11), మధ్యప్రదేశ్ (8), పశ్చిమ బెంగాల్ (8), బీహార్ (5), జార్ఖండ్ (4), ఒరిస్సా (4), జమ్మూకాశ్మీర్ (1) లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అలాగే ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ స్థానాలకు 2,368 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఒరిస్సాలో 147 అసెంబ్లీ స్థానాలుండగా, నాలుగో దశలో 28 స్థానాలకు పోలింగ్ జరగనుంది. మిగిలిన 119 స్థానాలకు వచ్చే మూడు దశల్లో పోలింగ్ జరుగనుంది. 96 లోక్‌సభ స్థానాలకు 1,717 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

లోక్‌సభ ఎన్నికల బరిలో ఏపీలో మొత్తం 25 పార్లమెంట్ స్థానాలకు గాను 454 మంది పోటీలో నిలిచారు. అలాగే, తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు గాను 525 మంది పోటీలో ఉన్నారు. బీహార్‌లో ఐదు పార్లమెంట్ స్థానాలకు 55 మంది, జమ్మూ కాశ్మీర్‌లో ఒక్క పార్లమెంట్ స్థానానికి 24 మంది, జార్ఖండ్‌లో నాలుగు పార్లమెంట్ స్థానాలకు 45 మంది, మధ్యప్రదేశ్‌లో ఎనిమిది స్థానాలకు 74 మంది, మహారాష్ట్రలో 11 పార్లమెంట్ స్థానాలకు 209 మంది, ఒరిస్సాలో నాలుగు పార్లమెంట్ స్థానాలకు 37 మంది, ఉత్తరప్రదేశ్‌లో 13 స్థానాలకు 130 మంది, పశ్చిమ బెంగాల్లో ఎనిమిది పార్లమెంట్ స్థానాలకు 75 మంది పోటీ చేస్తున్నారు. అఖిలేష్ యాదవ్ (ఎస్పీ), గిరిరాజ్ సింగ్ (బీజేపీ), అర్జున్ ముండా (బీజేపీ), మహువా మొయిత్రా (టీఎంసీ), యూసఫ్ పఠాన్ (టీఎంసీ), శత్రుఘ్న సిన్హా (టీఎంసీ), అధిర్ రంజాన్ చౌదరి (కాంగ్రెస్), అసదుద్దీన్ ఓవైసీ (ఎంఐఎం), వైఎస్ షర్మిలా (కాంగ్రెస్) వంటి ముఖ్యులు పోటీ చేస్తున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగనుంది.

కర్నాటకలో మరో కీచక నేత

లైంగిక వేధింపుల కేసులో బీజేపీ నాయకుడి అరెస్ట్



న్యూఢిల్లీ : లైంగిక వేధింపుల కేసులో జేడీ(ఎస్) బహిష్కృత నేత, హసన్ సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఉదంతం ఇప్పటికే కర్నాటకను వణికిస్తున్నది. బీజేపీ మిత్రపక్షమైన జేడీ(ఎస్) నాయకుడి దారుణ చర్యలు బయటికి వచ్చిన కొన్ని రోజులకే.. బీజేపీకి చెందిన నాయకుడు లైంగిక వేధింపుల కేసులో అరెస్టు కావటం గమనార్హం. న్యాయవాది కూడా అయిన జి. దేవరాజే గౌడను లైంగిక వేధింపుల కేసుకు సంబంధించి కర్నాటకలోని చిత్రదుర్గ జిల్లాలో శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. ప్రజ్వల్ రేవణ్ణ అనేక మంది మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు చూపుతున్న అనేక వీడియోలు తన వద్ద ఉన్నాయని గౌడ గతంలో చెప్పాడు. ప్రజ్వల్ రేవణ్ణను ఎన్నికల్లో పోటీకి దించకుండా పార్టీని హెచ్చరిస్తూ డిసెంబర్ 8న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీ.వై విజయేంద్రకు లేఖ రాసినట్టు కూడా సమాచారం. అయితే, ప్రజ్వల్ రేవణ్ణ స్వయంగా రికార్డ్ చేసిన వీడియోలు ఏప్రిల్ 26న వెలుగులోకి వచ్చిన తర్వాత, వాటిని కాంగ్రెస్ లీక్ చేసిందని గౌడ వివరించారు. గతనెలలో హాసన్ జిల్లాలోని హొలెనర్సిపూర్ పట్టణంలో గోవధపై ఒక మహిళ ఫిర్యాదు చేసింది. చట్టపరమైన విషయంలో తనకు సహాయం చేస్తానని హామీ ఇచ్చి, తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని బాధిత మహిళ ఆరోపించింది. దీంతో పోలీసులు బీజేపీ నేతకు నోటీసులు జారీ చేశారు. మహిళ ఫిర్యాదు మేరకు గౌడను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. రాష్ట్రంలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హొలెనర్సీపూర్ నుంచి బీజేపీ గౌడను పోటీకి దింపింది. అయితే, ప్రజ్వల్ రేవణ్ణ తండ్రి, రాష్ట్ర మాజీ మంత్రి, జేడీ(ఎస్) ఎమ్మెల్యే హెచ్.డి రేవణ్ణ చేతిలో ఆయన ఓడిపోయారు.కాగా, ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణకు ఏప్రిల్ 27న కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బందాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే. ప్రస్తుతం ప్రజ్వల్ రేవణ్ణ జర్మనీలోని మ్యూనిచ్‌లో ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి.


ఓటుపై యువత అనాసక్తి

రాజకీయపార్టీలు, వారి వాగ్దానాలపై అసంతృప్తి

- అంతర్గత వలసలూ కారణమే
- ముఖ్యంగా పట్టణ ఓటర్లు దూరం


న్యూఢిల్లీ : దేశంలో యువత ఓటు చాలా కీలకం. దేశ భవిష్యత్తును నిర్ణయించటంలో వారి ఓటు హక్కు పెను మార్పును తీసుకొస్తుంది. కానీ, ఆ యువత తన బాధ్యతను విస్మరిస్తున్నది. ఓటు హక్కుకు దూరంగా ఉంటూ అసమర్ధ నాయకులు పాలకులవ్వటానికి పరోక్షంగా కారణమవుతున్నదని మేధావులు, విశ్లేషకులు అంటున్నారు. కొన్ని గణాంకాల ప్రకారం.. 25 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న 50 శాతం జనాభాతో భారత్ 'యువ దేశం'గా ఉన్నది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో యువత గణనీయమైన పాత్ర పోషిస్తుందనటంలో ఎలాంటి సందేహమూ లేదని వారు అంటున్నారు.

దేశవ్యాప్తంగా 2024 ఎన్నికల కోసం 18-19 సంవత్సరాల మధ్య వయస్సు గల ఓటర్లలో 40 శాతం కంటే తక్కువ మంది తమ ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారని భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) డేటాను విడుదల చేసింది. ఢిల్లీ, బీహార్, యూపీలలో అత్యల్ప నమోదు రేట్లు ఉన్నాయి. అయితే, ఇది ప్రజాస్వామ్య దేశానికి చాలా ప్రమాదకరమని మేధావులు అంటున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో.. బీజేపీకి యువ ఓటర్ల నుంచి వచ్చిన ఓట్లు 41 శాతం. ఇది 2014 లోక్‌సభ ఎన్నికల కంటే ఏడు శాతం ఎక్కువ. దీంతో యువ ఓటర్లు బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించారని తెలుస్తున్నది. డెక్కన్ హెరాల్డ్ నివేదిక ప్రకారం.. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలకు చెందిన యువత ఎన్నికలపై తక్కువ ఆసక్తి చూపుతున్నారని ఈసీఐ తెలిపింది. యువకులు తమ స్వగ్రామాల నుంచి తరలివెళ్లిన అంతర్గత వలసలు.. ఓటర్ల సంఖ్య లేకపోవటానికి ప్రధాన కారణమని విశ్లేషకులు గుర్తించారు.



18-27 సంవత్సరాల మధ్య వయస్సు గల కొంతమంది నమోదిత, నమోదు కాని యువ ఓటర్లు చాలా మంది అంతర్గత వలసలను ప్రధాన కారణంగా చెప్పారు. అయితే ఈ సంవత్సరం లోక్‌సభ ఎన్నికలలో కూడా కీలక రాజకీయ పార్టీల వారు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు.

ప్రస్తుతం లా స్కూల్‌లో చదువుతున్న సుహత(19).. పాలనా వ్యవస్థపై, ఓటింగ్‌పై తనకు ఆసక్తి లేదని చెప్పింది. ఈ తరం ఓటింగ్ పట్ల ఆసక్తి కోల్పోవటానికి పార్టీలకు జవాబుదారీతనం లేకపోవటం మరో ప్రధాన కారణంగా తెలిపింది. చంద్రిమా(20) మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో చేసిన ప్రతిష్టాత్మక వాగ్దానాల మధ్య అసమానత గురించి, ఎన్నికల తర్వాత ఏదీ కార్యరూపం దాల్చని అనుభవాల వాస్తవికత గురించి అసంతృప్తిని వ్యక్తం చేసింది. అయితే, యువ ఓటర్లు స్పష్టమైన మార్పు తీసుకొచ్చిన వారికి మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మంచి పని చేశారనీ, అయితే ఆయనకు ఓటు వేయటానికి వెళ్లడం తనకు ఇష్టం లేదని అన్వేష (23) తెలిపింది. తన కుటుంబంలో ఓటు వేసే సంస్కృతిని తాను చూడలేదనీ, దీంతో ఓటు వేయటానికి ఇష్టపడటం లేదని ఆమె తెలిపింది. మయాంక్ (21) మాట్లాడుతూ.. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా సాధారణ



ప్రజలకు ఎవరూ సహాయం చేయటం లేదని అసంతృప్తిని వ్యక్తం చేశాడు. ముఖ్యంగా విద్యావ్యవస్థ విషయంలో ఇదే జరుగుతున్నదని అన్నారు.

అధికారంలో ఉన్నవారు డబ్బును ఆఫర్ చేసినప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోని జనాభా ప్రభావితమవుతున్నదని దృష్టి(23) ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ఓటరు తన నియోజక వర్గాన్ని మార్చుకునే విషయం గురించి కూడా అవగాహన లేకపోవటం, నివాసం మారిన సందర్భంలో కూడా ఒక ప్రధాన కారణమని తెలుస్తున్నది. ప్రస్తుతం మహారాష్ట్రలో నివసిస్తున్న అసోంకు చెందిన 18 ఏండ్ల రితిక్క మాట్లాడుతూ.. మహారాష్ట్రలో తన తాత్కాలిక నివాసం కంటే అసోం గురించి తనకు ఎక్కువ తెలుసనీ, అందుకే తన ఓటును వేరే రాష్ట్రానికి మార్చుకోవటం ఇష్టం లేదని తెలిపింది. ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న ఆదిత్ (21)కు ఓటు నమోదు చేసుకోవడానికి, ఓటు వేయడానికి సమయం లేదట. 22 ఏండ్ల షాను.. ఎన్నికల్లో పోటీ చేసేవారిలో యువత ప్రాతినిధ్యం లేకపోవడమే తనకు ఓటు వేయడానికి ఇష్టపడక పోవడానికి ప్రధాన కారణమని తెలిపింది. యువతరం ఎదుర్కొంటున్న సమస్యలను, ముఖ్యంగా విద్యా ఒత్తిడి కారణంగా ఆత్మహత్యలు వంటి సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకుంటే, తాను రాజకీయాల్లో చురుకుగా పాల్గొని ఓటు వేస్తానని ఆమె చెప్పారు. ఓషిక్ (20) మాట్లాడుతూ.. ఒక పార్టీకి మద్దతు ఇవ్వటంపై తనకు నమ్మకం లేదని చెప్పాడు. ప్రస్తుతం ఢిల్లీలో నివాసం ఉంటున్న కాశ్మీర్‌కు చెందిన అత్రూబా (27).. ప్రతిపక్షం, అధికార పక్షంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు.దేశ భవిష్యత్తును నిర్ణయించే సార్వత్రిక ఎన్నికల్లో యువ ఓటర్లు తప్పక పాల్గొనాలని నిపుణులు, మేధావులు సూచిస్తున్నారు. యువ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుంటే సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవచ్చునీ, అది కాదని ఉన్నత విద్యను అభ్యసిస్తున్న యువత సైతం ఓటుపై అనాసక్తిని వ్యక్తం చేయటం చాలా బాధాకరమని చెప్తున్నారు. ఓటు హక్కుపై అవగాహనా కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాలని అంటున్నారు.

గెలవకపోవడం ఓటమి కాదు,
మళ్లీ ప్రయత్నించకపోవడమే నిజమైన ఓటమి - శ్రీశ్రీ

"జాగ్రత్త ... ప్రతి ఓటూ, ఒక..... నీ పచ్చి నెత్తురు మాంసం ముద్దచూస్తూ చూస్తూ వేయకు ఏదో ఓ గద్దకి. అది కేవలం కాగితం మీద గుర్తు కాదు, జీవితం కింద ఎర్తు" అంటాడు అలిశెట్టి ప్రభాకర్. దేశ భవిత, మరో ఐదేండ్లు తీర్చిదిద్దుకోవటానికి జరుగుతున్న ఎన్నికలివి. ఇప్పటికి గత పదేండ్లుగా బీజేపీ నాయకత్వాన ఉన్న ఎన్డీయే పరిపాలన మనకు చాలా స్పష్టంగానే అనుభవంలోకి వచ్చింది. మనం ఓటు వేసే ముందు తప్పకుండా ఈ పదేండ్లనూ ఒకసారి మననం చేసుకోవాలి. భవిష్యత్తు ఎలా ఉండాలో నిర్ణయించుకోవాలి. చాలామంది ప్రజలు జరిగిపోయిన సంఘటనలను, ఇబ్బందులను, ప్రభుత్వం పెట్టిన బాధలను, పెంచిన ధరలను, విధ్వంసాలను, అమానవీయతలను మరచిపోతుంటారు. ఇక్కడే జాగ్రత్త వహించాలి. ఎన్నికల వేల మాటలకు తేనెపూస్తారు. అమాయకంగా లెక్కలేనన్ని వాగ్దానాల్నీ వెద జల్లుతారు. మేమలా అనలేదనీ, మమ్మల్ని నమ్మండనీ వేడుకుంటారు. ఘనమైన ప్రచార ఆర్భాటాలకూ పూనుకుంటారు. ఛానెళ్లు, మీడియా, పత్రికలు అన్నీ వాళ్లవైపే ఊదరకొడుతుంటాయి.అందుకనే, వాళ్ల మాటలు పక్కనపెట్టి గతంలో వాళ్లేమి చెప్పి వచ్చారో, ఏం చేశారో బేరీజు వేసుకోవాలి.



నేటి కేంద్ర పాలకుల ఆలోచనలకు ఆద్యుడు, సిద్ధాంతకర్త అయిన గోల్వాల్కర్,సావర్కర్‌లు, మన జాతీయ జెండాను ఎగుర వేయటాన్ని అంగీకరించలేదు. అంబేద్కర్ రాజ్యాంగాన్నీ ఒప్పుకోలేదు. మనుస్మృతి మా ఆచరణని బహిరంగంగానే చెప్పారు. ఇప్పుడు సనాతన ధర్మమైన కులవ్యవస్థనూ సమర్థిస్తున్నారు. దేశ ప్రజలందరూ సమానమన్న రాజ్యాంగ విలువను వీరు అంగీకరించరు. హిట్లరు మా ఆదర్శమంటారు. గాంధీని చంపటం న్యాయమంటారు. ముస్లింలు, క్రిస్టియన్లు చొరబాటుదారులని పేర్కొంటారు. బీఫ్ తింటే చంపుతారు. ఆడవాళ్లు మగవారు చెప్పినట్టు వినాలంటారు. పైకి ఒకటి చెబుతారు, లోన ఒకటి చేస్తారు. రామరాజ్యమని పైకి చెప్పి, మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన వాడి కొడుక్కి సీటిచ్చి గెలిపించమంటారు. ఇదెక్కడి నీతి, రీతి!

ఓటే..నీ ఆయుధం!

సంపాదకీయం

'ఒక్కరోజు భాగోతానికి మూతి మీసాలు కొరుక్కున్నట్టు' అని ఒక సామెత ఉంది. ఒక్కరోజు కోసం డబ్బులు పంచుతారు, మందుపోస్తారు, మాంసం తినిపిస్తారు. కానీ ఐదేండ్లు కాల్చుకు తింటారు. చేపకు ఎరవేసిన తీరే ఇది కూడా. అందుకే ఆలోచించి ఓటు వేయాలి. 'మట్టి బానలు కొనిన కొట్టి చూచెదము/ సరుకు కొన వీధెల్ల తిరిగి చూచెదము, పండు పండేనో లేదో పట్టి చూచెదము, ఓటిచ్చునప్పుడే ఉండాల బుద్ధి, ఎన్నుకొని తలబాదుకొని యేమి ఫలము' అని కాళోజీ హెచ్చరించాడు. ఎందుకంటే, మన రాజ్యాంగము, దాని విలువలయిన ప్రజాస్వామ్యము, సామ్యవాదము, లౌకిక, సమాఖ్య విధానాలకు, సౌభ్రాతృత్వానికి ప్రమాదం ఏర్పడి, హక్కులు, స్వేచ్ఛ, అడుగంటిపోయిన సందర్భంలో, ఇక్కడ తరాలుగా జీవిస్తున్న వారి పౌరసత్వమే ప్రశ్నార్థకంగా మారిన సందర్భంలో ఈ ఎన్నికలు మన ముందుకొచ్చాయి. ఎప్పుడూ లేని విధంగా మతపరమైన విభజన పెరిగింది. నేటి కేంద్ర పాలకుల ఆలోచనలకు ఆద్యుడు, సిద్ధాంతకర్త అయిన గోల్వాల్కర్, సావర్కర్‌లు, మన జాతీయ జెండాను ఎగుర వేయటాన్ని అంగీకరించలేదు. అంబేద్కర్ రాజ్యాంగాన్నీ ఒప్పుకోలేదు. మనుస్మృతి మా ఆచరణని బహి రంగంగానే చెప్పారు. ఇప్పుడు సనాతన ధర్మమైన కులవ్యవస్థనూ సమర్థిస్తున్నారు. దేశ ప్రజలందరూ సమానమన్న రాజ్యాంగ విలువను వీరు అంగీకరించరు. హిట్లరు మా ఆదర్శమంటారు. గాంధీని చంప టం న్యాయమంటారు. ముస్లింలు, క్రిస్టియన్లు చొరబాటుదారులని పేర్కొంటారు. బీఫ్ తింటే చంపు తారు. ఆడవాళ్లు మగవారు చెప్పినట్టు వినాలంటారు. పైకి ఒకటి చెబుతారు, లోన ఒకటి చేస్తారు. రామరాజ్యమని పైకి చెప్పి, మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన వాడి కొడుక్కి సీటిచ్చి గెలిపించమంటారు. ఇదెక్కడి నీతి, రీతి!

ఈ పదేండ్ల ప్రభుత్వం ప్రజలను ఎన్ని ఇక్కట్లుకు గురిచేసిందో, ఏయే ఘనకార్యాలు చేసిందో, చూడాలి! మునుపెన్నడూ లేనంత పెట్రోలు ధర పెంచింది. గ్యాసు ధరపై ధర్నాలు చేసిన వీళ్లే విపరీతంగా పెంచారు. ప్రపంచ ఆకలిసూచీలో మన దేశం దిగజారి పోయింది. పేదరికమూ పెరిగింది. నిరుద్యోగం విపరీతంగా పెరిగింది. లాక్‌డౌన్ తర్వాత అనేక పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయారు. లాక్‌డౌన్‌లో కార్మికులు నడుచుకుంటూ వాళ్ల ఊర్లకు పోతుంటే నిర్బంధించారు. వారి నుంచి చార్జీలు వసూలు చేశారు. రాజధానిలో రైతులు మద్దతు ధర ఇవ్వాలని ఏడాది పాటు నిరసన తెలిపితే దేశ ద్రోహులని కాల్పులు జరిపారు. కానీ ఆదానీ, అంబానీలకు రూ.లక్షలకోట్లు మాఫీ చేశారు. ప్రభుత్వ సంస్థల్ని కార్పోరేట్లకు అప్పనంగా అమ్మేసారు. కనీసం కరోనా వాక్సిన్ ఉచితంగా ఇస్తామనలేదు. పెద్దనోట్ల రద్దుతో జనాన్ని చంపారు. మహిళలపై అత్యాచారాలు పెరిగాయి. రక్షణ కరువైంది. మణిపూర్‌లో మత విద్వేషాల్ని తెగల తగువును రెచ్చగొట్టారు. మహిళల్ని నగ్నంగా ఊరేగిస్తే, హత్యలు జరుగుతోంటే, కనీసం సందర్శించ తీరుబడి ప్రధానికి లేకపోయింది. వీటన్నింటినీ ప్రశ్నించిన ఉద్యమకారుల్ని, జర్నలిస్టుల్ని అక్రమ కేసులు పెట్టి నిర్బంధించారు. ప్రజా స్వామ్యం నుండి నిరంకుశత్వంలోకి దేశాన్ని తీసుకుపోతున్నారు. మీడియాను కొనేసారు, ఎంపీలను, ఎమ్మెల్యేలనూ కొని ప్రభుత్వాలను కూల్చారు. తమకు వంతపాడని వారిపైకి ఈడి, సిబిఐ, ఐటి దాడులు చేయించి జైల్లో వేయిస్తున్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులనూ నిర్బంధించారు. ఎన్నికల బాండ్ల పేరిట వేల కోట్ల రూపా యలను చందాలుగా తీసుకుని అవినీతికి పాల్పడ్డారు. కోర్టు రద్దు చేసినా, మళ్లీ తెస్తామని చెబుతు న్నారు. విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. హిందువుల సంపదను ముస్లింలకు దోచిపెడతారని మత విద్వేషాన్ని రెచ్చగొడుతూ అబద్ధాలు ప్రచారం చేసినా ఎలక్షన్ కమీషన్ కలగజేసుకోలేక పోయింది. ముఖ్యంగా యువత ఎదురు చూస్తున్న ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసారు కదా! వీటిగురించి ఒక్కమాటా చెప్పరు.

ఇలా ఎన్నో వైఫల్యాలు మన కండ్లెదుటే కనపడుతున్నాయి. దేశ భవిష్యత్తు యువత చదివే విద్యనూ మతం ఆధారంగా మార్చేసారు. బాబాలకు, యోగులకు నీతి బాహ్యమైన వ్యాపారాలకు అను మతి ఇస్తున్నారు. గెలిస్తే రాజ్యాంగాన్నే మారుస్తామని ప్రకటించే వీరిపట్ల జాగ్రత్త వహించకపోతే నియంతృత్వ కత్తిని మనపై దింపుతారు. ఇక ఓటే మన ఆయుధం!

తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఉభయులూ అవతలివారు బీజేపీతో వున్నారని ఆరోపిస్తుంటారు. విధానాల పరంగా గాకున్నా మనుగడ కోసమైనా మతతత్వ రాజకీయాలతో తమకు సంబంధం లేదని చెప్పుకోవలసిన స్థితి. ఈ భావన పెరిగేకొద్ది మోడీ, అమిత్ షా మరింతగా ముస్లిం వ్యతిరేకత, విద్వేష ప్రచారం పెంచుతున్నారు. ఈ ధోరణులకు అంతిమంగా ప్రజలే తగు సమాధానమిస్తారని ఆశించాలి. ఒక్కో దశ ముగుస్తుంటే ఓటింగు తగ్గుతున్నందున బీజేపీ, ఎన్డీయేలు కూడా ఇంకా ఈ ధోరణి పెంచుతారనడంలో సందేహం లేదు. వాటిని అడ్డుకోవలసిన ఎన్నికల సంఘం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నది. కనుక ఓటర్లు అప్రమత్తంగా ఉండక తప్పదు.

'మోడీ గాలి తగ్గిందా? ప్రజలు ఓటేయడానికే రాలేదెందుకు? ఇది మే 2న ఎకనామిక్ టైమ్స్ శీర్షిక. రాయిటర్ వార్తా సంస్థ అనేక చోట్ల అనేక మందిని కలిసి ఇచ్చిన ఈ కథనం చాలా పత్రికలు ప్రముఖంగా ప్రకటించాయి. మోడీ విభజనవాద ప్రసంగాలు ఎత్తుకోవడంతో ప్రశ్నలు తలెత్తుతున్నాయని బిబిసి వివరంగా కథనం ఇచ్చింది. అల్‌జజీరా, ఎకనామిస్ట్, గార్డియన్ ఇలా ఏ ప్రముఖ అంతర్జాతీయ పత్రిక కూడా బీజేపీ ప్రభంజనం ఏదో ఉన్నట్టు కథనమివ్వలేదు. కాశ్మీర్‌పై మోడీ గొప్పల పస తేలిపోవడంతో అక్కడ ఎన్నికల ప్రచారానికి వెళ్లలేదని కూడా రాయిటర్స్ తెలిపింది.

కీలక తీర్పులో భారతీయ ఓటర్లు


తెలకపల్లి రవి

మే 13 భారతీయుల, తెలుగు ప్రజల తీర్పు కొత్త చైతన్యానికి సంకేతం కాబోతుందా? ఇదే ప్రశ్న పరిశీలకులనూ, చరిత్రకారులనూ ఆలోచింపచేస్తున్నది. మోడీ హ్యాట్రిక్ ఖాయమంటూ మొదలైన హంగామా ఆయన ట్రిక్కుల వేటతో రోజుకో మలుపు తిరుగుతున్నది. బహుశా ఏ ప్రధానమంత్రి నుంచి ఎన్నడూ వినని దారుణమైన విద్వేష వాక్కులు మోడీ నోట వినవలసి వచ్చింది. మతాలపై, పార్టీలపై, కుటుంబాలపై, వ్యక్తులపై మోడీ విష ప్రచారాలు గతంలో ఎన్నడూ చూడనంత దిగువకు చేరాయి. తెలుగునాట ఆ మోడీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా జట్టుకట్టిన పార్టీలూ, నేతలూ కూడా మింగలేక కక్కలేక తంటాలు పడుతున్న పరిస్థితి. అసలు సమస్యలతో నిమిత్తం లేని అసహన రాజకీయాలు అధికార ఆరాటాలు, కులాల కుటుంబ కుమ్ములాటలుగా మారిన ఏపీలో శాసనసభ ఎన్నికలు కూడా జరుగుతున్నందున మే 13కు ముందస్తు రంగం మరింత తీవ్రంగా తయారైంది. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదు గనక బీజేపీని మోయాల్సిందేనని షరతు పెట్టి జట్టుకట్టిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, స్కిల్ స్కామ్ అరెస్టు తర్వాత మోడీ అండ అనివార్యమని తలపోసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వెంటపడి చివాట్లు తిని మరీ రాష్ట్ర ప్రయోజనాల పేర ఏపీలోకి ఎన్డీయేను తీసుకొచ్చారు. మరోవైపున వారిది పొత్తు అయితే ఈయన తొత్తు అనిపించుకున్న ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంతే అనివార్యంగా బీజేపీ వల్ల ముస్లిం రిజర్వేషన్లకూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కలిగే ముప్పును గురించి మాట్లాడవలసి వచ్చింది. కాకపోతే ఆంధ్రప్రదేశ్‌కు బలమైన కమ్యూనిస్టు సంప్రదాయాలు, క్రియాశీల ఉద్యమం వున్నందువల్ల ఈ దాగుడు మూతలు దగాకోరు రాజకీయాలు పెద్దగా సాగింది లేదు. రెండే పక్షాలు, ఇద్దరే నాయకులు అన్నట్టు జగన్, బాబు ప్లస్ పవన్ మధ్య సాగిన ప్రహసనంలో ప్రత్యేక హోదాతో సహా రాష్ట్ర సమస్యలు ప్రధాన ఎజెండాలోకి వచ్చాయి. కాంగ్రెస్‌కు కూడా కాస్త ఊపిరి వచ్చి 'ఇండియా' వేదిక ఇక్కడ కూడా పాత్ర వహించడంతో మూడు కూటముల పోరాటంగా మారింది. శుక్రవారం నాడు మూడు పార్టీల అగ్రనాయకులు కలసి జరిపిన సభ ఇందుకు సంకేతమైంది. ఈ మధ్యలో పర్యటనలు, షోలు చేసిన మోడీ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏ కొత్త పాత హామీ ఇవ్వకుండా వ్యక్తిగతంగా జగన్ వ్యతిరేక వ్యాఖ్యలు చేయకుండా రాజకీయ విన్యాసం చేసి వెళ్లడంలో జాతీయంగా ఆయన దురవస్థ తెలుస్తున్నది.

సెమీఫైనల్, ఫైనలా?

తెలంగాణకు వస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ఎన్నికలు తన పాలనపై రెఫరెండమనీ, శాసనసభ ఎన్నికలు సెమీ ఫైనల్‌గా ఇదే ఫైనల్ అని ప్రకటించడంతో అక్కడా వేడి పెరిగింది. శాసనసభ ఎన్నికల నాడు కాంగ్రెస్, సీపీఐ మాత్రమే కలసి వుండగా ఇప్పుడు 'ఇండియా' వేదిక రంగంలోకి వచ్చింది. ఇందుకోసం ముఖ్యమంత్రితో సహా చర్చలు జరిపి మద్దతు కోరడం పరిస్థితిని ప్రతిబింబించింది. మూడు నెలల్లో అంతా తలకిందులై తామే తిరిగొస్తామన్న బీఆర్ఎస్ మనుగడ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తుంటే తమకే ఎక్కువ సీట్లు వస్తాయని బీజేపీ పసలేని హడావుడి చేస్తున్నది. ఏపీలో బీజేపీ మతతత్వ రాజకీయాల వల్ల మైనార్టీలు దూరమై నష్టం జరుగుతుందనే ఆందోళన ఎన్డీయేలో ఉంటే తెలంగాణలో మాధవీలత వంటి వారిని ముందు పెట్టి ఆ మతతత్వాన్నే రాజేయడానికి బీజేపీ పాచికలు వేస్తున్నది. ప్రాంతీయ పార్టీల కలహాల స్థాయికి మారిన తెలుగు రాజకీయాలలో మరోసారి మతతత్వం, లౌకికతత్వం ఎజెండాను తెచ్చి 'ఇండియా' తాలూకు జాతీయ కోణాన్ని ఆవిష్కరించడంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, ఇతర లౌకిక ప్రజాస్వామిక వాదుల పాత్ర కాదనలేనిది. చివరికి వచ్చేసరికి బీజేపీ,ఎన్‌డిఎ ముస్లిం రిజర్వేషన్లను వ్యతిరేకించడాన్ని జగన్ సూటిగా ఖండించక తప్పలేదు. ఎన్నికల తర్వాత బీజేపీలోకి వెళతాడనే ఊహాగానాలను రేవంత్ కూడా ఏదో విధంగా తోసిపుచ్చకా తప్పలేదు.

సామాజిక సంకేతాలు

సామాజిక శక్తులుగా చూస్తే మోడీని మోసేందుకు సిద్ధమైన మందకృష్ణ వంటి వారి గొంతు వెనక్కు పోగా ఏపీ లోనూ ఎన్డీయే సోషల్ ఇంజనీరింగ్ వికటించి చాలా శక్తులు దూరమవడం కనిపిస్తున్నది. వామపక్షాలు ఎప్పటి నుంచో చెబుతున్న లాండ్ టైటిలింగ్ యాక్ట్ వంటివి కేంద్ర స్థానంలోకి రాగా దానిపై ఎన్డీయే కపట నాటకం కూడా బహిర్గతం కావడం, వైసీపీ కూడా అమలులోకి రాలేదని సమర్థించుకోవడం ఈ పరిణామాల పరంపరలోవే. ఏపీ, తెలంగాణ ప్రజలు ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య లౌకిక విలువలు కాపాడే తీర్పునిస్తారని ఎన్డీయేకూ వైసీపీకి తగిన పాఠం నేర్పుతారని ఆశించవచ్చు. కేవలం సినిమా ఆకర్షణలు కులాల వారీ వ్యూహాలతో నెట్టుకు రావచ్చునుకున్న పవన్ కళ్యాణ్ వంటి వారు కూడా ఈ క్రమంలో సొంత గెలుపుకోసం తంటాలు పడాల్సిన పరిస్థితి ఒకటైతే బీజేపీతో మోడీతో అవకాశవాద మైత్రిని సమర్థించుకోలేక చంద్రబాబు విన్యాసాలు సాగిస్తున్న దశ. జగన్ నిరంకుశ పాలనతో పాటు మోడీ మరింత పెద్దనియంతగా పేరు మోశారనీ, ముఖ్యమంత్రులనే జైలుపాలు చేశారని న్యూస్ లాండ్రీ విలేకరి ప్రశ్నలు వేస్తుంటే చంద్రబాబు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. వైనాట్ 175 జోరు తగ్గిన వైసీపీ ఎలాగోలా తాము గట్టెక్కుతామని ఆశపడుతుంటే జనం మెప్పుపొందని కూటమిని ఓటమి పాలు కాకుండా కాపాడుకోవడానికి చంద్రబాబు ఏటికి ఎదురీదుతున్నారు. దక్షిణ భారతంలో బీజేపీకి మరింత చోటివ్వకూడదనే సంకల్పం ప్రజల్లో బలంగా కనిపిస్తుంది.



డీలా పడిన మోడీ

మరోసారి జాతీయ దృశ్యం చూస్తే మూడు దశల పోలింగ్ తర్వాత నిస్సందేహంగా మోడీ టీం నిరుత్సాహం స్పష్టంగా కనిపిస్తున్నది. మొన్నటి వరకూ అమెరికా పాలకవర్గాల దన్నుతో మోడీని విశ్వగురువుగా చిత్రించిన పాశ్చాత్య మీడియాలోనూ ఈ మార్పు గోచరిస్తున్నది. ఇప్పుడు పెద్ద లోతుల్లోకి వెళ్లకపోయినా పైపై శీర్షికలు చూస్తే చాలు ఇది తెలిసిపోతున్నది. 'మోడీ గాలి తగ్గిందా? ప్రజలు ఓటేయడానికే రాలేదెందుకు? ఇది మే 2న ఎకనామిక్ టైమ్స్ శీర్షిక. రాయిటర్ వార్తా సంస్థ అనేక చోట్ల అనేక మందిని కలిసి ఇచ్చిన ఈ కథనం చాలా పత్రికలు ప్రముఖంగా ప్రకటించాయి. మోడీ విభజనవాద ప్రసంగాలు ఎత్తుకోవడంతో ప్రశ్నలు తలెత్తుతున్నాయని బిబిసి వివరంగా కథనం ఇచ్చింది. అల్‌జజీరా, ఎకనామిస్ట్, గార్డియన్ ఇలా ఏ ప్రముఖ అంతర్జాతీయ పత్రిక కూడా బీజేపీ ప్రభంజనం ఏదో ఉన్నట్టు కథనమివ్వలేదు. కాశ్మీర్‌పై మోడీ గొప్పల పస తేలిపోవడంతో అక్కడ ఎన్నికల ప్రచారానికి వెళ్లలేదని కూడా రాయిటర్స్ తెలిపింది. తాను అధికారానికి రావడం లేదని అర్థమైనందుకే మోడీ సమతుల్యత లేకుండా మాట్లాడుతున్నారని శరద్ పవార్ వ్యాఖ్యానించడాన్ని ఫ్రంట్‌లైన్ ప్రముఖంగా ఇచ్చింది. సగం సీట్లకు ఓటింగు ముగిసినా బీజేపీ ఇప్పటికీ ఎన్నికల ఎజెండాను రూపొందించలేకపోయిందని డెక్కన్ హెరాల్డ్ రాసింది. వెయ్యి కత్తికోతలతో బీజేపీ నరకయాతన పడుతున్నదని వైర్‌లో ప్రేమ్ ఫణిక్కర్ ఉదాహరణలతో చెప్పారు. టెన్నిస్‌లో గ్రాండ్‌స్లామ్ గెలిచిన సూపర్ ప్లేయర్ తదుపరి సారి సెమీ ఫైనల్‌లోనే ఓడిపోయినట్లుగా బీజేపీ తయారైందని వ్యాఖ్యానించారు. 2014 కన్నా 2019లో నాలుగు సీట్లు పెంచుకుని 303కు చేరుకున్న బీజేపీ ఇప్పుడు తిరోముఖంగా తయారైందన్నారు. గతంలో కర్నాటకలో 29 స్థానాలు వచ్చిన బీజేపీ ముగిసిన మూడు దశల్లోనూ అంతకంతకూ దెబ్బతినిపోవడమే గాక విద్వేష ప్రసంగాలు జేడీఎస్ (ప్రజ్వల్) రేవణ్ణ అత్యాచారపర్వం వంటి వివాదాల్లో చిక్కుకుపోయింది. కనీసం 18 కోల్పోవడం ఖాయంగా కనిపిస్తున్నది. మహారాష్ట్రలోనూ అదే పరిస్థితి. అజిత్ పవార్ ఏదో ఉద్ధరిస్తాడనుకుంటే బారామతిలో తన సీటు కోసమే పెనుగులాట.

అసలు ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మధ్యలో వైరం చాలా సీట్లు పోగొడుతుందని సందేహాలున్నాయి. శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు జరిగిందే తమ పార్టీలో పునరావృతం అవుతుందని బీజేపీ నేతలు భయపడుతున్నారు. క్షత్రియ వర్గాల అసంతృప్తి గుజరాత్‌లోనూ దెబ్బ తీస్తుందని కలవరపడుతున్నారు. హర్యానా సర్కారు ఇప్పటికే మైనార్టీలో పడింది. బీహార్‌లో 'ఇండియా' వేదిక బలంగా సాగుతున్నది. బెంగాల్‌లో సీపీఐ(ఎం) పుంజుకోవడంతో బీజేపీ, దాని వ్యతిరేకులు అన్న రీతిలో ద్విముఖ సమరంలా మారిందని వ్యాఖ్యలు వస్తున్నాయి.

మూలపీఠాల్లో ముసలం?

తూర్పు, దక్షిణ భాగాల్లో బీజేపీకి వ్యతిరేకత బాగా తెలిసిందే. ఢిల్లీలోనూ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ బెయిల్‌పై రావడం బీజేపీ పథకాలకు ఎదురు దెబ్బ. రాజకీయంగానూ మారుతున్న పరిస్థితిని వెల్లడిస్తుంది. మహారాష్ట్రలో హత్యకు గురైన నరేంద్ర దభోల్కర్ హంతకులకు ఈ సమయంలోనే శిక్ష పడింది.ఇంకా కీలకమైనవి ఉత్తర ప్రదేశ్, గుజరాత్‌లు. వీటిలో అత్యధిక ఫలితాలే మోడీకి పట్టం కట్టాయి. కానీ ఇప్పుడు యూపీ కథ మారింది. 2014 తో పోలిస్తే 2019లో యూపీలో ఓట్లు పెరిగినా తొమ్మిది సీట్లు తగ్గాయి బీజేపీకి. ఈసారి కాంగ్రెస్, సమాజ్‌వాది పొత్తు ప్రభావం బలంగా ఉందంటున్నారు. రామ మందిర ప్రాణ ప్రతిష్ట లాభమేమీ లేదని నిట్టూర్పులు విడుస్తున్నారు. అసలు ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మధ్యలో వైరం చాలా సీట్లు పోగొడుతుందని సందేహాలున్నాయి. శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు జరిగిందే తమ పార్టీలో పునరావృతం అవుతుందని బీజేపీ నేతలు భయపడుతున్నారు. క్షత్రియ వర్గాల అసంతృప్తి గుజరాత్‌లోనూ దెబ్బ తీస్తుందని కలవరపడుతున్నారు. హర్యానా సర్కారు ఇప్పటికే మైనార్టీలో పడింది. బీహార్‌లో 'ఇండియా' వేదిక బలంగా సాగుతున్నది. బెంగాల్‌లో సీపీఐ(ఎం) పుంజుకోవడంతో బీజేపీ, దాని వ్యతిరేకులు అన్న రీతిలో ద్విముఖ సమరంలా మారిందని వ్యాఖ్యలు వస్తున్నాయి.

ముందున్న సవాలు

బీజేపీ ఈ పరిస్థితికి రావడానికి 2024 ఎన్నికలు జరుగుతున్న నేపథ్యం కూడా ఒక కారణం. 2019లో ఉగ్రవాదుల దాడులు, పుల్వామా సర్జికల్ స్ట్రయిక్స్ వంటి వాటికి హైప్ ఇచ్చి ఓటర్లను ఉద్వేగంవైపు తిప్పారు. కానీ ఈ అయిదేండ్లలోనూ ఈ కృత్రిమ వ్యూహాలు పనిచేయవని తేలిపోయింది. మత రాజకీయాల ముప్పుపై మెళకువా పెరిగింది. లౌకిక ప్రతిపక్షాలను ఒకచోటికి చేర్చేందుకు గట్టి ప్రయత్నాలే జరిగాయి. అందుకే ఏపీలో వలె బీజేపీకి దగ్గరగా వుండిన పక్షాలు కూడా ఆ అంశాన్ని కాస్త వెనక్కు నెట్టి ఇతర తరహాలో ప్రచారం చేసుకుంటున్నారు. ఏపీలో చంద్రబాబు, జగన్‌ల తీరే అందుకో ఉదాహరణ. చాలా చోట్ల బీజేపీ వారిని జెండాలు లేకుండా రమ్మని కూడా టీడీపీ పట్టుపట్టినట్టు సమా చారం. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఉభయులూ అవతలివారు బీజేపీతో వున్నారని ఆరోపిస్తుంటారు. విధానాల పరంగా గాకున్నా మనుగడ కోసమైనా మతతత్వ రాజకీయాలతో తమకు సంబంధం లేదని చెప్పుకోవలసిన స్థితి. ఈ భావన పెరిగేకొద్ది మోడీ, అమిత్ షా మరింతగా ముస్లిం వ్యతిరేకత, విద్వేష ప్రచారం పెంచుతున్నారు. ఈ ధోరణులకు అంతిమంగా ప్రజలే తగు సమాధానమిస్తారని ఆశించాలి. ఒక్కో దశ ముగుస్తుంటే ఓటింగు తగ్గుతున్నందున బీజేపీ, ఎన్డీయేలు కూడా ఇంకా ఈ ధోరణి పెంచుతారనడంలో సందేహం లేదు. వాటిని అడ్డుకోవలసిన ఎన్నికల సంఘం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నది. కనుక ఓటర్లు అప్రమత్తంగా ఉండక తప్పదు.

అ..ఆ

నజర్

"ఏదేమైనా పెద్దాయన స్పీచ్ అదరహో!" అన్నాడు సురేష్.

"ఏ విషయంలో పెద్దాయన స్పీచ్ అదరగొట్టాడో కాస్త చెప్పు?" అన్నాడు రాజు.

"ఏ విషయంలోనైనా ఎప్పుడైనా సరే! మా పెద్దాయన స్పీచ్ అదరగొడతాడు! ఎనీ టైమ్, ఎనీ ప్లేస్, ఎనీ సబ్జెక్ట్!" అన్నాడు సురేష్.

"తాజాగా అదరగొట్టిన స్పీచ్ ఏమిటో చెప్పమంటున్నా!" అన్నాడు రాజు.

"నీవు విన్లేదా! మన తెలంగాణా లోనే, కాంగ్రెస్ బండారం బయట పెట్టాడు! పెద్దా యనా మజాకా?" అన్నాడు సురేష్ గర్వంగా.

"నాన్చొద్దు! విషయం ఏమిటో చెప్పు!" అన్నాడు విసుగ్గా రాజు.

"గత ఐదేండ్లుగా అంబానీ, ఆదానీలను కాంగ్రెస్, రాహుల్ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిన విషయం, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించ గానే గప్‌చుప్ అయిపోయిన సంగతి పెద్దాయన బయటపెట్టారు! అంతేకాదు నల్లధనం, నోట్ల కట్టలు టెంపోల్లో పంపించి, రాహుల్‌కి ముట్ట చెప్పిన రహస్యాన్ని కూడా దేశ ప్రజలకు తెలియచేశారు! టెంపోల్లో వచ్చిన నల్లధనం ముట్టగానే రాహుల్ నోరుమూసుకున్నారని భారతదేశానికి, ప్రపంచానికి తెలిసిపోయింది! వాహ్ మోడీజీ! మీ లాంటి ప్రధాని ఉన్నందుకు, మా జన్మ ధన్యమై పోయింది!" అంటూ చేతులు జోడించాడు సురేష్.

చిన్నగా నవ్వాడు రాజు.

"ఎందుకు నవ్వుతావు? యువరాజు ఎలాంటి వాడో తెలిసింది కద! యువరాజు నిజస్వరూపాన్ని బయట పెట్టినందుకైనా పెద్దాయన్ను మరోసారి ప్రధానిని చేయాల్సిందే!" అన్నాడు సురేష్ దృఢంగా.


"అంబానీ, ఆదానీలు నిజంగానే టెంపోల్లో! రాహుల్‌కు డబ్బు పంపారంటావా?" అనుమానంగా అడిగాడు రాజు.

"ముమ్మాటికీ నిజం! మా పెద్దాయన ఏ ఆధారం లేకుండా ఏదీ మాట్లాడడు! ఏ సాక్ష్యమూ లేకుండా అసలే ఉపన్యాసం చెప్పడు! అంతెందుకు సత్య హరిశ్చంద్రుడు, రామ్‌లల్లా కూడా పెద్దాయనను ఆదర్శంగా తీసుకుని, సత్యవాక్పరిపాలనా వ్రతం చేపట్టారు తెలుసా?" అన్నాడు సురేష్.

"ఆగాగు! మరీ అంతవెనక్కి వెళ్ళకు! ముందు నా డౌటు తీర్చు! టెంపోల్లో నోట్ల కట్టలు రాహుల్‌కి ముట్టిన విషయం నిజమైతే వెంటనే ఈడిని పంపొచ్చు కదా! రాహుల్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టు పడేవాడు! అన్నాడు రాజు.

"ఈడిపై పెద్దాయన ఏ ఒత్తిడీ చేయరు! ఈడి స్వతంత్రంగా పని చేయాలనీ ఈడికి రోజూ ఫోన్ చెబుతుంటారు! కాని ఈడి ఇప్పుడు క్రేజీవాల్, హేమంత్ సోరేన్ కేసుల్లో బిజీగా ఉంది కదా!" అన్నాడు సురేష్.

"క్రేజీవాల్, హేమంత్‌ల వద్ద ఇంత వరకేమైనా నోట్ల కట్టలను ఈడి కనుగొన్నదా? రైడింగ్‌లో దొరికిన డబ్బును కోర్టులో ప్రవేశ



పెట్టిందా?' అడిగాడు రాజు.

"వాళ్లు ఆరితేరిన దొంగలు! అందుకే డబ్బు దొరక్కుండా జాగ్రత్తపడ్డారు!" అన్నాడు సురేష్.

"వారు డబ్బు దొరక్కుండా జాగ్రత్త పడ్డారు సరే! ఎప్పుడో కనుమరుగైపోయిన టెంపోలో నోట్ల కట్టలు తరలిస్తుంటే తెలుసుకున్న మనిషి ఎవరో కాదు! స్వయాన దేశ ప్రధాని ఈడి, సిబిఐ, మీడియా, ఆఖరికి ఎన్నికల కమిషన్ ఎవరో ఒకరికి ఫిర్యాదు చేయవచ్చు కదా! తాను ఫొటోలు తీస్తూ, తననే ఫొటోలు తీయించుకున్న పెద్దాయన. టెంపోను ఎందుకు వీడియో తీయించలేకపోయారు? ఆ పని చేసి ఉంటే కాంగ్రెస్ ముక్త్ భారత్ స్వప్నం సాకారమయ్యేది కదా!" అన్నాడు రాజు.

"మీరింతే! మీరు దేశాన్ని వికసిత్ భారత్ కానివ్వరు! మీవల్లే దేశం అల్లకల్లోలం అవుతు న్నది! దేశద్రోహులు మీరు!" అన్నాడు సురేష్.

"దేశ ద్రోహం అంటే ఏమిటో తర్వాత మాట్లాడుకుందాం! కాని నాకు మరో డౌటు వచ్చింది! దాన్ని తీర్చు! అంబానీ, ఆదానీల వద్ద నల్లధనం ఉన్నదా?" అడిగాడు రాజు.

"వారి వద్ద నల్లధనం లేకపోతే పెద్దాయన నోటి ద్వారా ఆ మాటలు రావు! మాట వచ్చిందంటే అది గ్యారెంటీ!" అన్నాడు సురేష్.

"అది గ్యారెంటీ అయితే! అంతకుముందు చెప్పిన మాటలకు గ్యారెంటీ ఉన్నట్లా? లేనట్లా?" అడిగాడు రాజు.

"పెద్దాయన మాటంటేనే గ్యారంటీ! అసలు గ్యారెంటీ, మోడీ వేర్వేరు కాదు!" అన్నాడు సురేష్.

"మరి పదేండ్ల ముందు దేశ విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికితీసి, మనందరి అకౌంట్లలో రూ.15లక్షలు వేస్తానని గ్యారంటీ ఇచ్చాడు పెద్దాయన. విదేశాల సంగతి దేవుడెరుగు! స్వదేశంలోని అంబానీ, ఆదానీల వద్దనున్న నల్లధనాన్ని పంచిపెడితే రాత్రింబవళ్లు కష్టపడుతున్న మీ పార్టీ కార్యకర్తలకైనా, కనీసం ఒక్కొక్కరికి పది లక్షల రూపాయలైనా వచ్చేవి కదా!" అన్నాడు రాజు.

ఒక్కసారిగా షాక్ తిన్నాడు సురేష్! "నిజమే పెద్దాయనను సమర్థించే హడావుడిలో తాను ఈ లెక్కలు వేసుకోలేదు!" అంబానీ, ఆదానీల వద్ద నిజంగానే నల్లధనం ఉంటే పెద్దాయన ఎందుకు ఆ నల్లధనాన్ని స్వాధీనం చేసుకుని తనలాంటి కార్యకర్తలకైనా పంచి పెట్టొచ్చు కదా! ఆ పప్పులో కాదు! ఈ పప్పులోనే ఏదో ఉంది!" అని ఆలోచిస్తున్నాడు.

"నీవు ఆలోచిస్తున్నది నిజమే! అంబానీ, ఆదానీల వద్దకి గత పదేండ్లలో లక్షల కోట్ల రూ॥ డబ్బు వచ్చి చేరింది. ఇదంతా అక్రమార్జన నీవు, నేను, మనందరి లాంటి సగటు మధ్య ప్రజలు రెక్కలు ముక్కలు చేసుకుని కూడ బెట్టిన సొమ్మును, జీఎస్టీ, ఆదాయపు పన్ను , టోల్‌టాక్స్ మొ॥ పన్నుల పేరిట తోలు వలచి మరీ వసూలు చేస్తున్నాడు పెద్దాయన!"అన్నాడు రాజు.

"ఆ పన్నులకు అంబానీ, ఆదానీలకు ఏం సంబంధం?" అమాయకంగా అడిగాడు సురేష్.

"అది బీరకాయ పీచు బంధుత్వం! మన వద్ద వసూలు చేసిన పన్నులు ప్రభుత్వానికి చేరుతున్నాయి! అంబానీ, ఆదానీలు ప్రభుత్వ బ్యాంకుల వద్ద లక్షల కోట్లు అప్పులు చేసి, వాటిని తిరిగి చెల్లించడం లేదు! ప్రభుత్వంలో ఉన్న పెద్దాయన, ఆ బాకీలు మొండిబాకీలని రద్దు చేస్తున్నాడు! అట్లా రద్దు చేసిన బాకీల విలువ రూ.16 లక్షల కోట్లు. అంటే మన తెలంగాణా అయిదేండ్ల పాటు ఒక్క రూపాయి సంపాదించకుండానే, అన్ని పథకాలు అమలు చేయవచ్చు!" వివరించాడు రాజు.

గందరగోళంగా చూశాడు సురేష్.

"ఇందులో గందరగోళమేమీ లేదు! ప్రజల డబ్బు ఎంత పెద్ద మొత్తంలో కార్పోరేట్లకు చేరుతుందో చెప్పటానికి ఒక ఉదాహరణ అది! వారి వద్ద ఉన్న నల్లధనాన్ని పెద్దాయన బయటపెట్టక పోగా, మరింత నల్లధనాన్ని వారి వద్దకు స్వయంగా జమ చేసిన నిష్ఠూర సత్యాన్ని మనం అర్థం చేసుకోక పోతే, కనబడని టెంపోలే నిజమనుకుంటాం!" వివరించాడు రాజు.

"ఏనాడు అంబానీ, ఆదానీ గురించి వ్యతిరేకంగా పెద్దాయన మాట్లాడలేదు! పైగా వారే సంపద సృష్టికర్తలని అనేకసార్లు చెప్పాడు! ఇప్పుడెందుకిలా మాట్లాడాడు?" అడిగాడు సురేష్.

"నీవు చెప్పింది నిజమే! సహజ వనరులైన స్పెక్ట్రం, బొగ్గు, యురేనియం, లిగ్నైట్ గనులు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, రోడ్లు బస్సులు, రైల్వేలు, రక్షణ ఉత్పత్తులు ఒకటేమిటి, సర్వం వారికే పెద్దాయన ధార పోశాడు. ఇంకా పోస్తున్నాడు కూడా! హిడెన్ బర్గ్ రిపోర్టులో కూడా ఆదానీ అవకతవకలకు పాల్పడ్డాడని వస్తే, ఆదానీ తప్పేమీ లేదని వాదించాడు! అంబానీ ఇంట్లో నిశ్చితార్థం జరిగినపుడు రామ్‌లల్లా పూజలో గడిపిన సమయం కంటే ఎక్కువసేపు, నిశ్చితార్థం దగ్గర ఒక ప్రధాని స్థాయిలో గడిపాడు! ఇంతకు ముందు జరిగిన ఎన్నికల్లో స్వయంగా ఆదానీ విమానంలోనే ఎన్నికల ప్రచారం చేశాడు! ఇప్పుడు అకస్మాత్తుగా ప్లేటు మార్చాడు! ఎందుకంటే ఈ ఎన్నికల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలైన, నిరుద్యోగం, ఆకలి, పేదరికం, ధరల పెరుగుదల మొ॥ ముందుకు వచ్చాయి.ప్రజల సొమ్మును అంబానీ, ఆదానీలకు దోచిపెట్టడమే కారణమని ప్రజలు గుర్తిస్తున్నారేమోనన్న భయం పెద్దాయనకు పట్టుకుంది! అందుకే ఆ పాపాన్ని కాంగ్రెస్ ఖాతాలో వేసేందుకే ఇలా మాట్లాడుతున్నాడు!" వివరించాడు.

"అంబానీ, ఆదానీలు మాత్రమే దగ్గరగా ఉంటారని అనుకున్నాను గాని అ,ఆ లమధ్య నమో ఉంటారని అర్థం చేసుకోలేక పోయాను!" అని చెంపలేసుకున్నాడు సురేష్.

- ఉషాకిరణ్

కలకాదు నిజమే!

'కుక్కలు కూడా ఆలోచించవు, ఫలానా జాతిలోనే పుట్టాలనీ... ఎందుకని?... ఎందుకంటే అవి ఆలోచించ లేవు కాబట్టి. పోనీ ఆలోచించే మనుషులకు సాధ్యమా? సాధ్యం కాదు. ఎందుకనీ?... నిజంగానే సాధ్యంకాదు కాబట్టి.(ఫలానా మతంలోనో ఫలానా కులంలోనో పుట్టాలని అనుకుని ఎవరూ పుట్టలేరు గనుక). అలా హీనంగా ఆలోచించేవారిని మనుషులని అనుకోలేం' - రూమీ. తత్వవేత్త.

చదువుకుంటూ, ఆలోచించుకుంటూ మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు సలీం.

'లవ్ జీహాద్' అంటే తెలుసు. మరి ఈ 'ఓట్ జీహాద్' ఏంటబ్బా? ముస్లింలు హిందువులను లొంగదీసుకునేందుకు ఈ లవ్ జీహాద్‌ను ఉపయోగి స్తారు. అందుకోసం వారు ఎంత కైనా తెగిస్తారు. ప్రాణంపోయినా సరే. జీహాద్ అంటే అదే'

ఆరెస్సెస్, విశ్వ హిందూ పరిషత్, జై భజరంగ్ దళ్ వాళ్ళు కొన్నేళ్ళ క్రితం ఈ 'లవ్ జీహాద్' మాటను సృష్టించి వదిలారు. ఇప్పుడు ప్రధాని మోడీ ఈ 'ఓట్ జీహాద్' మాటను కనిపెట్టి, జనంలోకి తాజాగా వదిలాడు. ముస్లింలపై ద్వేషం నింపడానికి.

'కాంగ్రెస్ పార్టీ ఓట్ జీహాద్‌ను ప్రోత్సహిస్తుంది. అదీ బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని ముస్లింలను రెచ్చగొడుతుంది. ఈనాడు భారతదేశం ఓ కీలక మలుపులో ఉంది. మీకు ఓట్ జీహాద్ కావాలా? కొనసాగుతున్న రామరాజ్యం కావాలా? మీరే తేల్చుకోండి.

పాకిస్తాన్ ఉగ్రవాదులు భారత్‌కు వ్యతిరేకంగా జీహాద్ పేరుతో బెదిరిస్తున్నారు. ఇక్కడ కాంగ్రెస్ ఈ మోడీకి వ్యతిరేకంగా ఓట్ జీహాద్ అంటున్నది. ఇది దేశ వ్యతిరేక ప్రకటన కాదా...?

మీకో విషయం చెప్పాలి. నేను 400 సీట్లు గెలుచుకోవాలని ఊరికే కోరడం లేదు. కాశ్మీరులో ఆర్టికల్ 370ని కాంగ్రెస్ తిరిగి తీసుకోకుండా రావాలంటే 400 సీట్లు కావాల్సిందే..

అయోధ్యలో సర్వాంగ సుందరంగా నిర్మించిన రామమందిరానికి బాబ్రీమసీద్ తాళం పడకుండా ఉండాలంటే నాకు 400 సీట్లు కావాల్సిందే.

కాంగ్రెస్ ముస్లిం మైనార్టీలను తన ఓటు బ్యాంకు అనుకుంటున్నది. వాళ్లకు ప్రయోజనాలు చేకూర్చాలని ఓబీసీ రిజర్వేషన్ కోటాను దోచుకోవాలని చూస్తుంది. కాంగ్రెస్ రాత్రికి రాత్రే తన ముస్లిం ఓటు బ్యాంకులోని వారిని ఓబీసీలుగా ప్రకటించాలని చూస్తుంది. మరి ఈ ఘోరాన్ని అడ్డు కోవాలంటే నాకు 400 సీట్లు కావాల్సిందే.

అసలు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు పార్లమెంటులో ఇప్పటికే, 400 సీట్లు ఉన్నాయి. ఆ విషయం కాంగ్రెస్‌తో సహా దేశ ప్రజలు తెలుసుకోవడం మంచిది.

హా...హా...హా. అసలు ఆర్టికల్ 370 రద్దు చేయడానికే మేం ఈ 400 నెంబర్ ఉపయోగించాం. అంతే కాదు ఎస్సీ, ఎస్టీ కోటాను కాపాడేందుకు, కాంగ్రెస్ - ఇండియా ప్రతి కుట్రను అడ్డుకోవాలంటే 400 కావాల్సిందే.

దళితుల ఓబిసిల రిజర్వేషన్‌లు లాక్కోవాలని ప్రతిపక్షాలు పొంచి చూస్తున్నాయి. ఈ మాటను లల్లూ ప్రసాద్ యాదవ్ చెప్పారు. ఎస్సీ,ఎస్టీ, బీసీలకు ఇస్తున్న రిజర్వేషన్ ఎప్పటికీ లాక్కోమని, ప్రస్తుతం ఉన్న ఓబిసి కోటాను దోచుకుని ముస్లింలకు రిసర్వేషన్ కల్పించబోమని నేను హామీ అడిగా... హా..హా... వారు తెలుకుట్టిన దొంగల్లా నోరు మూసుకున్నారు.

మీకు మరో విషయం చెప్పాలి.

అసలు బాబా సాహెబ్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ చిన్నచూపు చూసింది. చిన్నచూపు అంటే చిన్న మాట అవుతుంది. అంబేద్కర్‌కు, మన రాజ్యాంగానికి కాంగ్రెస్ ఎప్పుడో వెన్నుపోటు పొడిచింది. ఈ వెన్నుపోటు కార్యక్రమం నెహ్రూ కాలం నుంచే మొదలైంది. రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర చాలా తక్కువని, నెహ్రూ రాసిన పీఠికే గొప్పని కాంగ్రెస్ ఆనాడే చెప్పుకున్నది. రాజ్యాంగాన్ని, అంబేద్క ర్‌ను కాంగ్రెస్ ద్వేషిస్తుందని చెప్పడానికి ఇంతకంటే వేరే ఉదాహరణ కావాలా? - ఇలాంటి కాంగ్రెస్‌ను రాజకీయాల నుండి శాశ్వతంగా దూరం చేయడమే మనం అంబేద్కర్‌కిచ్చే ఘనమైన నివాళి, తెల్సిందా.

చివరగా ఓ మాట... నేనేదో ముస్లింలకు వ్యతిరేకినని కాంగ్రెస్ ప్రచారం చేస్తున్నది. హిందువుల ఆస్తులను ముస్లింలకు పంచుతానని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలోనే చెప్పుకుంది. బీజేపీ అలా చెప్పలేదు. చెప్పదు కూడా.అయినా ముస్లింలు చాలా తెలివైన వారు. కాంగ్రెస్ అబద్ధాలను వారు నమ్మరు. అందుకే ఇప్పుడు ఇది కాంగ్రెస్‌కు పెద్ద సమస్యై కూర్చుంది. ముస్లిం సమాజం ఆలోచించాలి. దేశం ప్రగతి పథంలో ఉంది. మీ వద్ద ఏమైనా పొరపాట్లు ఉన్నాయని భావిస్తే దానికి కారణాలు ఏమిటో తెలుసుకోండి. ముస్లింలు తమ భవిష్యత్ గురించి ఆలోచించుకోండి.

-ఇది ప్రధాని మోడీ ఎన్నికల ఉపన్యాసమా? ఒక మతం వారిపై మరో మతం వారిని ఎగదో యడమా?వింటున్న వారి అందరి ముఖాలు భయంతో నిండిపోయాయి. స్టేజీపైనా, చుట్టుపక్కల మాత్రం కొందరు కాషాయ రిబ్బన్‌లు కట్టుకుని చప్పట్లు ఈలలతో వీరంగం వేస్తున్నారు.

తడిసి ముద్దైన చెమటతో సలీంకు హఠాత్తుగా మెలుకువ వచ్చింది. ఎదురుగుండా పేపర్‌లో అచ్చం కలలోని ఉపన్యాసమే నిజమైన వార్తగా వచ్చింది.

- శైలి, 99597 45723

ఎన్నికల రద్దీ

- పంతంగి టోల్గేట్ వద్ద భారీగా ట్రాఫిక్ జాం

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జాతీయ రహదారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద శుక్రవారం మధ్యాహ్నం నుంచే వాహనాల రద్దీ పెరిగింది. మే 13న తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి సొంత గ్రామాలకు వెళ్తున్న ప్రయాణికులతో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి వాహనాలతో నిండిపోయింది. శనివారం, ఆదివారం, సోమవారం సెలవు దినాలు కావడంతో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. ఈ రద్దీ ఆదివారం రాత్రి వరకు పెరిగే అవకాశం ఉన్నది.

మోడీ పాలనంతా గ్యాస్.. ట్రాష్..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదేండ్ల మోడీ పాలనంతా ఒట్టి గ్యాస్.. అంతా ట్రాష్ అంటూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎద్దేవా చేశారు. ప్రజల్ని భ్రమల్లో ముంచటం, ఉన్మాదాన్ని రెచ్చగొట్టటమే బీజేపీ పని అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి 200 సీట్లు కూడా దాటవని ఆయన మరోసారి చెప్పారు. ఈసారి ప్రాంతీయ పార్టీలే కేంద్రంలో కీలక భూమికను పోషిస్తాయని తెలిపారు. తమకు రాష్ట్రంలో 12 నుంచి 14 ఎంపీ సీట్లు రావటం ఖాయమనీ, అప్పుడు కేంద్రంలో క్రియాశీలక పాత్రను పోషిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆర్నెల్లలో చేసిన తప్పులు, వైఫల్యాలకుగాను కాంగ్రెస్ రాష్ట్రంలో భారీ మూల్యం చెల్లించుకోబోతోందని హెచ్చరించారు. రేవంత్ ఒక అర్భక ముఖ్యమంత్రి, ఆయన ప్రభుత్వానికి ఏ విషయంపైనా స్పష్టమైన విధానం లేదని ఎద్దేవా చేశారు. 'పదేండ్ల బీజేపీ పాలన, అరవై ఏండ్ల కాంగ్రెస్ ఏలుబడి, ఆర్నెల్ల రేవంత్ సర్కారును చూశాం...అందువల్ల ఆ రెండు జాతీయ పార్టీల వల్ల రాష్ట్రానికి ఒరిగేదేం లేదు.. తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీ రామరక్ష.. అందువల్ల మా పార్టీని ఆదరించండి...' అని ఆయన ప్రజానీకానికి పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కె.సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, పొన్నాల లక్ష్మయ్య, సీనియర్ నేతలు రావుల చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులతో కలిసి కేసీఆర్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను తూర్పార బడుతూ ఆయన ఈ సందర్భంగా సుదీర్ఘంగా ప్రసంగించారు. సీఎం రేవంత్ వాడుతున్న భాషపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆర్నెల్ల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంటు కష్టాలు, తాగునీటి గోస, ఎండిన పంట పొలాలు, రైతు బంధు రాకపోవటం, ధాన్యం కొనుగోళ్లు, గొర్రెలు, మేకలు, చేప పిల్లల పంపిణీ నిలిచిపోవటం, చేనేత కార్మికుల ఆత్మహత్యలు, సీఎంఆర్ఎఫ్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవటం తదితర సమస్యలను ప్రజలు చవిచూశారని ఆయన ఈ సందర్భంగా వాపోయారు. అందువల్ల రేవంత్ సర్కార్‌పై ప్రజలు కోపంగా ఉన్నారనే విషయాన్ని తాను బస్సు యాత్ర సందర్భంగా గుర్తించానని వివరించారు. అత్యంత అమూల్యమైన సమయాన్ని రాజకీయ కక్ష సాధింపు ధోరణులకు, చిల్లర రాజకీయాలకే వాడుకున్నారు తప్పితే ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించలేదని విమర్శించారు. ఇదంతా లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం చూపబోతోందని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ సభ జనం లేక వెలవెల బోవటం, సీఎం రేవంత్ మీటింగుల్లో సైతం కుర్చీలు ఖాళీగా ఉండటం... ఆ పార్టీపై ప్రజల్లో ఉన్న కోపానికి నిదర్శనాలని విమర్శించారు. రాష్ట్రం నుంచి పెట్టుబడులు, పరిశ్రమలు తరలిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మరోవైపు మోడీ పదేండ్ల ఏలుబడిలో దేశ జీడీపీ 6.8 శాతం నుంచి 5.8 శాతానికి పడిపోయిందని కేసీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్... అంటూ బీజేపీ ఊదరగొట్టిందనీ, కానీ ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కరికీ వికాసం లభించలేదని వాపోయారు. అభివృద్ధి మాటేమోగానీ, దేశంలో నిరుద్యోగం మాత్రం తారాస్థాయిలో పెరిగిందని గుర్తు చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల సంగతి తర్వాత, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేకపోయారని విమర్శించారు. అయినా బీజేపీకి 400 సీట్లు వస్తాయంటూ మోడీ చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆ పార్టీకి 200 సీట్లు కూడా దాటబోవన్నారు. తెలంగాణలో బీజేపీకి వస్తే ఒక సీటొస్తుంది లేదంటే అది కూడా రాదని చెప్పారు. కాంగ్రెస్ 9 లోక్‌సభ నియోజకవర్గాల్లో మూడో స్థానానికే పరిమితం కానుందని వ్యాఖ్యానించారు.

అది మోడీ సృష్టించిన రాజకీయ కుంభకోణం...

ఢిల్లీ లిక్కర్ స్కాం అనేది ప్రధాని మోడీ సృష్టించిన ఒక రాజకీయ కుంభకోణమని కేసీఆర్ వ్యాఖ్యానించారు. దాన్నుంచి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, తన కుమార్తె కవిత కడిగిన ముత్యాల్లా బయటకు వస్తారంటూ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారాన్ని తాను బట్టబయలు చేశాననీ, అందుకే మోడీ తనపై కక్షగట్టారని చెప్పారు. ఈ తతంగంలో పాల్గొన్న బీఎల్ సంతోశ్ (మోడీకి కుడిభుజం, బీజేపీ ప్రధాన కార్యదర్శి)ను అరెస్టు చేయించేందుకు తాను ప్రయత్నించిన కారణంగానే, కవితను అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో నాటి సీఎంగా తనకేం సంబంధముంటుందని ప్రశ్నించారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో కేసీఆర్ ప్రళయ గర్జనను చూస్తారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రైతుబంధును ఆపేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రకరకాల కొర్రీలేస్తోందని చెప్పారు. ఏకకాలంలో రుణమాఫీ చేయటం రేవంత్ సర్కార్ వల్ల కాదని అన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. రిజర్వేషన్లను తీసేయటానికి తమ పార్టీ వ్యతిరేకమనీ, అయితే కులం, మతం ఆధారంగా కాకుండా ఆర్థిక పరిస్థితి ఆధారంగా వాటిని నిర్ధారించాలని ఆయన సూచించారు.

నిఘా నీడలో రాష్ట్రం



- అసాంఘీక శక్తులపై డేగ కన్ను
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై స్పెషల్ ఫోకస్
- మూడంచెల భద్రత
- సర్వత్రా 'అలర్ట్'

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సాధారణ ఎన్నికలకు రాష్ట్రం సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీస్, ఇంటెలిజెన్స్ విభాగాలు రాష్ట్రాన్ని అదుపులోకి తీసుకున్నాయి. ఎక్కడిక్కడ నిఘా పెట్టాయి. డేగ కన్ను వేశాయి. 18వ లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషిచేస్తున్నాయి. 17 లోక్‌సభ స్థానాలకుగాను 525 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు సాధారణ వ్యక్తులూ బరిలో ఉన్నారు. రాష్ట్రమంతా 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది. నలుగురి కంటే ఎక్కువ మంది గుంపుగా తిరగకూడదని పోలీస్ శాఖ ఆదేశించింది. నగర పోలీస్ చట్టం ప్రకారం హైదరాబాద్‌లో ప్రత్యేక నిబంధనలు అమలుకానున్నాయి. రాష్ట్రంలో 160 కేంద్ర పారామిలిటరీ బలగాలు, 75 వేల మంది పోలీస్, అబ్కారీ యంత్రాంగాన్ని ఎన్నికల కోసం వినియోగిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత అక్రమంగా తరలిస్తున్న రూ.320 కోట్లను సీజ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 సమస్యాత్మక సెగ్మెంట్లలో భారీ నిఘా ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులతోపాటు కేంద్ర బలగాలు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే గ్రామాలు, మున్సిపాల్టీలు, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలు పారామిలిటరీ దళాల పరిధిలోకి వెళ్లాయి. మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో, సమస్యాత్మక ప్రాంతాల్లో దళాలు కవాత్ చేస్తున్నాయి. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓటువేసేందుకు ముందుకు రావాలని పిలుపునిస్తున్నాయి. స్వేచ్ఛగా ఓటేయాలని భారత ఎన్నికల సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు 'మీ ఓటే మీ స్వరం..తప్పనిసరిగా మీ ఓటును వేయండి' అంటూ భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) పేర ఓటర్లకు షార్ట్ మెయిల్ సర్వీస్(ఎస్ఎంఎస్) మెస్సేజీలు వచ్చాయి. పోలీసులు, ఇంటెలిజెన్స్ విభాగం ఎన్నికల ప్రక్రియకు ఇబ్బంది కలగకుండా యంత్రాంగాన్ని అప్రమత్తంగా ఉంచాయి. అనుమానాస్పద వ్యక్తుల కార్యకలాపాలపై నిఘా పెట్టాయి. రౌడీషీటర్లను బైండోవర్ చేశాయి. ఆయుధాలను ఎక్కడిక్కడ స్థానిక పోలీస్‌స్టేషన్లల్లో డిపాజిట్ చేయాలని పోలీస్ శాఖ సంబంధీకులను ఆదేశించింది. హైదరాబాద్‌లోని పాతబస్తీలో భారీగా భద్రతా బలగాలను మోహరించారు. పెట్రోలింగ్ సైతం అధికం చేశారు. రాష్ట్రమంతా మద్యం దుకాణాలు బంద్ చేశారు. మావోయిస్టు కదలికలున్న ప్రాంతాల్లో కొండలు, గుట్టలను సైతం గాలిస్తున్నట్టు సమాచారం. ప్రధాన పార్టీల అభ్యర్థులకు షాడో పోలీస్ టీమ్‌లు తిరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ఘర్షణలు జరిగే అవకాశమున్న పోలింగ్ స్టేషన్లకు అదనపు భద్రతను ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల(ఈవీఎం)లకు తగినంత సెక్యూరిటీ ఏర్పాటు చేశారు. పోలింగ్ మెటీరియల్ సరఫరా చేసే కేంద్రాల నుంచి పోలీసులు, భద్రతా సిబ్బందితో ఇతర పోలింగ్ పీవో. ఏపీవో,ఇతర సిబ్బంది వెళతారు.

తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు

- అబద్ధాలు, అసత్యప్రచారాలు చూసి ఓటెయ్యరు
- కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డి ప్రమాదకారి : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రజలు చైతన్యవంతులనీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చెబుతున్న అబద్ధాలు, అసత్యప్రచారాలను చూసి ఓటెయ్యరని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కంటే దుందుడుకు స్వభావంతో ముందుకెళ్తున్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అత్యంత ప్రమాదకారి అని విమర్శించారు. శనివారం హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్నకొద్దీ ఆయనలో అభద్రతాభావం పెరిగిపోయి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నా రన్నారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డిలిద్దరూ అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారని విమర్శించారు. అవినీతి, అధికార దుర్వినియోగం, గ్లోబల్ ప్రచారాలు చేయడంలో వారు దిట్ట అన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని దివాళా తీయించిందనీ, ఇప్పుడు కాంగ్రెస్ ఐదేండ్ల పాలనలో ఏస్థాయికి దిగజారుతుందో అన్న భయంలో ప్రజలున్నారని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు, మాజీ ఉద్యోగులకు పెన్షన్లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగు తున్నదన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏదీ అమల్లోకి రాలేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందట్లేదని చెప్పారు. తన పాలనలో జరుగుతున్న అవినీతి, ఆరు గ్యారెంటీలు, ఆర్ఆర్ ట్యాక్స్‌లలో దేనిపైన రెఫరెండమో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటయ్యాయని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అందులో చేరారనీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందులో చేరుతున్నారని చెప్పారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదన్న ప్రచారాన్ని తప్పుబట్టారు. తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ పెట్టింది వాస్తవం కాదా? రామగుండంలో ఫెర్టిలైజర్ కంపెనీని ప్రారంభించింది నిజం కాదా? బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయలేదా? రైతుల ఖాతాల్లో ఏటా రూ.6వేలు వేస్తున్నది కాదా? 2500 కిలోమీటర్ల రహదారుల విస్తరణ కనిపించడం లేదా? అని ప్రశ్నల వర్షం కురిపిం చారు. దేశంలో అవినీతిని పెంచి పోషించేది కాంగ్రెస్ పార్టీనేననీ, రాహుల్ గాంధీ దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. మోడీ తీసుకున్న విధానపరమైన నిర్ణయాలతో దేశంలో ప్రశాంత వాతావరణం నెలకొందనీ, బార్డర్ విషయంలో తరుచూ గొడవ పెట్టుకునే పాకిస్తాన్ కుక్కిన పేనులా పడి ఉందని చెప్పారు. ప్రపంచం ముందు చిప్పపట్టుకుని అడుక్కునే స్థితికి నేడు పాకిస్తాన్ చేరిందన్నారు.

ఒకే భావజాలం ఉండాలనుకోవడం తగదు

- రాజ్యాంగ విలువలపై దాడి :

ప్రొఫెసర్ హరగోపాల్

నవతెలంగాణ-ఓయూ



దేశంలో ఒకే భావజాలం ఉండాలనుకోవడం తగదని.. ఇది భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. హైదరాబాద్ ఓయూ సీఎఫ్ఆర్డీ కార్యాలయంలో తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్, ఓయూ బహుజన వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఓయూ రీసెర్చ్ స్కాలర్ జంపాల రాజేష్ అధ్యక్షతన 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం.. రాజ్యాంగ పరిరక్షణ" అనే అంశంపై జరిగిన సదస్సులో హరగోపాల్ మాట్లాడారు. బీజేపీ మొదటి నుంచి రాజ్యాంగాన్ని తమది కాదన్నట్టుగా వ్యవహరిస్తోందన్నారు. ప్రస్తుతం రాజ్యాంగ విలువలపై దాడి జరుగుతోందని తెలిపారు. సత్యం మాట్లాడితే అబద్ధం అంటూ వారు ప్రచారం చేస్తున్నారని, మనం కూడా తప్పుడు సమాచారాన్ని నమ్మొద్దని.. అది నిజమా కాదా అని తెలుసుకోవాలని సూచించారు. రాజ్యాంగాన్ని మార్చడం అంటే దాని విలువలను విధ్వంసం చేయడమేనన్నారు. భారతదేశం సెక్యులర్ దేశం అని గుర్తు చేశారు. 75 ఏండ్లల్లో నిర్బంధ చట్టాలు, కఠిన చట్టాలు ఎన్నో వచ్చాయి కానీ సమానత్వం లాంటి చట్టాలు రాలేదన్నారు. ప్రొ. కాశిం మాట్లాడుతూ.. స్వేచ్ఛ, సమానత్వం కోసం యువకులు, యూనివర్సిటీ నాయకులు పోరాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు ఏకం కావాలన్నారు. సరైన సమయంలో స్పందించకపోతే నష్టం జరుగుతుందన్నారు. రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రముఖ మీడియా సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని విద్వేషాలను రెచ్చగొడుతూ మతం పేరిట ఓట్లు దండుకోవాలని చూస్తోందని విమర్శిం చారు. మణిపూర్‌లో రెండు జాతుల మధ్య చిన్న గొడవను బీజేపీ ఓట్ల కోసం పెద్దదిగా చేసి.. రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. బాలరాజ్, గండమల్ల వినోద్‌రావు, పలువురు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా ఓబీసీలు డిమాండ్ చేస్తున్న కులగణనను కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిందని.. అందరం ఏకమై మన భావాలకు సిద్ధాంతాలకు సారుప్యత ఉన్న కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. యూనివర్సిటీలో రీసెర్చ్ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ఫెలోషిప్‌లను బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని.. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తే మన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

బీజేపీ అనుకూల తీర్పులు ఇచ్చిన జడ్జీలకు రాజ్యసభ సీట్లు, అవార్డులు, బహుమానాలు ఇస్తూ న్యాయ వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో కార్పొరేట్లతో కలిసి ప్రజల జీవితాలను అగమ్యగోచరంగా తయారు చేశార న్నారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని.. మనం వేసే ఓటు విజ్ఞతకు, బాధ్యతకు రూపం కావాలని పిలుపునిచ్చారు.

నైట్ షిఫ్టు కార్మికులకూ వేతనంతో కూడిన సెలవివ్వాల్సిందే

- కార్మికులు ఊర్లకుపోయి ఓటేసి డ్యూటీకి ఎలా వస్తారు?
- ఈ నిర్ణయాన్ని కార్మిక శాఖ ఉపసంహరించుకోవాలి : ఈసీకి మెమోరాండం అందజేసిన సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కార్మికుల ఓట్లు పనిప్రదేశ ప్రాంతంలో కాకుండా సొంతూర్లలో ఉంటాయనీ, వారు ఓటేసి నైట్‌డ్యూటీ షిఫ్టుకు ఎలా రాగలుగుతారని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ కార్మికశాఖను ప్రశ్నించారు. రెండు షిఫ్టులకే సెలవు వర్తింపు అని కార్మిక శాఖ జారీ చేసిన మెమోను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పూర్తి వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వికాస్‌రాజ్‌కు మెమోరాండం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ 116 ప్రకారం గెజిట్ నెంబర్ 107లో కూడా కార్మికులకు వేతనంతో కూడిన సెలవును ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు.

నేషనల్ ఆఫ్ సాఫ్ట్‌వేర్, సర్వీస్ కంపెనీస్(నాస్కామ్), యాజమాన్య సంఘాలు రెండు షిఫ్టులకే సెలవును పరిమితం చేయాలని కోరగా కార్మికశాఖ అందుకు సానుకూలంగా స్పందించడం దారుణమన్నారు. ఈసీ ఆదేశాన్ని సైతం పరిగణనలోకి తీసుకోకుండా నైట్ షిఫ్టునకు హాజరయ్యే వారికి సెలవును రద్దు చేస్తూ మెమోను విడుదల చేయడం సరిగాదని తెలిపారు. హైదరాబాద్, ఇతర నగరాల్లో పారిశ్రామిక వాడల్లో పనిచేసే కార్మికులు ఊర్లకు పోయి ఓటు వేసి తిరిగి రాత్రి డ్యూటీకి ఎలా రాగలుగుతారని ప్రశ్నించారు. కార్మికులు ఓట్లు వేయొద్దా? అని నిలదీశారు. దీనివల్ల ఓటింగ్ శాతం తగ్గే ప్రమాదం కూడా ఉంటుందని హెచ్చరించారు. ఈసీ తక్షణమే జోక్యం చేసుకుని జీవో నెంబర్ 222 ప్రకారం గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కార్మికులకు వేతనంతో కూడిన పూర్తి సెలవు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 73,414 మంది సివిల్ పోలీసులు, 500 మంది రాష్ట్ర స్పెషల్ పోలీసులు, 164 కంపెనీల సెంట్రల్ ఫోర్స్, 700 మంది ఇతర ప్రాంతాలకు చెందిన హోంగార్డ్స్ పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. 89, ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టులు, 173 అంతర్ జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మార్చి ఒకటిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.186.14 కోట్ల మద్యం, మాదక ద్రవ్యాలు, ఇతర వస్తువులను పట్టుకున్నట్టు తెలిపారు. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), ప్రజాప్రాతినిధ్య చట్టం (ఆర్పీ) కింద నేరాలకు సంబంధించి 8863 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసామన్నారు. ముందస్తు చర్యగా రాష్ట్ర వ్యాప్తంగా 34,526 మందిని బైండోవర్ చేసినట్టు తెలిపారు. మే 12నుంచి ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలకు చేరే వరకు డీజీపీ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రజలు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించు కునేలా అన్ని చర్యలు చేపట్టినట్టు డీజీపీ తెలిపారు.

నెలాఖరులో ఎప్‌సెట్ ఫలితాలు

- ముగిసిన ఆన్‌లైన్ రాతపరీక్షలు
- ఇంజినీరింగ్ విభాగానికి 94.45 శాతం, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 91.24 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) రాతపరీక్షలు ముగిశాయి. ఈనెల ఏడు నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. శనివారంతో రాతపరీక్షలన్నీ ముగిశాయి. ఈనెలాఖరులో ఎప్‌సెట్ రాతపరీక్షల ఫలితాలు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. అందుకనుగుణంగా కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం చివరిరోజు ఇంజినీరింగ్ విభాగం పరీక్షకు 50,812 మంది దరఖాస్తు చేయగా, 47,974 (94.4 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. 2,838 (5.6 శాతం) మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని వివరించారు. శనివారం ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ కె వెంకటేశ్వరరావు పర్యవేక్షించారని పేర్కొన్నారు.చివరిరోజు ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు ప్రశాంతంగా జరిగాయని వెల్లడించారు. ఆదివారం ఇంజినీరింగ్ విభాగం ప్రాథమిక కీని విడుదల చేస్తామని తెలిపారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలను ఆన్‌లైన్ ద్వారా ఈనెల 14వ తేదీ ఉదయం పది గంటల వరకు స్వీకరిస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం అభ్యర్థులు https://eapcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,00,432 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే, 91,633 (91.24 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. 8,799 (8.76 శాతం) మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఇంజినీరింగ్ విభాగానికి 2,54,750 మంది దరఖాస్తు చేయగా, 2,40,617 (94.45 శాతం) మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

విభాగం	దరఖాస్తు	హాజరు	శాతం	గైర్హాజరు	శాతం
అగ్రికల్చర్, ఫార్మసీ	1,00,432	91,633	91.24	8,799	8.76
ఇంజనీరింగ్	2,54,750	2,40,617	94.45	14,133	5.55
మొత్తం	3,55,182	3,32,250	93.54	22,932	6.46

ఎన్డీయే కంటే యూపీయేనే భేష్

- పీఎంజీఎస్‌వై కింద రోడ్ల నిర్మాణాలు ఎక్కువే
- మోడీ పాలనలో పడిపోయిన వైనం
- నాణ్యతలోనూ రాజీ
- నిర్దేశిత లక్ష్యాలనూ చేరని వైనం

న్యూఢిల్లీ : ఒక దేశ అభివృద్ధికి రోడ్లు చాలా కీలకం. రవాణా సేవలను సులభతరం చేసే రోడ్డు మార్గాలు ఎంతగా బాగుంటే అది ఆ దేశ అభివృద్ధికి అంతగా సహాయపడుతుంది. అయితే, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశంలోని రోడ్డు వ్యవస్థపై విపరీతంగా ప్రచారం చేసుకుంటున్నది. రోడ్ల నిర్మాణాలు తమ హయాంలోనే ఎక్కువగా జరిగాయని ఆ పార్టీ ప్రచారాలు చేసుకుంటున్నది. అయితే, బీజేపీ ప్రచారాలు వాస్తవ పరిస్థితులకు మాత్రం విరుద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా, కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పాలనలో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లలో నాణ్యత లోపించింది. రోడ్ల నిర్మాణం విషయంలో ఎన్డీయే కంటే కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ హయాంలోనే అధిక వృద్ధి నమోదైందని గణాంకాలు చెప్తున్నాయి.

భారత్‌లోని అత్యధిక జనాభా తొంభై కోట్ల మంది(మొత్తం జనాభాలో దాదాపు 65 శాతం) గ్రామాల్లో నివసిస్తున్నారు. వారి ఆర్థికాభివృద్ధికి అత్యంత స్పష్టమైన సూచిక చక్కని రోడ్లు, రహదార్లు. ఈ రహదారి విద్య, వైద్యం, వాణిజ్యం, ఉపాధి, ఇతర అభివృద్ధికి తోడ్పాటునందిస్తుంది. రహదారి భౌగోళికంగా కనెక్టివిటీని అందిస్తుంది. గ్రామాల్లో రోడ్ల కోసం తీసుకొచ్చిన కార్యక్రమం ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై). ఇది గ్రామీణ భారతదేశంలోని రహదారి కనెక్టివిటీని అందించడం లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ పథకం 2000లో వాజ్‌పేయి ప్రభుత్వంలో ప్రారంభించ బడింది. రెండో దశ 2013లో అందుబాటులోకి వచ్చింది. మోడీ హయాంలో, ఈ పథకం మొదట 2016లో విస్తరించబడింది. తర్వాత మూడో దశ 2019లో ప్రారంభించ బడింది. దాదాపు రూ. 32 లక్షల కోట్లతో రెండు దశాబ్దాలుగా 7.6 లక్షల కిలోమీటర్ల గ్రామీణ రహదారులు నిర్మించబడ్డాయి. కొత్త గ్రామీణ రహదారుల విషయంలో ఎన్డీయే కంటే యూపీఏ మెరుగ్గా పని చేసిందని కొన్ని గణాంకాలను ఉటంకిస్తూ నిపుణులు చెప్తున్నారు. ఎన్డీయే పాలనలో రోడ్డు నిర్మాణం నాణ్యత లేని కారణంగా మొత్తం డెలివరీ, ఉద్దేశించిన ప్రయోజనం గణనీయంగా దెబ్బతిన్నదని చెప్తున్నారు.

2009 నుంచి 2011 మధ్య కాలంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో గరిష్ట నిర్మాణం జరిగిందని డేటా చూపిస్తున్నది. పీఎంజీఎస్‌వై మొదటి దశ కింద నిర్మించిన రోడ్ల వార్షిక సగటు యూపీఏ హయాంలో సంవత్సరానికి 33,415 కి.మీ. అయితే.. ఎన్డీయే హయాంలో సంవత్సరానికి కేవలం 24,537 కి.మీ. కావటం గమనార్హం.

పీఎంజీఎస్‌వై రెండో దశ.. ప్రస్తుత గ్రామీణ రహదారులను వాటి ఆర్థిక సామర్థ్యం ఆధారంగా అప్‌గ్రేడ్ చేయడానికి 2013లో ప్రారంభించబడింది. దీని లక్ష్యం 50,000 కి.మీ ఎంపిక చేసిన మార్గాల నాణ్యతను మెరుగుపరచటం. దీని లక్ష్యం మార్చి 2020. ఆ తర్వాత దీనిని 2022, సెప్టెంబర్ వరకు పొడిగించింది మోడీ ప్రభుత్వం. అయితే, ఈ లక్ష్యం చాలా వరకు చేరుకున్నదనీ, మొత్తం 48,962 కిమీలు మంజూరు చేయబడిన రహదారులకు 48,326 కిమీ పొడవుతో నిర్మించబడ్డాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఇక మూడో దశలో భాగంగా.. మావోయిస్టు ప్రభావితమైన ప్రాంతాలపై దృష్టి సారించడానికి 2016లో పీఎంజీఎస్‌వై కింద కొత్త దశ(ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈఏ)ను ప్రారంభించారు. ఇది తెలంగాణ, ఏపీ, బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, యూపీ మధ్య తొమ్మిది రాష్ట్రాల్లోని 44 జిల్లాలను విస్తరించింది. ఇందుకు 2019-20ని లక్ష్యంగా నిర్దేశించారు. ఆ తర్వాత గడువు మార్చి 2023 వరకు పొడిగించబడింది.



> అయితే, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఈ రోడ్ల నిర్మాణాల్లో వేగం కనిపించింది. ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలు, భౌగోళికంగా క్లిష్ట పరిస్థితులున్న రాష్ట్రాల్లో మాత్రం ఇది నెమ్మదిగా ఉన్నది. అసోం, ఛత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్, కర్నాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా, యూపీ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే 80 శాతం మంజూరైన రోడ్లు నిర్మించబడ్డాయి. మిజోరం, మణిపూర్, సిక్కిం వంటి రాష్ట్రాలు రోడ్ల నిర్మాణాల్లో వెనకబడ్డాయి. కేరళ, హిమాచల్ ప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాలు కూడా 30 శాతం కంటే తక్కువ ఆమోదించబడిన రోడ్లను పూర్తి చేశాయి.

అయితే, మోడీ పాలనలో ఈ సమయంలో మంజూరైన రోడ్లలో నాలుగింట ఒక వంతు ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయి. బీహార్ (93 శాతం), జార్ఖండ్, ఒడిశా (86 శాతం), మహారాష్ట్ర (82 శాతం), యూపీ(81 శాతం)లో అత్యధికంగా పూర్తి చేశారు. మధ్యప్రదేశ్ (24 శాతం), తెలంగాణ (42 శాతం)లు వెనకబడి ఉన్నాయి. శాంతి భద్రతలు, అటవీ శాఖ అనుమతుల సమస్య, రాష్ట్రాల్లో కాంట్రాక్టర్లు అందుబాటులో లేకపోవటం వంటి కారణాలతో జాప్యం జరిగిందని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ గతేడాది ఆరోపించిన విషయం విదితమే.

రెండో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత 2019, జులైలో మోడీ ప్రభుత్వం నాలుగో దశను ప్రారంభించింది. ఇందులో భాగంగా కొత్త రహదారులను నిర్మించడం కంటే ఇప్పటికే ఉన్న రహదారులను మెరుగుపరచడంపై దృష్టి పెట్టింది. పీఎంజీఎస్‌వై నాలుగో దశ 1.25 లక్షల కి.మీ గ్రామీణ రహదారులను లక్ష్యంగా చేసుకున్నది. దీనిని 2025 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, నాలుగో దశ కింద నిర్మించిన రోడ్ల మొత్తం పొడవు 78,492 కి.మీ. ప్రారంభ లక్ష్యం 1.25 లక్షలు. అంటే పూర్తయింది 63 శాతమే.

నిధుల ఆందోళన

పీఎంజీఎస్‌వై 100 శాతం కేంద్ర ప్రాయోజిత పథకంగా 2000లో ప్రారంభించ బడింది. అయితే, 2015-16లో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దానిని కేంద్రం 60 శాతానికి, రాష్ట్రం 40 శాతానికి మార్చింది. రెండు దశాబ్దాలుగా 7.6 లక్షల కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారుల నిర్మాణానికి భారతదేశం దాదాపు రూ. 3.2 లక్షల కోట్లు (రాష్ట్ర వ్యయంతో కలిపి) ఖర్చు చేసింది. 2014 నుంచి 2024 వరకు ఎన్డీయే రూ.1.79 లక్షల కోట్లు, యూపీఏ అధికారంలో ఉన్న దశాబ్ద కాలంలో రూ.0.95 లక్షల కోట్లు ఖర్చు చేసింది. కాగా, ఈ పథకం కింద నిర్మించిన రోడ్లలో నాణ్యత లోపించిందని కూడా తెలుస్తున్నది. ఇందుకు గ్రామీణాభివృద్ధిపై స్టాండింగ్ కమిటీ వ్యాఖ్యలే నిదర్శనం. 2022లో గ్రామీణాభివృద్ధిపై స్టాండింగ్ కమిటీ నాణ్యత 'పూర్తిగా ఆమోదయోగ్యం కాదు', 'పేలవమైన రహదారి పదార్థాలను' ఉపయోగించి రోడ్లు నిర్మించారని ఆరోపించింది.

కాంట్రాక్టు కష్టాలు

పీఎంజీఎస్‌వై బిల్డింగ్ కాంట్రాక్టులను ప్రయివేట్ వెండర్‌లకు అప్పగించే విధానాన్ని పున్ణపరిశీలించాలని నిపుణులు చెప్తున్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా.. స్కీమ్ మార్గదర్శకాల ప్రకారం ఆసక్తిగల పార్టీలు ప్రామాణిక బిడ్డింగ్ డాక్యుమెంట్‌ని ఉపయో గించి పని కోసం వేలం వేయాలని సూచిస్తున్నారు. నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం రోడ్లు నిర్మించబడినప్పటికీ, నిర్వహణ లోపించడం తరచుగా జరుగుతున్నది. పీఎంజీఎస్‌వై కింద నిర్మించిన రోడ్ల సాధారణ డిజైన్ జీవితం 10 సంవత్సరాలు. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ అని పిలువబడే మొదటి ఐదు సంవత్సరాలు, దాని నిర్వహణకు రోడ్డు కాంట్రాక్టర్ బాధ్యత వహిస్తాడు. తదనంతరం, బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు మారుతుంది. అయితే, స్టాండింగ్ కమిటీ ప్రకారం.. కాంట్రాక్టర్లు తరచుగా నిర్వహణ నిబంధనను ఉల్లంఘిస్తున్నారు. ఫలితంగా ఈ రోడ్లు దెబ్బతిన్నాయి.

అడవుల జల్లెడ

- సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం
- బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో భద్రతా చర్యలు



నవతెలంగాణ-చర్ల

ఎన్నికల వేళ ఏజెన్సీ ప్రాంతం నివురుగప్పిన నిప్పులా మారింది. వరుస ఎన్‌కౌంటర్లతో దండకారణ్యాలు దద్దరిల్లుతున్నాయి. రోజూ ఏదో ఒక పక్క ఎదురు కాల్పులు జరుగుతూ ఉంటే అరణ్య గ్రామాల్లో ఆర్తనాదాలు చెప్పలేనివి. దీంతో సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. భద్రతా బలగాలు అడవిని జల్లెడ పడుతున్నాయి.

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో గంటగంటకూ పేలుతున్న తూటాలతో 'అంబుజమాని' అడవి దద్దరిల్లుతోంది. ఈ నేపథ్యంలో చర్ల పోలీసులు అప్రమత్తమై సీఐ ఏ.రాజు వర్మ నేతృత్వంలో భద్రత కట్టుదిట్టం చేశారు. ఎప్పటికప్పుడూ అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సరిహద్దు గ్రామాలైన పూసుగుప్ప, వద్దిపేట, ఉంచుపల్లి, కుర్నపల్లి బోధనల్లి, తిప్పాపురం చెన్నాపురం, గోరుకొండతో పాటు ఛత్తీస్‌గఢ్ గ్రామాలైన రాంపురం, నిమ్మలగూడెం, ఎర్రంపాడు, బట్టిగూడెం, బత్తెనపల్లి లో పోలీసు బలగాలు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. సమస్యాత్మకమైన గ్రామాల్లో బాంబు స్క్వాడ్‌లతో తనిఖీ చేస్తున్నారు. మరోవైపు భద్రాద్రి ఎస్పీ రోహిత్ చేసిన ప్రకటనతో కొంత మంది మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారు. అంతేకాకుండా ఆదివాసీ గ్రామాల్లో ఉన్న పటేల్‌లు, సర్పంచ్‌ల సహకారంతో మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న కమిటీ ఏరియా కమాండర్లను లొంగిపోయే విధంగా కృషి చేస్తున్నట్టు పోలీస్ శాఖ చెబుతోంది.

మండలంలో 36 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

పార్లమెంట్ ఎన్నికలకు చర్ల మండల వ్యాప్తంగా 36 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో 60 శాతం పోలింగ్ కేంద్రాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఉండటంతో భద్రతా ఏర్పాట్లు చేయడంలో పోలీస్ అధికారులు నిమగ్నమయ్యారు.

కాంగ్రెస్ గ్లోబెల్స్ ప్రచారాన్ని మానుకోవాలి

- మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ - బంజారాహిల్స్

కాంగ్రెస్ పార్టీ గ్లోబెల్స్ ప్రచారాన్ని మానుకోవాలని ఎంఆర్‌పీఎస్ నేత మందకృష్ణ మాదిగ అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రాజ్యాంగం రద్దవుతాయన్న మాటలు నమ్మొద్దని, తానుండగా రాజ్యాంగం మార్పు ఉండదని ప్రధాని మోడీ స్వయంగా చెప్పారని అన్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి మొదలు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే వరకు అందరూ గ్లోబెల్స్ ప్రచారం చేస్తూ ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రిజర్వేషన్ల గురించి మాట్లాడే కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. మాదిగలకు దూరమైన కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ల గురించి తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్‌లో బీసీలు ముఖ్యమంత్రి అయ్యే ప్రసక్తే లేదన్నారు. రేవంత్‌రెడ్డి తనను బీజేపీ నాయకుడు అంటున్నారని, కానీ తనకు బీజేపీ సభ్యత్వం లేదని తెలిపారు.

దేశం నుంచి ముస్లింలను వెళ్లగొట్టే కుట్ర

- బీజేపీపై వీహెచ్ ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశం నుంచి ముస్లింలను వెళ్లగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని మాజీ ఎంపీ వి హనుమంతరావు ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ కుట్రలను తిప్పికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షాలు రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని తెలిపారు.అందుకే దేశ ప్రజలు 'మోడీ హటావ్-దేశ్ బచావ్' అని మాట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తిరుపతి వెంకన్న సాక్షిగా ఏపీకీ స్పెషల్ స్టేటస్ ఇస్తానన్న మోడీ అక్కడి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. బీజేపీ రెండు నాల్కల దోరణితో వ్యవహరిస్తున్నదని విమర్శించారు. మణిపూర్ మహిళలను నగ్నంగా ఊరేగిస్తే మోడీ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు.ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తోందనీ, కులగణన చేసి విప్లవాత్మక మార్పులు తీసుకరాబోతున్నదని చెప్పారు.

పదేండ్ల కన్నీళ్లను యాది ఉంచుకుందాం

- ప్రజా ద్రోహుల పాలనను అంతం చేద్దాం
- ట్విట్టర్‌లో కాంగ్రెస్ పార్టీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని శనివారం కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్ వేదికగా పేర్కొంది. ఎన్నో హామీలిచ్చి చివరకు రాష్ట్రానికి గాడిద గుడ్డు మాత్రమే ఇచ్చిందని ఎద్దేవా చేసింది. రాష్ట్ర విభజన హామీల అమలు, కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన ఇతర అంశాలపై ట్విట్టర్‌లో వినూత్నంగా పోస్ట్ చేసింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి కీలకమైన హామీలను అమలు చేయలేదని పేర్కొంది. రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేసే ఐటీఐఆర్, ఇండస్ట్రియల్ పార్కులు, హైదరాబాద్‌కు ఇండస్ట్రియల్ కారిడార్లు రాకపోవడం, కరీంనగర్, వరంగల్ స్మార్ట్ సిటీలుగా కాకపోవడం వంటి అంశాలను ప్రస్తావించింది. యువత భవితకు ఉపయోగపడే ఐఐటీ, మెడికల్ కాలేజీలు, ఐఐఎం, ఎస్‌ఐడీ విద్యాలయాలు, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు తెలంగాణ రాష్ట్రానికి మంజూరు చేయడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించింది. 'పదేండ్ల కన్నీళ్లను యాది ఉంచుకుందాం..ప్రజా ద్రోహుల పాలనను అంతం చేద్దాం. హస్తం గుర్తుకు ఓటేద్దాం కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దాం' అని రాష్ట్ర ప్రజానీకానికి పిలుపునిచ్చింది.

అదానీ, అంబానీలకు దోచి పెట్టారు

- ఏఐసీసీ ఎక్స్ సర్వీస్ మెన్ విభాగం చైర్మెన్ కల్నల్ హరీశ్ చౌదరి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్ల బీజేపీ పాలనలో దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచి పెట్టారని ఏఐసీసీ ఎక్స్ సర్వీస్ మెన్ విభాగం చైర్మెన్ కల్నల్ హరీష్ చౌదరి ఆరోపించారు. దేశంలో ఇప్పుడు క్లిష్ట పరిస్థితుల్లో ఉందన్నారు. అన్ని వర్గాలకు అన్యాయం చేసిందన్నారు.తమపార్టీ బడుగు, బలహీన వర్గాల పక్షానా నిలబడుతున్నదని చెప్పారు.ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తప్పదని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తోందని ధీమా వ్యక్తం చేశారు. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న సైనికుల పట్ల మోడీ చిన్న చూపు చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. 'వన్ నేషన్- వన్ పెన్షన్' ఇస్తానంటూ ఆర్మీని మోసం చేశారని విమర్శించారు. అగ్ని పథ్ పేరుతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు చేపడుతోందన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం



(మొదటిపేజీ తరువాయి)

కేంద్రబలగాలు, 60 వేల మంది రాష్ట్ర పోలీసులు, 15 వేల మంది యూనిఫామ్ పోలీసులు విధులు నిర్వహిస్తారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసాం" అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ తెలిపారు. శనివారం హైదరాబాద్ బీఆర్‌కే భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రచార గడువు ముగిసిన నేపథ్యంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, బల్క్ ఎస్ఎంఎస్‌లకు అనుమతి లేదని తేల్చి చెప్పారు. పార్టీలు, అభ్యర్థులు నేడు, రేపు ప్రకటనలు ఇవ్వాలనుకుంటే ఈసీ అనుమతి తీసుకోవాలని సూచించారు. జూన్ 1న జరిగే చివరి దశ పోలింగ్ పూర్తయ్యే వరకు పత్రికలు, టీవీలు, సోషల్‌మీడియా, ఇతర ప్రచార సాధనాలు ఎగ్జిట్ పోల్స్ ప్రకటించరాదని చెప్పారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి రాష్ట్రంలో 144వ సెక్షన్ అమల్లోకి వచ్చిందనీ, నిబంధనలకు విరుద్ధంగా ప్రజలు గుమికూడరాదని హెచ్చరించారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు వెంటనే ఖాళీ చేసి తమ తమ ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఈసీ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. మద్యం, డబ్బులు పంపిణీ జరగకుండా సాధారణ పరిశీలకులు, పోలీస్ అబ్జర్వర్స్, వ్యయ పరిశీలకులు నిత్యం పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో మొత్తం 3,32,32,318 3 ఓటర్లు ఉన్నారనీ, అందులో 1,65,28,365 మంది పురుష ఓటర్లు, 1,67,01,192 మంది మహిళా ఓటర్లు, 18 నుంచి 20 సంవత్సరాల వయసున్న యువ ఓటర్లు 9,02,960 మంది ఉన్నారని వికాస్‌రాజ్ తెలిపారు. ఇప్పటి వరకు 96 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,809 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఒక్క ఈవీఎం మిషన్‌లో నోటాతో కలిపి 16 గుర్తులు మాత్రమే వస్తాయనీ, ఈ క్రమంలో ఏడు నియోజక వర్గాల్లో 3, తొమ్మిది నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున ఈవీఎంలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో 12 మంది బరిలో ఉన్నందున అక్కడ ఒక్క ఈవీఎం సరిపోతుందని తెలిపారు. ఈ సారి అభ్యర్థుల సంఖ్య భారీగా ఉండటంతో1.5 లక్షల ఈవీఎంలు ఉపయోగిస్తున్నామని వివరించారు. మూడు పోలింగ్ స్టేషన్లలో వరుసగా 10,12, 14 మంది ఓటర్లు, 25 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లు 11 ఉండగా, 50 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లు 23, 100 మంది ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లు 54 ఉన్నాయని తెలిపారు. మొత్తం 1లక్ష 88 వేల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, 21,680 హెూం ఓట్లు పోలయ్యాయని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంలు మొరాయిస్తే ఈసీ నిబంధనల ప్రకారం సెక్టర్ ఆఫీసర్లు మారుస్తారని తెలిపారు. ఈవీఎంలు సరఫరా చేసిన ఈసీఐఎల్ కంపెనీ ఇంజినీర్లు అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా ఇద్దరేసి చొప్పున అందుబాటులో ఉంటారని వివరించారు. ఇప్పటి వరకు సీ విజిల్ ద్వారా 2,342, 1950 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా 1,511, ఎన్‌జీఎస్‌పీ పోర్టల్ ద్వారా 1,526 ఫిర్యాదుల వచ్చాయని తెలిపారు. పోలింగ్ పూర్తయ్యే వరకు వచ్చిన ఫిర్యాదులను గరిష్టంగా 100 నిమిషాల్లో పరిష్కరిస్తామని తెలిపారు.

రాష్ట్రంలో పోలింగ్ శాతం పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు వివరించారు. ఓటు హక్కు అవశ్యకతను తెలిపేందుకు కాలేజీలు, విద్యాసంస్థలు, సివిల్ సొసైటీలు, స్వచ్ఛందసంస్థలు, మీడియా తదితర మార్గాల సాయం తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క ఓటరు బాధ్యతగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ ఒకటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ.320 కోట్ల విలువ చేసే నగదు, బంగారం, ఇతర ఆభరణాలు, డ్రగ్స్, నార్కొటిక్స్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి 8.600 కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

ఏ కోణంలో చూసినా వైఫల్యాలే


- వాస్తవాలపై లోతైన విచారణ
- అధికారులతో జస్టిస్ ఘోష్ వ్యాఖ్య ?
- కాళేశ్వరం ఫైళ్ల పరిశీలన : పంపు హౌజ్‌ల మునక, అన్నారం, సుందిళ్లకు బుంగలు,
- మేడిగడ్డ కుంగుబాటుపై ఆరా విచారణలో భాగంగా అధికారులతో భేటీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగంగా నిర్మించిన బ్యారేజీలపై సమగ్ర సమాచారం కోసం అధికారులతో న్యాయ విచారణ కమిషన్ చైర్మెన్ జస్టిస్ పినాకిని చంద్రఘోష్ సమావేశయ్యారు. శనివారం బీఆర్‌ఆర్‌కే భవన్‌లోని కార్యాలయంలో విచారణ నిర్వహించారు. వరుసగా అధికారులతో ఆయన భేటీకావడం ఇది మూడో రోజు. మేడిగడ్డ కుంగుబాటుతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు బుంగలు ఏర్పడిన అంశాలపై అధికారులతో కలిసి అధ్యయనం చేశారు. 2015 నుంచి ఇప్పటివరకు జరిగిన నిర్మాణ పనులు, బ్యారేజీల కుంగుబాటు, బుంగలతోపాటు పంపుహౌజ్ మునకకు సంబంధించిన వివరాలను అధికారుల ను అడిగి తెలుసుకున్నారు. ఈ బ్యారేజీల నిర్మాణం అనంతరం సమస్యలు ఉత్పన్నమైనప్పుడు తీసుకున్న చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. నిర్మాణ వైఫల్యాలు ఉండటంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయనే అభిప్రాయాన్ని జస్టిస్ వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఏకోణంలో చూసినా వైఫల్యాలు కనిపిస్తున్నాయని ఆయన అధికారులతో అన్నట్టు సమాచారం. 2019లో మేడిగడ్డ పగుళ్లు, అన్నారం బ్యారేజీలో బుంగలు ఏర్పడినప్పుడు తీసుకున్న చర్యలతో పాటుగా అప్పటి రికార్డులను ఆయన పరిశీలించారు. అలాగే అన్నారం బ్యారేజీ దిగువన సీపేజ్‌లు ఏర్పడినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఆయన అధికారులను ప్రశ్నించారు. దిద్దుబాటు చర్యలను అధికారులు వివరించినప్పటికీ ఇంకా సమగ్రమైన సమాచారం కావాలని కోరినట్టు తెలిసింది. వరుసగా అన్నారంలో బుంగలు రావడానికి నిర్మాణ వైఫల్యాలే కారణ మంటూ, మరిన్ని వివరాలు కావాలని అడిగినట్టు తెలిసింది. అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ మేడిగడ్డ నిర్మాణ సంస్థ ఒకటే కావడంతో సమస్యలు కూడా ఒకేలా ఉన్నాయని అధికారులతో చెప్పినట్టు సమాచారం. అయితే 38, 28 పిల్లర్ల దగ్గర సీపేజ్‌లు ఏర్పడినప్పుడు రాళ్లు, ఇసుక సంచులతో తాత్కాలిక మరమ్మతులు చేసినట్టు అధికారులు జస్టిస్ ఘోష్‌కు వివరించారు. అలాగే నిర్మాణ సంస్థలతో గ్రౌటింగ్ చేయించినట్టు తెలిపారు, హిమాచల్‌ప్రదేశ్ నుంచి పాలియూరిథిన్ అనే కెమికల్‌ను తెప్పించి బ్యారేజీలోని 38, 28 పియర్ల దగ్గర బుంగలకు గ్రౌటింగ్ చేయించిన విషయాన్ని అధికారులు వివరించినట్టు సమాచారం. అయితే శాస్త్రీయంగా గ్రౌటింగ్ అయిన అనంతరం కూడా మళ్లీ బుంగలు ఎందుకు ఏర్పడ్డాయనీ, దీనికి వివరణ కావాలని జస్టిస్ అధికారులను అడిగినట్టు తెలిసింది. మేడిగడ్డ, అన్నారం పంపు హౌజ్లు నీటమునిగినప్పుడు ఏర్పడిన నష్టం, తీసుకున్న చర్యలు, నిర్మాణ సంస్థలతో చేసుకున్న ఒప్పందాలపై ఆయన అధికారులనుంచి సమాచారం రాబట్టారు. ఈ సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ బి అనిల్‌కుమార్, ఓ అండ్ ఎం ఈఎన్సీ నాగేందర్‌రావు ఈ సమావేశానికి హాజరై జస్టిస్ అడిగిన సందేహాలు, అనుమానాలకు సమాధానాలు ఇచ్చారు.

కాంగ్రెస్‌కు సర్జికల్ దాడులు చేసే దమ్ముందా..?

నవతెలంగాణ-వికారాబాద్ ప్రతినిధి



దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్‌కు సర్జికల్ దాడులు చేసే దమ్ముందా అని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా అన్నారు. ప్రధాని మోడీపై ఒక్క అవినీతి మరకా లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా శనివారం వికారాబాద్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో అమిత్ షా మాట్లాడుతూ.. కొంచెం ఉష్ణోగ్రతలు ఎక్కువైనా విదేశాలకు వెళ్లే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తమకు పోటీనే కాదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని అన్నారు. బీజేపీ ఉన్నంతకాలం పీఓకేను పాకిస్థాన్‌కు అప్పగించడం సాధ్యం కాదన్నారు. బీజేపీకి 400 సీట్లు వస్తే రిజర్వేషన్ రద్దు చేస్తారని సీఎం రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. మజ్లిస్ ఓటు బ్యాంకుకు రేవంత్‌రెడ్డి భయపడుతున్నారని ఆరోపించారు. బీజేపీ మాత్రం ఓటు బ్యాంకు కోసం ఎన్నడూ భయపడలేదన్నారు. తెలంగాణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్, మజ్లిస్‌ను రాష్ట్రం నుంచి తరిమే శక్తి బీఆర్ఎస్‌కు లేదని, కేవలం బీజేపీకే ఉందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి అడ్డాగా మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఏటీఎంలా మార్చుకుందని ఆరోపించారు. వికారాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ ఆపుతామని తెలిపారు. చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అద్దె కట్టమంటే...అసత్యాలు ప్రచారం చేస్తారా?

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై ఆర్టీసీ యాజమాన్యం ఫైర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలే అని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) స్పష్టం చేసింది. ఆర్టీసీకి చెందిన స్థలంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన అద్దె బకాయిలు చెల్లించమని అడిగితే, ఆయన టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం, అధికారులపై వ్యక్తిగతంగా ఆరోపణలు చేస్తూ, దూషించడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని శనివారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొంది. వివరాల్లోకి వెళ్తే...నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ బస్‌స్టేషన్ సమీపంలోని 7,059 చదరపు గజాల భూమిని విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రయివేట్ లిమిటెడ్‌కు టీఎస్‌ఆర్టీసీ అద్దెకు ఇస్తూ ఒప్పందం చేసుకుంది. ప్రత్యామ్నాయ రెవెన్యూ పెంచుకోవడంలో భాగంగా 33 ఏండ్లకు బిల్ట్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) కింద 2013 జూన్ 1న ఆ భూమిని లీజ్‌కు ఇచ్చారు. ఆ స్థలంలో ఒక షాపింగ్ మాల్‌ను కంపెనీ డెవలప్ చేసింది. 2017లో విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి టేక్‌ఓవర్ చేసుకొని, షాపింగ్ మాల్‌కు జీవన్‌రెడ్డి మాల్ అండ్ మల్టీప్లెక్స్‌గా పేరుపెట్టారు. థర్డ్ పార్టీలకు అందులోని స్టాళ్లను లీజ్‌కు ఇచ్చారు. ఒప్పందం ప్రకారం ఆ కంపెనీ సకాలంలో అద్దె చెల్లించలేదు. 2015 అక్టోబర్ వరకు రూ.4.30 కోట్ల బకాయి ఉంది. దీనితో అప్పుడే టెర్మినేషన్ ఆర్డర్‌ను ఆర్టీసీ యాజమాన్యం జారీ చేసింది. ఫలితంగా రెండు విడతల్లో రూ.69 లక్షలు చెల్లించారు. మిగతా బకాయిలు చెల్లించాలని పలుమార్లు నోటీసులు పంపించినా స్పందించలేదు. గత ఏడాది అక్టోబర్ వరకు రూ.8.65 కోట్ల బకాయిలు ఉన్నాయి. మళ్లీ నోటీసులు జారీ చేయడంతో, అక్టోబర్‌లో రూ.1.50 కోట్లు చెల్లించారు. ఆ తర్వాత షోకాజ్ నోటీసులు పంపిస్తే, గత ఏడాది డిసెంబర్‌లో విడతల వారీగా రూ.2.40 కోట్లు కట్టారు. షోకాజ్ నోటీసును సవాల్ చేస్తూ జీవన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం టీఎస్‌ఆర్టీసీకి బకాయిలు చెల్లించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో విడతల వారీగా రూ.2 కోట్లు చెల్లించారు. ఈ కేసుపై బకాయిలన్నీ నెల రోజుల్లో చెల్లించాలని మార్చి 27న హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అది ప్రజల డబ్బు అనీ, బకాయిలు చెల్లించకుంటే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించింది. నెల రోజుల గడువు పూర్తయినా మొత్తం బకాయిని ఆ కంపెనీ చెల్లించలేదు. ఇప్పటివరకు రూ.2.51 కోట్ల అద్దె బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ నెల 9వ తేదిన నోటీసులు ఇవ్వడానికి ఆర్టీసీ అధికారులు షాపింగ్ మాల్‌కు వెళ్లారు. ఆ మాల్‌లో థర్డ్ పార్టీ స్టాళ్లు ఉండటంతో వారికి సమాచారం ఇచ్చేందుకు మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శుక్రవారం నిజామాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి, టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం, ఉన్నతాధికారులపై ఇష్టానుసారంగా నిరాధారమైన అసత్య ఆరోపణలు చేశారు.

ఈ చర్యను టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. ఆ వ్యాఖ్యల్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని ప్రకటించింది. అద్దె బకాయిల విషయంలో లీజ్ ఒప్పందం, హైకోర్టు ఆదేశాల ప్రకారమే సంస్థ నడుచుకుంటోందని స్పష్టం చేసింది. బకాయిలు చెల్లించాలని గత ఐదేండ్లలో 20కి పైగా నోటీసులను సంస్థ జారీ చేస్తే, తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదనడంలో ఏమాత్రం నిజం లేదని వివరణ ఇచ్చింది. కేంద్రానికి జీఎస్టీ చెల్లించట్లేదనడం కూడా పూర్తి అర్ధరహితమని తేల్చిచెప్పింది. నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా జీఎస్టీని కేంద్రానికి సంస్థ చెల్లిస్తున్నదని వివరణ ఇచ్చింది. బకాయిల విషయంలో సంస్థ ఏమాత్రం రాజీ పడబోదనీ, నిబంధనల ప్రకారం వాటిని వసూలు చేస్తుందని తెలిపింది.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

- ముత్తినేని వీరయ్య

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం జరుగుతుందని టీపీసీసీ వికలాంగుల విభాగం రాష్ట్ర చైర్మెన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. వికలాంగులు, వితంతువులు, వృద్ధులు, ఫించన్‌దారులు, పెరిక కులస్తులు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారని శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫించన్‌దారులు, పెరిక కులస్తులకు కాంగ్రెస్ ఆత్మబంధువు అని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయ సంకల్ప యాత్ర-2 పేరుతో రాష్ట్ర వ్యాప్త యాత్ర చేపట్టినట్టు తెలిపారు. ఆయా వర్గాల నుంచి కాంగ్రెస్‌కు భారీ స్పందన వచ్చిందని వివరించారు. ఏప్రిల్ 23న సీఎం రేవంత్ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారని గుర్తు చేశారు. మరుసటి రోజు గాంధీభవన్ నుంచి యాత్ర ప్రారంభించి హైద్రాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ళ, భువనగిరి, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌బాద్, వరంగల్, కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గాల్లో కొనసాగిందన్నారు. వికలాంగుల మోటార్ బైక్‌లతో ర్యాలీలు, కార్నర్ మీటింగులు పెద్ద ఎత్తున నిర్వహించినట్టు తెలిపారు.

వికలాంగులకు అన్యాయం చేసిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.యాత్రకు సమన్వయ కర్తగా పెరికకుల కార్పొరేషన్ సాధన సమితి అసోసియేట్ అధ్యక్షులు కోట మల్లికార్జున్‌రావు వ్యవహరించారని తెలిపారు. యాత్రను విజయవంతం చేసిన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు

రాబోయేది ఇండియా ఫోరమే

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న తాము ఢిల్లీకి పూర్తి స్థాయి రాష్ట్ర హెూదా కల్పిస్తామని చెప్పారు. ఎల్జీ కూడా ఢిల్లీకి చెందిన వారే ఉంటారని, ప్రస్తుత ఎల్జీ గుజరాత్ నుంచి వచ్చారని అన్నారు. మరోవైపు మీ ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరో చెప్పాలంటూ.. ఇండియా ఫోరం నేతలను బీజేపీ నాయకులు పదే పదే ప్రశ్నిస్తున్నారని ఈ సందర్భంగా కేజ్రీవాల్ గుర్తు చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో ముందు మీ ప్రధానమంత్రి అభ్యర్థి పేరు ప్రకటించాలని బీజేపీ నేతలను ఆయన డిమాండ్ చేశారు. 2025 సెప్టెంబర్ 17తో ప్రధాని మోడీ 75వ వసంతంలోకి అడుగు పెడుతారన్నారు. ఈ నేపథ్యంలో 75 ఏండ్లు వచ్చిన నాయకులు రాజకీయాల నుంచి తప్పుకోవాలంటూ బీజేపీలో ఓ నియమం ఉందని ఈ సందర్భంగా అరవింద్ కేజ్రీవాల్ గుర్తు చేశారు. ఈ నియమం ప్రకారం వచ్చే ఏడాది సెప్టెంబర్ 17తో మోడీ రాజకీయాల నుంచి రిటైర్ అవుతున్నారని చెప్పారు. దీంతో మీ పార్టీ ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరో ప్రకటించాలని బీజేపీ నేతలకు కేజ్రీవాల్ సవాల్ విసిరారు.

కుప్టి ప్రాజెక్ట్ నిర్మాణం చేపడతాం

- ఆత్రం సుగుణను గెలిపించండి : మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఇచ్చోడ

బోథ్ నియోజకవర్గంలో కుప్టి ప్రాజెక్ట్ నిర్మాణం చేపడతామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోనీ బోరిగామ గ్రామంలో చివరి రోజు ఎన్నికల ప్రచారంలో మంత్రి పాల్గొని ఓటర్లను అభ్యర్థించారు. ఈ గ్రామంలో ఇంటింటికీ తిరిగి గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాజీ పీఏసీఎస్ చైర్మెన్ ముత్యం రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. బోథ్ నియోజకవర్గానికి అత్యధిక నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆసిఫ్ ఖాన్, ప్రవీణ్ రెడ్డి, నారాయణ్ రెడ్డి, అంగుర్ల నాగన్న, శంకర్, ఫారూక్, కళ్లెం నారాయణ్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, గంగేశ్వర్, రజాక్, ఇమ్రాన్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని బీజేపీ పాటించడం లేదు

టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల నియమావళిని బీజేపీ నేతలు పాటించడం లేదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ విమర్శించారు. మోడీ, అమిత్‌షా ఎన్నికల నిబంధనలను విచ్చలవిడిగా ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆ పార్టీ నాయకులు ప్రతి రోజూ కాంగ్రెస్‌ను, నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మాట్లాడుతున్నారని తెలిపారు. ఇది మోడల్ ఎలక్షన్ కండక్ట్‌లా లేదనీ, మోడీ కండక్ట్‌లా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

గోవా నుంచి అక్రమంగా తరలిస్తున్న.... రూ. 2.07 కోట్ల లిక్కర్ పట్టివేత

- అబ్కారి శాఖ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టడానికి గోవా నుంచి తెలంగాణ ద్వారా ఏపీకి అక్రమంగా తరలిస్తున్న రూ.2.07 కోట్ల విలువ చేసే నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను పట్టుకున్నట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న ఏపీకి చెందిన డీసీఎం వాహనంలో రాష్ట్రం ద్వారా విశాఖపట్నానికి తరలిస్తున్న ఈ మద్యాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలాపూర్ వద్ద పక్కా సమాచారంతో పట్టుకున్నట్టు తెలిపారు. 48 బాక్స్‌ల్లో ఉన్న 2 వేల బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అలాగే ఒరిస్సా నుంచి రాష్ట్రంలోకి తరలిస్తున్న రూ.6.5 లక్షల విలువ చేసే గంజాయినిఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వల పన్ని పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. టీఎస్ 12 ఈఎం 0940 అనే నెంబర్ గల మారుతీ కారు డోర్లల్లో ఎవరికి అనుమానం రాకుండా రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారంతో స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

ఆఫ్ఘన్‌లో ఆకస్మిక వరదలు

- 330 మందికి పైగా మృతి



కాబూల్ : ఆఫ్ఘనిస్తాన్‌లోని పలు ప్రావిన్స్‌ల్లో భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ నెల 9వ తేదీ నుంచి భారీ వర్షాలు కురియడంతో నివాస ప్రాంతాలన్నీ చెరువులను తలపించాయి. వరద నీటిలో చిక్కుకొని ప్రజలు విలవిల్లాడారు. వర్షాల కారణంగా చోటుచేసుకున్న వివిధ ప్రమాదాల్లో 330 మందికి పైగా మరణించారు. వందల సంఖ్యలో గాయపడ్డారు. ఈ విషయాన్ని ప్రపంచ ఆహార కార్యక్రమం ఆఫ్ఘనిస్తాన్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఉత్తర బాగ్లాన్ ప్రావిన్స్‌లో ఈ వరదలకు బాగా దెబ్బతిందని, వెయ్యికి పైగా ఇండ్లు ధ్వంసమయ్యాయని, ఇక్కడే 300 మందికి పైగా మరణించారని ఐక్యరాజ్య సమితి సంస్థ శనివారం సోషల్ మీడియాలో తెలిపింది. వరద బాధితులకు ప్రస్తుతం ఆహారం అందిస్తున్నట్లు పేర్కొంది. గత నెల రోజులుగా ఆఫ్ఘనిస్తాన్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నదులు, చెరువులు పొంగి వరదలు రావడంతో పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం సంభవించిందని స్థానిక అధికారులు తెలిపారు.

ఓటేయ్యడం మర్చిపోవద్దు : నరేష్ యాదవ్



నవతెలంగాణ - సంతోష్‌నగర్

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయడం మర్చిపోవద్దు అని న్యాయవాది, ఆర్టీఐ కార్యకర్త నరేష్ యాదవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నప్పటికీ...2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడానికి చాలా మంది ఓటర్లు ఆసక్తి చూపలేదన్నారు. మీ అనుబంధ రాజకీయ పార్టీలు గెలిచినా, ఓడిపోయినా సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటును డబ్బు కోసం అమ్ముకోవద్దని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరునికీ ఓటు హక్కు కల్పించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాసూరి రమేష్ కుమార్, ఖమ్మంపాటి క్రాంతికర్, చండి వెంకటేష్, పసుపుల సాయి నిఖిల్ పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటేయ్యాలి'



నవతెలంగాణ - ఎల్బీనగర్

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని మలక్ పేట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ అక్బర్ కోరారు. శనివారం ప్రచారం చివరి రోజు కావడంతో ఆయన మలక్‌పేట్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా పాలనతో ప్రజలు కేంద్రం లోనూ కాంగ్రెస్‌ను ఆశీర్వదించడానికి సిద్ధంగా వున్నారని అన్నారు. ఎండలు ఎక్కువగా ఉండడం, సెలవుగా భావించి కొందరు ఓటు వేసేందుకు బద్ధకించే అవకాశం ఉందని, దీనిని గుర్తించి ప్రతీ కార్యాకర్త మీ ప్రాంతంలో ఉన్న వారందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా అప్రమత్తం చేయాలన్నారు.



ఆకృతి ఆధ్వర్యంలో ఉప్పలకు సత్కారం

నవతెలంగాణ - నాగోల్

నిస్వార్థంగా సమాజహితం కోసం పని చేసినవారే నిజమైన నాయకులని ఆకృతి సంస్థ అధ్యక్షుడు ఆకృతి సుధాకర్ అన్నారు. నాగోల్‌లోని ఉప్పల ఫౌండేషన్ కార్యాలయంలో అక్షయ తృతీయను పురస్కరించకుని ఉప్పల ఫౌండేషన్ ద్వారా అర్హులైన ఎందరో పేద యువతీ యువకులకు సహాయ సహకారాలు అందిస్తున్న తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తను శనివారం ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ గత పాతికేళ్ళుగా నిరుపేద అమ్మాయిల వివాహాలకు మంగళ సూత్రాలు, మెట్టెలు, నూతన వస్త్రాలను, అలాగే వికలాంగులకు వీల్ చైర్స్‌ను ఉప్పల శ్రీనివాస్ గుప్త అందజేస్తున్నారని కొనియాడారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త తన ప్రతి పుట్టిన రోజున ఆర్థికంగా వెనుకబడిన ఒక మెరిట్ విద్యార్థిని గుర్తించి.. ఉన్నత చదువులకు అయ్యే ఖర్చంతా భరిస్తున్నారని, ఇప్పటి వరకూ పాతిక మంది విద్యార్థులు ఈ ఫౌండేషన్ ద్వారా లబ్ది పొందారని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన సంఖ్యా శాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ ప్రసంగిస్తూ... ఉప్పల శ్రీనివాస్ యువకుడిగా వున్నప్పుడే ఎంతో పరిణితి చెందిన సేవా మూర్తిగా నేను ఎరుగుదునని అన్నారు. ఆయన నాయకత్వ పటిమను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ ఆయనను ప్రచార కమిటీ కో కన్వీనర్ నియమించడం సంతోషదాయకం అన్నారు. అనంతరం ప్రముఖ సినీ కవి డా. వడ్డేపల్లి కృష్ణ మాట్లాడుతూ పుచ్చుకోవడం తప్ప, ఇచ్చుకోవడం తెలియని ఈ రోజుల్లో.. ఇవ్వడంలోని ఆత్మానందాన్ని ఎరిగిన వ్యక్తి శ్రీనివాస్ గుప్త అని అన్నారు. ఆయన మంచి మనస్వి.. నిరంతర సేవా తపస్వి అంటూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరీసా ఫౌండేషన్ అధ్యక్షుడు శంకర్, కాంగ్రెస్ మహిళా నాయకులు గౌరీ, పద్మ, ఉప్పల ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ గెలుపు కోసం పని చేయాలి'



నవతెలంగాణ- ఎల్బీనగర్

బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ పరిధిలోని ఈవెంట్ విల్లాలో నాగోల్, కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజన్ల వారీగా బూత్ కమిటీ సభ్యుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటు వేసి గెపించాలని కోరారు. ఎల్బీ నగర్‌లో బీఆర్ఎస్‌కు మెజార్టీ తీసుకు రావాలన్నారు. పోలింగ్ పూర్తయ్యే వరకు కార్యకర్తలు ఓటర్లకు అందుబాటులో ఉండాలని కోరారు. బూత్ సభ్యులు ఉదయం నుంచి పోలింగ్ అయ్యే వరకు పోలింగ్ బూత్ వద్ద తప్పకుండా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బుగ్గరపు దాయనంద్, సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, సాగర్ రెడ్డి, జిన్నారం విఠల్ రెడ్డి, భవాని ప్రవీణ్, డివిజన్ల అధ్యక్షులు చిరంజీవి, లింగాల రాహుల్ గౌడ్, తోట మహేష్, శ్రీశైలం యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, శైలజ, మల్లిక, నాగలక్ష్మి, విజయ గౌడ్, మహేష్ రెడ్డి, సతీశ్, ఉదయ్ గౌడ్, మల్లెపాక యాదగిరి, దీప్లాల్ పాల్గొన్నారు.

నాగోల్‌లో బీఆర్ఎస్ ర్యాలీ

నవతెలంగాణ- నాగోల్

పార్లమెంట్ ఎన్నికల ప్రచార ముగింపులో భాగంగా శనివారం నాగోల్ డివిజన్‌లో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, చెరుకు ప్రశాంత్ గౌడ్‌ల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ఆయా కాలనీలలో పర్యటించి..మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని ఆశీర్వదిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు చెప్పే కల్లబొల్లి మాటలకు మరోసారి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





బూత్ కమిటీల సమావేశంలో ఎమ్మెల్యే

నవతెలంగాణ - వనస్థలిపురం / హయత్‌నగర్

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఏం.ఈ.రెడ్డి గార్డెన్స్‌లో (మాన్సూరాబాద్, హయత్ నగర్, వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి నగర్) డివిజన్ల వారీగా బూత్ కమిటీ సభ్యుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంటు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బుగ్గరపు దాయనంద్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, సామ తిరుమల రెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, శ్రీధర్ గౌడ్, చింతల రవి కుమార్, కటికరెడ్డి అరవింద్ రెడ్డి, మల్లీశ్వరి రెడ్డి, అంజలి గౌడ్, టంగుటూరి నాగరాజు, జగదీష్ యాదవ్, జక్కిడి రఘువీర్ రెడ్డి, రాంకోటి, మల్లేష్, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలు నిరూపిస్తే
పోటీ నుంచి తప్పుకుంటా

- కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ జీ.రంజిత్ రెడ్డి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

తనపై బీజేపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ చేసిన ఆరోపణలు రుజువు చేస్తే నేను పోటీ నుండి తప్పుకుంటానని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ జీ.రంజిత్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ పారిజాత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశంలో రంజిత్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశంలో పేదరికం లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజల ఆదరణ తగిపోతుందన్నారు. బీజేపీ పార్టీ ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి తనపై వ్యక్తి గత ఆరోపణలు చేశారని, వాటిని రుజువు చేస్తే తన యావత్తు ఆస్తిని ప్రభుత్వానికి అప్పగిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఏనుముల కొండల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహా రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటీ అమరేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బంగారు బాబు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి నిజామొద్దీన్, నాయకులు ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డికి మద్దతుగా మహేశ్వరం నియోజకవర్గంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం జరిగిన కార్నర్ సమావేశానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల కొండల్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి, మేయర్ పారిజాత, ఇంచార్జి నిజాముద్దీన్, నేరెళ్ల శారద, కార్పొరేటర్లు, నాయకులు వంగేటి మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్, ఎన్ ఎస్ యు ఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు, అధ్యక్షులు ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ప్రా జోలం పౌడర్ రవాణా చేస్తున్న
ఇద్దరు అరెస్టు

నవతెలంగాణ -నాగోల్

నియంత్రిత పదార్థమైన ఆల్ప్రా జోలం పౌడర్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నియంత్రిత పదార్థమైన ఆల్ప్రాజోలం పౌడర్ ను రవాణా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు అప్రమత్తమైన నాగోల్ పోలీస్ స్టేషన్ పోలీసులు..బద్దం త్రిలోక ప్రసాద్ గౌడ్, గడ్డం వెంకట నారాయణలు ఆల్ప్రాజోలం పౌడర్‌ను తరలిస్తున్నట్టు గుర్తించారు. వెంటనే



వారిని అడ్డగించి.. వారి వద్ద ఉన్న 300 గ్రాముల ఆల్ప్రా జోలం పౌడర్‌ను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

'కాసాని గెలుపు కోసం ఇంటింటి ప్రచారం'



ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు గత 15 రోజులుగా అన్ని కాలనీలలో ప్రచారం నిర్వహించి.. ప్రతి ఓటర్‌ను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరడం జరిగిందన్నారు. ప్రచారం నిర్వహించే సమయంలో ప్రజలందరూ కేసీఆర్ పాలనే కోరుకుంటున్నారని అని చెప్పారు. మహేశ్వరం నియోజకవర్గంలో సబితా ఇంద్రారెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని, సబితా ఇంద్రా రెడ్డి బలపరిచిన కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామ్ నరసింహ గౌడ్, రామాచారి, గొడుగు శ్రీనివాస్, కొంద్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, బాలు శ్రీ, వెంకటేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు కోసం ఆర్కేపురం డివిజన్ మార్గదర్శి కాలనీలో నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంబర్తి శ్రీనివాస్ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే అన్ని కులాలకు, మతాలకు సమన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, శ్రీమన్నారాయణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాహీద్, కంచర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాసానిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం
- ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ



చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద శర్మ అన్నారు. ఆర్కేపురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా

కాసాని విజయం ఖాయం : దండు గణేష్



నవతెలంగాణ - బడంగ్‌పేట్

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం సాధించడం ఖాయమని మాజీ కౌన్సిలర్ దండు గణేష్ ముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్‌లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా శనివారం గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కాసాని జ్ఞానేశ్వర్‌ను తెలంగాణ గొంతుకగా పార్లమెంటుకు కచ్చితంగా పంపించి తీరుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రచారంలో మాజీ ఉప సర్పంచ్ పోరేడి వెంకట్ రెడ్డి, నాయకులు బొర్ర మాధవరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఖలీల్, ఎస్టీ సెల్ అధ్యక్షులు బద్రునాయక్, సీనియర్ నాయకులు బాలునాయక్, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

'సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించండి'



నవతెలంగాణ - ఎల్బీనగర్

మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ అన్నారు. సీపీఐ(ఎం), కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మధు యాష్కీ గౌడ్ పాల్గొని మాట్లాడారు. ఇండియా కూటమిని గెలిపించండి.. బీజేపీ, బీఆంఎస్ పార్టీలను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పదేండ్లలో బీజేపీ ప్రభుత్వం దళితులపై, మహిళాపై దాడులు, దౌర్జన్యాలు చేస్తూ.. కులం, మతం పేరున రాజకీయాలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక , రైతుల, వ్యవసాయ హక్కులు, చట్టాలను కాలరాస్తుందన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానన్న కేంద్ర ప్రభుత్వం ఇంత వరకూ ఇవ్వలేదని మండిపడ్డారు.

కేసీఆర్ దళితుడిని సీఎం చేస్తానని, మూడు ఎకరాల భూమి ఇస్తానని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, భూమి ఇస్తానని చెప్పి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో చేసింది ఏమీ లేదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) పార్టీ ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సరూర్ నగర్ సర్కిల్ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, సీఐటీయూ సరూర్ నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య, సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ నాయకులు పొట్టి పాక రామస్వామి, నాయకులు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - సంతోష్‌నగర్

మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి గెలుపు ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకులు గోపాల్ ముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్‌లోని మాధవ నగర్ కాలనీలో సునీతా మహేందర్ రెడ్డికి మద్దతుగా శనివారం ఇంటింటీ ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సునీతను గెలిపించుకొని సీఎం రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇవ్వాలన్నారు. ఈ ప్రచారంలో నాయకులు బత్తుల శ్రీనివాసరెడ్డి, జంగయ్య గౌడ్, నారాయణరెడ్డి, కార్తీక్ ముదిరాజ్, రఘు, అర్జున్, రంజిత్, రాహుల్, చింటూ, శరత్, దీపక్ ముదిరాజ్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి

మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాము మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్‌లో శనివారం ఇంటింటీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఎట్టి పరిస్థితుల్లోనూ నెరవేర్చి తీరుతామని అన్నారు. ఈ ఎన్నికల్లో సునీతను గెలిపించాలని కోరారు.



కాంగ్రెస్ పార్టీలో చేరికలు



నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణ పురం డివిజన్ బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ పార్టీల ముఖ్య నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్బర్, హైమద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పౌరులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి



నవతెలంగాణ- జవహర్‌నగర్

పౌరులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని జవహర్ నగర్‌లో అధిక ఓటింగ్ నమోదు అయ్యేలా కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు ఏర్పాట్లను సెక్టోరియల్ ఆఫీసర్ కేవీ. రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. ఓటు వేయడానికి వచ్చిన వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందికి సూచనలు చేశారు.

హరివర్ధన్ రెడ్డిని కలిసిన కౌన్సిలర్ కౌడే మహేష్



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ, 15వ వార్డు కౌన్సిలర్ జంగా హరికృష్ణ యాదవ్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా శనివారం జిల్లా నాయకులు గౌడవెల్లి బాల్ రెడ్డి, కౌన్సిలర్ మధుకర్, సమన్వయ కమిటీ సభ్యులు భూషణం, కృష్ణారెడ్డిలతో కలిసి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరిన వారికి హరివర్ధన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు.

మూడో విడత ర్యాండమైజేషన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సాధారణ ఎన్నికల పరిశీలకులు డాక్టర్ ఎంఎస్ ప్రియాంక శుక్లా, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ పర్యవేక్షణలో మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ మాట్లాడుతూ మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 2,425 పోలింగ్ కేంద్రాలకు మూడో మూడో విడత ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేసినట్టు తెలిపారు. ఐదు నియోజకవర్గాలకు గాను 2860 టీమ్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ఈ ర్యాండమైజేషన్ కేటాయింపు ప్రక్రియ చేపట్టినట్టు పేర్కొన్నారు. 2,425 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటికి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఓపీఓలను కేటాయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, డీఈవో విజయకుమారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు మరువలేనివి : నీలిమ



- ఆస్పత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

నవతెలంగాణ-ఘట్కేసర్

సమాజంలో నర్సుల సేవలు మరువలేనివని నీలిమ ఆస్పత్రి సీఈవో ఎస్. నీలిమ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ నీలిమ ఆస్పత్రిలో శనివారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మొదటి నర్సు నైటింగేల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోగులు ఎంతటి క్లిష్ట పరిస్థితిలో ఉన్నా నర్సులు చిరునవ్వుతో సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. సమాజంలో నర్సుల సేవలు మరువలేనివని గుర్తుచేశారు. ధనిక పేద, మంచి చేడు, చిన్నా పెద్ద అనే తేడా లేకుండా సేవలందించడమే నర్సుల గొప్పతనం అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి నర్సుల దినోత్సవ శుభాకాక్షలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎండ్ల భరత్‌రెడ్డి, నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి కాంగ్రెస్ అడ్డా : వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-శామీర్‌పేట

మల్కాజిగిరి గడ్డ కాంగ్రెస్ అడ్డా అని, కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి గెలుపు తథ్యమని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శామీర్‌పేట మండల పరిధిలోని పొన్నాల గ్రామ మాజీ ఉపసర్పంచ్ గడ్డం రమేష్ ఆధ్వర్యంలో పొన్నాల మాజీ ఎంపీటీసీ తిరుమలమ్మ కృష్ణ బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి తన అనుచరులతో వజ్రేష్ యాదవ్ సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గడ్డం రమేష్ మాట్లాడుతూ పట్నం సునీతా మహేందర్ రెడ్డి గెలుపు ఖాయమని, అత్యధిక మెజార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షులు యాష్కీ శంకర్ గౌడ్, పొన్నాల మాజీ సర్పంచ్ సుకన్య సత్యనారాయణ గౌడ్, మాజీ ఉప్ప సర్పంచ్ ఎం.రమేష్, వై. నాగేశ్వర్, నరేందర్, యూత్ అధ్యక్షుడు ఆనంద్, ప్రవీణ్, తదితరులున్నారు.

యాజమానిపై పెంపుడు కుక్క విశ్వాసం..



నవతెలంగాణ-మేడ్చల్

ఓ పెంపుడు కుక్క తన యజమాని మరణించగా అతడి అంత్యక్రియలో పాల్గొని యాజమానిపై తనకున్న ప్రేమను చాటుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ 4వ వార్డులో నివాసం ఉండే కొడతల వెంకటేష్ (45) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు.కాగా మృతుడి అంతిమయాత్ర మొదలైనప్పటి నుంచి కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు పెప్పుడు కుక్క సైతం వైకుంఠధామంలో దహన సంస్కారాలు పూర్తయ్యే వరకు అక్కడే ఉన్నది. మూడు గంటల పాటు జరిగిన అంతిమయాత్రలో కుక్క పాల్గొని యజమానిపై మమకారాన్ని చాటుకోవడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

జేఎస్ రెడ్డి, మధుసూదన్‌లకు సత్కారం



- తలంబ్రాల బుకింగ్‌లో ఉత్తమ ప్రతిభ

నవతెలంగాణ-శామీర్‌పేట

భద్రాచలం సీతారాముల కల్యాణం తలంబ్రాల బుకింగ్‌లో అత్యధిక బుకింగ్ చేసిన హకీంపేట ఆర్టీసీ డిపో ఎగ్జిక్యూటివ్ జేఎస్. రెడ్డిని శనివారం హైదరాబాద్ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుధాపరిమల సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుధా పరిమళ మాట్లాడుతూ.. టీఎస్ఆర్టీసీ ఎండీ. సజ్జనార్ ఆదేశాల మేరకు శ్రీరామనవమి రోజు భద్రాచల సీతారాముల వారి కల్యాణంలో ఉపయోగించిన ముత్యాల తలంబ్రాల బుకింగ్ కోసం, కల్యాణానికి వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ వారితో టీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఒప్పందం చేసుకున్న గ్రేటర్ హైదరాబాద్ జోన్ బుకింగ్స్‌లో హకీంపేట్ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డిప్యూటీ ఏటీఎం జె.ఎస్.రెడ్డి, డిప్యూటీ సీటీఎం మధుసూదన్‌లు అత్యధిక బుకింగ్స్ చేసి ప్రథమ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. గత రెండేండ్ల నుంచి ప్రథమ స్థానంలో నిలుస్తున్న హకీంపేట్ డిపో మేనేజర్ భవభూతిని, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, హకీంపేట్ డిపో కార్గో సిబ్బందికి, డిపో ఉద్యోగులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీలోని అన్ని రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు, అన్ని డిపోల మార్కెటింగ్‌ఎగ్జిక్యూటివ్‌లు తదితరులున్నారు.

కాంగ్రెస్ గెలుపుతో మల్కాజిగిరి అభివృద్ధి

- మహిళను చట్టసభలోకి పంపుదాం
- రాహుల్ గాంధీని ప్రధానిని చేద్దాం
- తోటకూర వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

మల్కాజిగిరి పార్లమెంటులో పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించి మల్కాజిగిరి అభివృద్ధికి తోడ్పాడాలని కాంగ్రెస్ మేడ్చల్ అసెంబ్లీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం పీర్జాదిగూడ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అధ్యక్షతన నిర్వహించిన బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. దేశంలో బలమైన నాయకుడిగా రాహుల్ గాంధీ ఉన్నారని ఆయనను ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా సైనికుల్లా పనిచేయాలన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి మహిళా నాయకురాలు పట్నం సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని, అప్పుడే మహిళ సాధికారతకు నిజమైన అర్థం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

బొంతు శ్రీదేవియాదవ్ ఆధ్వర్యంలో..

కాప్రాలో..

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శనివారం జోరుగా ప్రచారం నిర్వహించారు. కుషాయిగూడ వెంకటేశ్వర స్వామి గుడి బస్తీ, కింది బస్తీ, చాకలి బస్తీ, హనుమాన్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, అరుంధతి కాలనీ, సాయి నగర్ కాలనీ, శ్రీకృష్ణారెడ్డి నగర్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వచ్ఛమైన పాలన, స్వేచ్ఛకు ప్రాధాన్యం, సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నదని తెలిపారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీతారామ్ రెడ్డి, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుగౌడ్, కాసుల పోచయ్య గౌడ్, బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, భాను చందర్, గోపాల్, కేవీఎల్‌రావు, వెంకటేష్ గౌడ్, ముస్తాక్, క్రాంతి, ఎస్‌కే. ఖదీర్, కరీం, సుజీత్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, లింగం నాయక్, భాషా, శివ గౌడ్, బాల నర్సింహ్మా, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.



కాప్రాలో..



మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి గెలుపుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బంది లేని సంక్షేమ పాలన సాధ్యమన్నారు. శనివారం ఉప్పల్ నియోజకవర్గంలోని ఏఎస్‌రావు నగర్, జమ్మిగడ్డలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ..ప్రజలు హస్తం గుర్తుకు ఓటేసి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి, డివిజన్ కోర్డినేటర్ జలీల్ పాషా, డివిజన్ అధ్యక్షులు ప్రసాద్, పావనీరెడ్డి, రాఘవరెడ్డి, అంజి రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పాకాల రాజు, అజీజ్, అనీల్, లింగం, తదితరులున్నారు.

జవహర్‌నగర్‌లో..



జవహర్ నగర్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని పలు డివిజన్లలో కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికీ ప్రచారం చేశారు. జవహర్ నగర్‌లోని ఇంటి పర్మిషన్లు, డంపింగ్ యార్డ్ సమస్యలు, మౌలిక వసతులు కల్పించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. మల్కాజిగిరి సీటును గెలిచి సీఎం రేవంత్ రెడ్డికి కానుక ఇద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

- కేసీఆర్ పథకాలు ఆదర్శవంతమైనవి
- బీఆర్ఎస్‌పై ప్రజల్లో పెరిగిన అభిమానం
- పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి


బోడుప్పల్‌లో..

నవతెలంగాణ-బోడుప్పల్

మల్కాజిగిరి ఎంపీగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దామని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు బండారి రవీందర్‌తో కలిసి నగర పరిధిలో వివిధ డివిజన్లలో బైక్ ర్యాలీ, పాదయాత్ర నిర్వహించి ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి రాగిడిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణకు పట్టిన చీకట్లు తొలగి మళ్లీ వెలుగులు ఉదయించాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. మోసం చేసే కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉండే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కొడంగల్‌లో ఓడిన రేవంత్‌రెడ్డిని మల్కాజిగిరి ప్రజలు ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో మల్కాజిగిరి ప్రజల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయలేదన్నారు. అహంకారంతో విర్రవీగుతున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలంటే రాగిడి లక్ష్మారెడ్డిని పార్లమెంటుకు పంపాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే నిత్యవసర సరుకులు, గ్యాస్ ధరలను పెంచి సామాన్యుల బతుకులపై గుది బండగా మారిందన్నారు. మత రాజకీయాలు చేసి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం తప్పా.. ఈ రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. మే 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఏంపల్ల అనంతరెడ్డి, దొంటిరి హరిశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మహిళాఅధ్యక్షురాలు నిర్మల, మనోరంజన్ రెడ్డి, జావీద్ ఖాన్, మల్లం వెంకటేష్ గౌడ్, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాప్రాలో..



కాప్రాలో ప్రచారం చేస్తున్న పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అశోక్ నగర్, నెహ్రూనగర్, దుర్గానగర్, బాబానగర్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు.కారు గుర్తుకు ఓటేసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం : బండారి


ప్రచారం నిర్వహిస్తున్న బండారి లక్ష్మారెడ్డి

బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి డివిజన్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఓటర్లను కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గౌతమ్ నగర్‌లో బీఆర్ఎస్ శ్రేణుల ర్యాలీ

మల్కాజిగిరిలో..


ప్రచారం చేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని గౌతమ్ నగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు శనివారం ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిరి లక్ష్మారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీహారీ బస్తీ, ఇందిరా నెహ్రూ నగర్, జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్, జ్యోతి నగర్, మిర్యాలగూడ నుంచి మల్కాజిగిరి వరకు ర్యాలీ కొనసాగించారు. వేలాది మందితో నిర్వహిస్తున్న ర్యాలీకి ఆయా ప్రాంతాల ప్రజలు నీరాజనం పలికారు. కారు గుర్తుకు ఓటు వేసి మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మేకల సునీతా రాము యాదవ్ ప్రజలను కోరారు.

ఉప్పల్‌లో..


ఉప్పల్‌లో..

చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో 500 బైక్‌లతో ఏర్పాటు చేసిన ర్యాలీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం జెండా ఊపి ప్రారంభించారు. చిల్కానగర్ చౌరస్తా నుంచి ఆదర్శనగర్, ఉప్పల్ మార్కెట్, హనుమాన్ టెంపుల్, లిటిల్ ఫ్లవర్ కాలేజ్, పిస్తా హౌస్ చౌరస్తా, కళ్యాణ్ పూరి బ్యాంక్ కాలనీ, వార్డు కార్యాలయం, చిల్కానగర్ మర్రిచెట్టు, శివాలయం, బొడ్రాయి మీదుగా మళ్లీ చిల్కానగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ.. కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం బ్రహ్మాండంగా చేశారని కొనియాడారు. డివిజన్ ప్రజల ఉత్సాహం చూస్తుంటే రాగిడి గెలుపు ఖాయమని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ చిల్కానగర్ డివిజన్ నాయకులందరూ పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..


మేడ్చల్‌లో..

మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని మేడ్చల్ మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ తుడుం గణేష్ దీమా వ్యక్తం చేశారు. శనివారం వార్డు పరిధిలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా, ఎవరి నోట విన్నా.. బీఆర్ఎస్ గెలుస్తుందనే మాట వినిపిస్తుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందాయని, ఆ అభివృద్ధిని చూసి ప్రజలు కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'భూ కబ్జాదారుల ఆగడాలను అరికట్టాలి'



నవతెలంగాణ-అల్వాల్

కొందరు భూ కబ్జాదారులు తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని ఆక్రమించి రాత్రికి రాత్రే పహరీ నిర్మాణం చేపట్టారని, ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరింపులకు గురి చేస్తున్నారని ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తన భూమిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. బాధితుడు వారాల జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ అల్వాల్ సర్కిల్ పాకాల కుంటలో తన తండ్రి నుంచి తనకు సంక్రమించిన భూమిని కొందరు భూ కబ్జాదారులు ఆక్రమిస్తున్నారని, ఈ విషయమై అధికారులకు, పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అల్వాల్ మండల పరిధిలోని పాకాల కుంట, పంచశీల కాలని సమీపంలోని (అల్వాల్ హిల్స్ లో) గల సర్వే నంబర్ 566, 567, 568, 569, 570, 571,లో గల 20 ఎకరాలలో ఆక్రమణకు గురికాగా పోను 10 ఎకరాలలో ఉన్న స్థలంలో రాత్రికి రాత్రి ప్రహరీ గోడ గేటు నిర్మాణం చేపడుతున్నారని, ఇట్టి స్థలంలో ఉన్న కుంటలో మట్టి నింపేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై సంబంధిత మున్సిపల్ అధికారులకు, పోలీసు ఉన్నతాధికారులకు, ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తండ్రి నారాయణస్వామి కి ఎనిమిది మంది సంతానం ఉన్నామని, తమ తండ్రి ద్వారా సదరు భూమి తమకు వచ్చిందని, తుమ్మిదా భూమికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయని, అదేవిధంగా తమకు ప్రభుత్వ చట్టం 38 ఈ ద్వారా ఆకుపెన్సి రైట్ సర్టిఫికెట్ 2018 సంవత్సరంలోనే వచ్చిందని, అట్టి భూమి ఎవరికి రిజిస్ట్రేషన్ కానీ, బదిలీ కానీ చెల్లదని తెలిపారు. ఇట్టి భూమిపై సంబంధిత రిజిస్ట్రేషన్ కార్యాలయంలో, మున్సిపల్ కార్యాలయంలో, మండల కార్యాలయంలో, స్థానిక పోలీస్ స్టేషన్‌లో, ఏసీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందని వెల్లడించారు. ఈ భూమి కేసు కోర్టులో ఉన్నదని ఎవరూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ కబ్జాదారులు అక్రమంగా ప్రహరీ నిర్మాణాన్ని రాత్రికి రాత్రి ఏర్పాటు చేస్తూ.. భూమిలో ఉన్న నీటి కుంట ను పూర్తిగా జేసీబీ, టిప్పర్ల ద్వారా మట్టితో నింపుతున్నారని ఆందోళన చెంది మీడియా ద్వారా పేర్కొనడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి స్థలంలోకి వస్తే తమని చంపేస్తామని భూ కబ్జాదారులు బెదిరిస్తున్నారని, తమకు ప్రాణ హాని ఉందని, సంబంధిత అధికారులు, పోలీసులు తమకు రక్షణ కల్పించి, తమ భూమిని కబ్జాదారుల నుండి కాపాడాలని కోరారు.

కీసరలో .. రూ. 18.30 లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-కీసర

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.18.30 లక్షల నగదు పట్టిబడిన ఘటన కీసర పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పార్లమెంట్ ఎన్నికలు మరో రెండు రోజుల్లో ఉండటంతో పోలీసులు తనిఖీలు చేస్తుండగా సాయికుమార్, కార్తీక్ అనే ఇద్దరు వ్యక్తులు ఎలాంటి ధ్రువ పత్రాలు లేకకుండా నగదు తీసుకెళ్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని నగదు సీజ్ చేశారు.

ఓటు వేసిన వారికి బంపర్ ఆఫర్

- **పర్యావరణ ప్రేమికులు రవీందర్ ముదిరాజ్**

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారంలో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాల ని, పోలింగ్ శాతం పెంచాలని ఉద్దేశంతో తనదైన శైలిలో పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఒక వినూతన కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం 13వ తేదీన ఎన్నికలలో ఓటు వేసిన వారు చూపుడువేలు చూపించి, ఎన్నికల కార్డుతో పాటు తమ దుకాణానికి వచ్చినట్లయితే కూరగాయలు 10శాతం, జిరాక్స్ పైన 25 శాతం తక్కువ తీసుకొని వారికి అందించనున్నట్లు తెలిపారు.

సూరారంలో బీఆర్ఎస్ విస్తృత ప్రచారం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



మల్కాజిగిరి పార్లమెంట్ఎన్నికలను పురస్కరించుకొని శనివారం 129 సురారం డివిజన్ శ్రీరామ్ నగర్ లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ మాట్లాడుతు... కాంగ్రెస్ పాలనలో కరువు కష్టాలు మొదలైనాయి, కరెంటూ కోతలు, నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో డిల్లి పార్టీలను నమ్మవద్దని ప్రజా సంక్షేమం కోసం పాటుపడే బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిద్దిక్ సినియర్ నాయకులు ఫిరోజ్, చంద్రశేఖర్ రెడ్డి, సురేష్, అప్పారావ్, సుబ్బన్న, భాషీరుద్దీన్, మురళీధర్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలి

- **8500 మందితో భారీ బందోబస్తు**
- **సమస్యాత్మక ప్రాంతాలల్లో ప్రత్యేక నిఘా**
- **ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసే విధంగా ఏర్పాటు పూర్తి**
- **రాచకొండ సీపీ తరుణ్ జోషి**

నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్ సభ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రాచకొండ సీపీ తరుణ్ జోషి తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. శనివారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్‌కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ వివరాలను వెల్లడించారు. 13న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ దేశంలోనే అతిపెద్దదని, కమిషనరేట్ పరిధిలో 62లక్షల మంది జనాభా ఉండగా, అందులో 34లక్షల మంది ఓటర్లున్నారని తెలిపారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో



పట్టణ, గ్రామీణ ప్రాంతాలుంటాయని, 5 పార్లమెంట్, 13 అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయన్నారు. 3,396 పోలింగ్ స్టేషన్స్ ఉండగా, 1590 పోలింగ్ లోకేషన్స్‌లో 553 సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించినట్టు తెలిపారు. సమస్యా త్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 16 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. 4892 మంది రౌడీషీటర్లను పాత నేరస్తులను బైండోవర్ చేశామని వివరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు 8500 మందితో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. 47క్విక్ రెస్పాన్స్ టీమ్‌తోపాటు, 29ఫ్లైయింగ్ స్క్వాడ్స్, క్షేత్రస్థాయిలో సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారన్నారు. టీఎస్‌పీఏ నుంచి 1063 మంది, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నుంచి 50 మందితోపాటు టీఎస్ఎస్‌పీ, సీఏపీఎఫ్, లీగల్ మెట్రోలజీ శాఖ నుంచి అదనపు సిబ్బందిని ఉపయోగిస్తున్నామని వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీసీపీలు, ఏసీపీలు, సీసీఎస్, ఎస్ఓటీ, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ బృందాలతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశామన్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద జియోటాగ్ చేశామని, ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.11.9కోట్లు నగదుతోపాటు 12, 242 లీటర్ల మద్యం, రూ.10లక్షల విలువగల వస్తువులను సీజ్ చేసినట్టు తెలిపారు. 30 ఎన్‌డీపీఎస్ కేసులను నమోదు చేశామన్నారు. శనివారంతో ప్రచారం ఘట్టం ముగియడంతో జిల్లాకు చెందని వారు రాచకొండ పరిధిల్లో ఉండకూడదన్నారు. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటు హక్కు మన జన్మ హక్కు

- **యువత మేలుకో ఓటు విలువ తెలుసుకో**
- **ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఓటు హక్కు మన జన్మ హక్కు అని యువత మేలుకో.. ఓటు విలువ తెలుసుకో..అని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుడ ఐలయ్య గౌడ్ అన్నారు. ఈ మేరకు శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్, మగ్దూం నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో నూతనంగా ఓటు నమోదు చేసుకుని ఓటర్ లిస్ట్‌లో పేరు వచ్చిన యువతీ యువకులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి భారత పౌరులకి ఓటు వేసే ప్రాథమిక హక్కు కల్పించారన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన పాలకులు 5 సంII రాలు సేవ చేయవలసి ఉంటుందని 18 సంవత్సరాలు నిండిన ప్రతీ భారత పౌరుడికి ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఈ ఓటును కొంతమంది స్వార్థ రాజకీ



యాలకు ఉపయోగించుకొని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. యువత ఓటు విలువ తెలుసుకొని మన భవిష్యత్తును మార్చే ఓటు పవిత్రమైందని ఓటును నోటుకు అమ్ముకోకుండా ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా ఓటు వేయాలని మన భవిష్యత్ మనం మార్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ, బత్తిని నాగమణి, తిరుపతమ్మ, యువ ఓటర్లు బాల బాలికలు పాల్గొన్నారు. అనంతరం ఓటు ఎలా వేయాలని ఈవియం ప్యాడ్ ద్వారా వివరించారు. ఓటు విలువ తెలుసుకో భవిష్యత్తు మార్చుకో అని యువతకు పిలుపునిచ్చారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా



- **కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి**

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తనను ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే కాకుండా ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం చివరి రోజు కావడంతో నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్‌గా, వికారాబాద్ జెడ్పి చైర్‌పర్సన్‌గా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. మల్కాజిగిరి నుంచి ఎంపీ అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్నానని తాము ఎక్కడ ప్రచారం నిర్వహించిన ప్రజలలో మంచి స్పందన కనిపిస్తోందన్నారు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరగనున్న ఎన్నికల్లో తాము భారీ మెజారిటీతో గెలవబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. బండి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు కాంగ్రెస్ పార్టీ విజయానికి దోహదపడతాయని ప్రజలే తమకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు అభివృద్ధి సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సత్యం శ్రీరంగం, గాలి బాలాజీ , సేరి సతీష్ రెడ్డి, దినేష్, గంధం రాజు, అధ్యక్షులు, మహిళా నాయకురాళ్ల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ నేతల విస్తృత ప్రచారం..

పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ఆఖరి రోజైన శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో కాంగ్రెస్ జిందాబాద్ రాహుల్ గాంధీ జిందాబాద్ పట్నం సునీత, బండి రమేష్ జిందాబాద్ నినాదాలతో హోరెత్తింది. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీకి ముఖ్యఅతిథిగా నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్ హాజరై ప్రారంభించారు. అనంతరం తను స్వయంగా బుల్లెట్ బండి నడిపి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. మూసాపేట చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆంజనేయ నగర్ ఐడిఎల్ రోడ్ వివేక్ నగర్ తిరిగి బాలాజీ నగర్ మెయిన్ రోడ్డు వరకు కొనసాగింది వందల మంది యువకులు ద్విచక్ర వాహనాలతో ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీ స్థానికంగా పార్టీలో మంచి జోష్ నింపింది. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సేరి సతీష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కృష్ణ రాజ్ పుత్ ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి తరపున మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఎన్నికల ప్రచారం..

కుత్బుల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శనివారం చివరి రోజు కావడంతో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకులు రినేష్ రెడ్డిలతో కలిసి ప్రచారాన్ని ముమ్మరం చేసారు. శనివారం తెల్లవారు జాము నుంచే కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు కాలనీలు, బస్తీలను చుట్టుముట్టి మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి తరపున ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. జగద్గిరిగుట్ట డివిజన్‌లోని పలు బస్తీలతో పాటు, గాజుల రామారం పిపి నగర్, సుభాష్ నగర్, కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో, రంగారెడ్డి నగర్ డివిజన్‌లో, షాపూర్ నగర్ మార్కెట్‌లో ఎన్నికల ప్రచారంతో పాటు బైక్ ర్యాలీలలో శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. సునీత మహేందర్ రెడ్డికి ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. మే 13 న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి పట్ల కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ కనుమరుగవుతుందని, చివరకి మిగిలేది కేసీఆర్ కుటుంబ సభ్యులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బొడ్డు వెంకటేశ్వర్ రావ్, బొబ్బా రంగారావు, ఓరుగంటి కృష్ణ గౌడ్, గడ్డం రాజేందర్ రెడ్డి, మోతె శ్రీనివాస్ యాదవ్, ఏర్వ వెంకట్, రమేష్ మంజుల్కర్, తదితరులు పాల్గొన్నారు.



దేశ సమైక్యత సమగ్రత కాపాడడం కోసం.. ఓటు వేద్దాం



- **సీపీఐ(ఎం) మండల నాయకులు ఎం.చంద్ర శేఖర్**

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీపీఐ(ఎం) బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్‌లో ఇండియా కూటమి కాంగ్రెస్ పట్నం సునీత మహేందర్ రెడ్డిని హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. శనివారం ర్యాలీగా ఇంటింటి ప్రచారం సందర్భంగా సీపీఐ(ఎం) మండల నాయకులు ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశ సమైక్యత సమగ్రతలను కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు మే 13న తెలంగాణ రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికలు జరుగుతున్నాయి దేశ భవిష్యత్తును మరోసారి నిర్ణయించబోతున్న ఎన్నికలు. గత పదేండ్లుగా కేంద్రంలో బీజేపీ పాలనలో మాటలా... మూటలు తప్ప.. చేతలలో జరగలేదన్నారు. ప్రతీ ఏటా ఇస్తామన్న రెండు కోట్ల కొలువులు ఇవ్వలేదు కానీ ఇంటింటికి మతాల, కులాల మధ్య విద్వేషాలు మాత్రమే పోషించాడన్నారు. అభివృద్ధిలో ఇతర దేశాలు పోటీ పడుతుంటే ధరల పెరుగుదలతో పోటీపడే స్థితికి మన దేశాన్ని దిగజార్చారు. పసిపిల్లలకు పాలు లేవంటుంటే పేదలకు మింగ మెతుకు లు లేవంటుంటే 20 ఏండ్లలో ప్రపంచంలో మనమే నెంబర్ వన్ కాబోతున్నామ ని ఖాశీ మజిలీ కథలు బీజేపీ ప్రభుత్వం చెబుతున్నది. మన దేశంలో బుక్కెడు బువ్వలేక 10 కోట్ల మంది అల్లాడుతున్నారని నివేదికలు చెబుతున్నాయన్నారు. మోడీ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎం.శంకర్, స్థానిక నాయకులు, ప్రవీణ్ యాదగిరి, రాజశేఖర్ మాణిక్యం, కాంగ్రెస్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి భారీ మెజారిటీతో చరిత్ర సృష్టిస్తారు

- **కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మైనారిటీ నాయకులు మొహమ్మద్ హాఫీజ్**



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి భారీ మెజారిటీతో చరిత్ర సృష్టించ బోతున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మైనారిటీ నాయకులు మహమ్మద్ హాఫీజ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని చెన్నారెడ్డి నగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 9 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో గడిచిన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించిందని తెలిపారు.నేడు నాలుగు నెలల పాలనలో అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు ప్రవేశపెట్టి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం గడుపుకుంటుందని ఆరోపించారు. ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్, లేదన్నారు. మతతత్వ రాజకీయాలతో బీజేపీ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని వారి మాయమాటలు నమ్మొద్దని హితువు పలికారు. స్థానిక ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సారథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సాధించడం ఖాయమని చెప్పారు. మల్కాజిగిరి కోటపై గులాబీ జెండా ఎగరేస్తామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహుమానం అందజేస్తామని స్పష్టం చేశారు.

రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకుందాం..



- **బీఆర్ఎస్ శ్రేణులు**

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకుందాం అని బీఆర్ఎస్ శ్రేణులు అన్నారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, అధ్యక్షులు, మహిళా నాయకురాలు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను కలుస్తూ ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేండ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కే.పి.వివేకానంద్ కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేశారనున్నారు. మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే ఎంపీ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తే.. నియోజకవర్గ సమస్యలను పార్లమెంట్లో చర్చించి అత్యధిక నిధులతో సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కాబట్టి ఈ 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

ఎంపీ నిధులు రావాలంటే ఎంపీ గా బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలి

కేపీహెచ్‌బీ : ఎంపీ నిధులు రావాలంటే ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని శనివారం కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో స్థానిక కార్పొరేటర్లు నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయనతో పాటు ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను 70 వేలకు పైగా మెజారిటీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు బిఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 13న అందరూ పోలింగ్ బూత్‌కు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనీ కోరారు.



అవసరమైన వారికి 5 బేబీ బహుమతులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొత్త తల్లి లేదా కాబోయే తల్లికి సంబంధించి బేబీ ఎసెన్షియల్ బహుమతుల కోసం పరిపూర్ణ మార్గదర్శి ఉంది. పారాచూట్ అడ్వాన్స్‌డ్ బేబీ మసాజ్ ఆయిల్ 100శాతం సహజమైన వర్జిన్ కోకోనట్ ఆయిల్. ఇందులో విటమిన్లు ఈ, ఎఫ్ ఉంటాయి. తల్లి పాలలో కూడా ఉండే కొన్ని వద్ధి పోషకాలు ఈ విటమిన్లలో ఉంటాయి. ఇది నవజాత శిశువులకు సురక్షితమని డాక్టర్ సర్టిఫికెట్ పొందడమే కాకుండా, 3 విధాలుగా శిశువుల మెరుగైన ఎదుగుదలకు సహాయపడుతుందని సాంకేతికంగా నిరూపించబడింది. బరువు పెరగడం, ఎత్తు పెరగడం, బలమైన ఎముకలను ప్రోత్సహించడం ద్వారా శిశువు చర్మాన్ని లోపలి నుంచి లోతుగా పోషణనిస్తుంది.

సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించండి



- **సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్**

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

లోక్ ఎన్నికలలో మల్కాజ్గిరి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా ఇండియా కూటమి బలపరిచిన సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శనివారం చివరి రోజు కావడంతో సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బీజేపీని ఓడించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీమతి సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని తెల్లవారుజామునుండే షాపూర్ నగర్, సంజయ్ గాంధీ నగర్, న్యూ షాపూర్ నగర్ కళావతి నగర్‌లలో ఇంటింటి కరపత్రాలను పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి నియోజకవర్గ కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ...దేశంలో మతోన్మాద, కార్పొరేట్ విధానాలతో దేశ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న భాజాపాను ఓడించాలన్నారు. భాజపా 10 ఏండ్ల పాలనలో దేశానికి ఒరిగిందేమీ లేదన్నారు. దేశ ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతూ కార్పొరేట్ శక్తులకు ప్రజల సొమ్మును దోచిపెడుతుందని, ఎలక్టోరల్ బాండ్ల పేరుతో అవినీతికి పాల్పడుతుందని ఆరోపించారు. దేశంలో 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్న కేంద్రం భర్తీ చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని, 90 శాతం నిరుద్యోగం పెరిగిందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తున్న ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలపై ఉక్కు పాదం మోపుతుందన్నారు. ఈడీ, సీబీఐ, ఈసీ, ఐటీ లాంటి చట్టబద్ధ సంస్థలను భాజపా తన రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు దుర్వినియోగపరుస్తుందని, అలాంటి భాజాపాకు ఎన్నికలలో బుద్ధి చెప్పాలని కీలుకాని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, వెంకన్న, ఆర్.స్వాతి, కె.శీను, కరుణాకర్, కనకయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించాలి: సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా నాయకులు కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్...

కేపీహెచ్‌బీ : పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా నాయకులు కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్ అన్నారు. మల్కాజిగిరి ఎన్నికల నేపథ్యంలో శనివారం ఇండియా కూటమిలోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కూకట్‌పల్లి మండలం లోని మూసాపేట్ రాఘవేంద్ర కాలనీలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల నాయకులు కే కృష్ణ నాయక్, ఎం.చంద్రశేఖర్, బాలు, ఎం.నరసింహ పెంచలమ్మ పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వచ్చిన ఈ పది సంవత్సరాలలో ధనవంతులు మరింత ధనవంతులయ్యారని పేదలు మరింత పేదరికంలో కూరుకుపోయారన్నారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశనంటాయని పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెరిగాయని యువతకు ఉద్యోగ అవకాశాలు లేవని ముస్లిం మైనార్టీలపై దళితులపై గిరిజనులపై మహిళలపై హత్యలు అత్యాచారాలు పెరిగాయని అన్నారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కూడా రద్దు చేస్తారని రిజర్వేషన్లు ఉండవని మతోన్మాదం పచ్చరియల్తోందని అన్నారు. లౌకికతత్వ ఇండియా కుటమిలోని కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీనివాస్, కృష్ణ, ఉషమ్మ మాధవి, శాంతమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమానికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు



- **టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం గాజుల రామారం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు సద్దాం ఆధ్వర్యంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు వారికి కండువాలు వేసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పథంలో రాష్ట్రం ముందుకు దూసుకెళుతుందని ప్రజలు కాంగ్రెస్ పాలన పట్ల పూర్తి విశ్వసనీయతతో ఉన్నారని తెలిపారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని చేయి గుర్తుపై ఓటు వేసి గెలిపించడం మనందరి బాధ్యతాన్ని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి, సొంటిరెడ్డి పున్నారెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మరింత బలోపేతం కానుందని చేరిన వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పక్క రాష్ట్రాలకు తరలుతున్న పరిశ్రమలతో రాష్ట్రం కకావికలం

- **ఎమ్మెల్యే కే.పి.వివేకానంద్**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గత ప్రభుత్వ హయంలో పరిశ్రమలకు స్వర్గధామంగా తెలంగాణ రాష్ట్రం ఉండేదని నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరళడంతో ప్రజలు కాక వికలమవుతున్నారని ఎమ్మెల్యే కే.పి.వివేకానంద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం రోడ్డు షో స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేండ్ల కాలంలోనే బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తోలి ముఖ్య మంత్రి కేసీఆర్ టీఎస్ - ఐపాస్ సింగల్ విండో విధానంతో నూతన పరిశ్రమలతో రాష్ట్రాన్ని పెట్టుబడుల కు కేరాఫ్ అడ్రస్ గా మారిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వ అనుభవ రాహిత్యం, అవగాహనలేమితో పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలి వెళ్తున్నాయన్నాయని దీనితో మళ్ళీ నిరుద్యోగులు వలస వెళ్లాల్సిన పరిస్థితి తయారైందన్నారు. మన పిల్లల భవిష్యత్తును



అంధకారంలోకి నెట్టేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు మళ్ళీ ఓటు వేసి గెలిపిద్దామా...? లేక ఇప్పటికే ఎంతో మందికి ఉపాధి కల్పించిన మన అభ్యర్థి రాగిడి లక్ష్మారెడిని గెలిపించుకుందామా..?అనేది ప్రజలే నిర్ణయించుకొవాలని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించుకుందా మన్నారు.శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మెన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

ఆదివారం | మే 12, 2024 | www.navatelangana.com

నగరంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు

నవతెలంగాణ-బంజారాహిల్స్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నగరంలో శనివారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు వెస్ట్ జోన్ డీసీపీ విజయ్ కుమార్, బంజారాహిల్స్,పంజాగుట్ట, ఏసీపీలు వెంకట్రాంరెడ్డి, మోహన్ కుమార్‌లు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ అబ్కారీ శాఖ సహితం మద్యం అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టిందని, ఏమరపాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నలుగురు కంటే ఎక్కువ తిరగడాలు చేయవద్దని, గుమిగూడి మాట్లాడుకోవడం చేయడం ఎన్నికల కోడ్ ఉల్లంఘనలోకి వస్తుందని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ప్రభుత్వానికి సిబ్బందికి సహకరించాలని కోరారు. ఇక ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రం వద్ద ఆంక్షలు అమల్లో ఉంటాయి. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పోలింగ్ కేంద్రం పరిధిలో ఎవరూ గుమిగూడవద్దని పోలీసులు స్పష్టం చేశారు.

'కాంగ్రెస్‌కు నూర్ భాషా దూదేకుల సంపూర్ణ మద్దతు'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ నూర్ భాషా దూదేకుల కులస్తుల సంపూర్ణ మద్దతు ఉంటుందని రాష్ట్ర బీసీ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి.మొయినుద్దీన్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నూర్ భాషా దూదేకుల కులస్తులు కాంగ్రెస్ పార్టీకి, సీఎం ఎ.రేవంత్ రెడ్డికి మద్దతిచ్చి వారిని గెలిపించుకున్నామని గుర్తు చేశారు. అదే విధంగా మరోసారి ఈ లోక్ సభ ఎన్నికల్లో 17 పార్లమెంట్ స్థానాల్లోని కాంగ్రెస్ అభ్యర్థులకు అండగా నిలబడి వారిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలనే ఉద్దేశ ంతోనే తమ ముస్లిం నూర్ భాషా దూదేకుల కులస్తులందరూ కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం జరుగుతుం దన్నారు.నూర్ భాషా దూదేకుల ప్రత్యేక కార్పొరేషన్, మైనార్టీ కమిషన్, వక్ఫ్ బోర్డ్ లలో తమకు రాజకీయ పదవులు, స్థానం కల్పించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



డిప్యూటీ మేయర్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

నవతెలంగాణ-ఓయూ

జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శనివారం తార్నాక డివిజన్‌లోని ఇసుక బావి నుండి తార్నాక చౌరస్తా మీదుగా మాణికేశ్వర్ నగర్ వరకు, అలాగే మెట్టు గూడ నుండి సికింద్రాబాద్ లోని శ్రీ గణపతి దేవస్థానం చేరుకొని జెబీఎస్ పరేడ్ గ్రౌండ్ వరకు దాదాపు 500 బైక్ లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ తో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొని హస్తం గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నినాదాలు చేస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేత మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు.



బోరబండ డివిజన్‌లో సీపీఐ(ఎం) నాయకుల ప్రచారం

నవతెలంగాణ - జూబ్లీహిల్స్

ఇండియా కూటమిలో భాగమైన కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ బోరబండ డివిజన్‌లో సీపీఐ(ఎం) నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీకి వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలు, పుస్తకాలను ప్రజలకు పంచారు. అలాగే స్థానిక బోరబండ కార్పొరేటర్ బాబా ఫసి యుద్దీన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన సీపీఐ(ఎం) నాయకులను కార్పొరేటర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టి.సాయి శేషగిరిరావు, జె. స్వామి, నయీం పటేల్, చింతల శీను, సికిందర్ ,యాదగిరి పాల్గొన్నారు.

బీజేపీకి మాలలు ఓటుతో బుద్ధి చెప్పాలి

- ఓయూ ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు నామ సైదుల



నవతెలంగాణ-ఓయూ

బీజేపీకి మాలలు ఓటుతో బుద్ధి చెప్పాలని ఓయూ ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు నామ సైదులు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ మాలల వ్యతిరేకి కిషన్ రెడ్డి ఓట్ల కోసం ఇంకెన్నాళ్ల తమలో తమకు చిచ్చు పెడతారని ప్రశ్నించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని తెలిపారు. ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్లు కాపాడు కోవాలంటే బీజేపీ ఓటు వేయొద్దు అని సూచించారు. మాల మాదిగల మధ్య చిచ్చు పెట్టి స్వార్థ రాజకీయాలు చేసే కిషన్ రెడ్డిని చిత్తుగా ఓడిస్తామని చెప్పా రు. విభజన హామీలో భాగంగా రాష్ట్రానికి రావాల్సిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ బీజేపీ ఇవ్వలేదని గుర్తు చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు, మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వలేదన్నారు. తక్షణమే కేంద్రం మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ప్రజలకు దీనిపై సమాధానం చెప్పాలని కోరారు. లేకపోతే రాష్ట్రంలో బీజేపీ నాయకులకు ఓటు అడిగి హక్కే లేదన్నారు. బీజేపీ ఓటమి మాలల పంతం అని అన్నారు.



సుక్క గణేష్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ

నవతెలంగాణ-ఓయూ

బీజేపీ సీనియర్ నాయకుడు ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని పలు పేదల బస్తీల్లో నిరుపేదలకు, అడ్డా కూలీలకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఈ వేసవికాలంలో గతంలో ఎన్నడ లేనంతగా ఎండలు విపరీతంగా ఉన్నాయని తెలిపారు. దానికోసం నిరుపేదలకు గొడుగులు అందజేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. సికింద్రాబాద్ ఓటర్లు ఆలోచించి రానున్న ఎన్నికల్లో మరొకసారి కిషన్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు సుమారు 400 మందికి నిరుపేదలకు గొడుగులు ఉచితంగా అందజేశారు.



కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి'

- రాష్ట్ర అడ్వకేట్ జేఏసీ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జేఏసీ కోరింది. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలసాని సురేష్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవక ముందే ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్, బీజేపీలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పుడిప్పుడే రాష్ట్ర ప్రజలకు స్వేచ్ఛ దొరికిందని, ప్రజా పాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాల కుట్రలు సరైనవి కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను అత్యధిక సంఖ్యలో గెలిపించుకొని, కేంద్రంలో కాంగ్రెస్ ఇండియా కూటమి అధికారంలోకి తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా ఉండదన్నారు.ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ బత్తుల కృష్ణ, వెంకటేష్ ఇంద్రపల్లి, నాయకులు ఏబి.వేద్ ప్రకాష్, సంతోష్, రాజేష్, శ్యాంసుందర్, వెంకట్రామిరెడ్డి, శ్రీకాంత్ యాదవ్, రామారావు, విజయ కుమారి, లక్ష్మీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది 3వ విడత ర్యాండమైజేషన్ పూర్తి

- పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ టీమ్‌ల కేటాయింపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శనివారం పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో పూర్తి చేశారు. శనివారం జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ నేతృత్వంలో ఆయన ఛాంబర్‌లో ఎన్నికల సంఘం నిబంధనలు అనుసరిస్తూ హైదరాబాద్, సికింద్రాబాద్ సాధారణ పరిశీలకులు పీ.ఐ శ్రీవిద్య, డాక్టర్ సరోజ్ కుమార్‌ల సమక్షంలో ర్యాండమైజేషన్‌ను నిర్వహించారు. జిల్లా లోని హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే పలు విడతలుగా మాస్టర్ ట్రైనర్స్‌చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించినట్టు డీ.ఈ.ఓ పరిశీలకులకు తెలిపారు. జిల్లాలోని 15 అసెంబ్లీ సెగ్మెంట్‌ల పరిధిలో మొత్తం 3986 పోలింగ్ కేంద్రాలకు టీంలను కేటాయించారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ అదనపు కలెక్టర్ సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, సీఈవో మధుకర్ నాయక్, మ్యాన్ పవర్ నోడల్ అధికారి ఉపేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దానం గెలుపు కోసం అదం బైక్ ర్యాలీ



నవతెలంగాణ-ఓయూ

పార్లమెంట్ ఎన్నికల ముగింపు చివరి రోజు అయిన శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అదం సంతోష్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఐదు డివిజన్‌ల వ్యాప్తంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం అదం సంతోష్ మాట్లాడుతూ సికింద్రాబాద్ లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలవబోతున్నట్టు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న 6 గ్యారంటీలతోపాటు తమ నేతలు కార్యకర్తలు కృషి ఫలితంగానే విజయం వరిస్తుందని సంతోష్ అన్నారు. ఈ బైక్ ర్యాలీలో ఐదు డివిజన్‌ల కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సానుభూతిపరులు పాల్గొన్నారు..

పద్మారావు గౌడ్ గెలుపు ఖాయం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావు గౌడ్ గెలుపు ఖాయమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పద్మారావు గౌడ్ కు మద్దతుగా సుమారు 4 వేల బైక్‌లతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వెస్ట్ మారేడ్ పల్లి లోని షెనై గ్రౌండ్ వద్ద పద్మారావు గౌడ్,తలసాని శ్రీనివాస్ యాదవ్ లు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. బైక్ ర్యాలీ సంగీత్, చిలకలగూడ, పద్మారావు నగర్, ముషీరాబాద్, భోలక్ పూర్, ఇద్ కాలనీ, బోయి గూడ, బన్సీలాల్ పేట, మోండా మార్కెట్, మహంకాళి టెంపుల్ లైన్, సింది కాలనీ, పాటిగడ్డ, ఓల్డ్ కష్టమ్, సనత్ నగర్, జెక్ కాలనీ, ఉదయ్ నగర్, 60 ఫీట్ రోడ్, బల్కంపేట, డీకే రోడ్డు, కనకదుర్గమ్మ టెంపుల్, గురుద్వార్ మీదుగా సత్యం థియేటర్ వరకు సాగింది. దారిపొడవునా ప్రజలకు అభివాదం చేశారు. పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్ లకు శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు కుర్మ హేమలత, కొలన్ లక్ష్మీ టి. మహేశ్వరి, సనత్ నగర్, పార్టీ సికింద్రాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి లు వెంకట్ రెడ్డి, మేడే రాజీవ్ సాగర్, డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, కొలన్ బాల్ రెడ్డి, గుర్రం పవన్ కుమార్ గౌడ్, హన్మంతరావు, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, నాయకులు అశోక్ యాదవ్, శ్రీహరి, ఏసూరి మహేష్, నాగులు, కరుణాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, ఖలీల్, శ్రీకాంత్ రెడ్డి, ప్రేమ్ కుమార్, లక్ష్మీపతి, శేఖర్, సురేష్ గౌడ్, ఆరీఫ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని బీఆర్ఎస్.. దేశాన్ని బీజేపీ దోచుకున్నాయి

- టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రాన్ని బీఆర్ఎస్.. దేశాన్ని బీజేపీ ఆర్థికంగా దోచుకున్నాయని, అవి సంపన్న పార్టీలు అని టీపీసీసీ అధికార ప్రతినిధి చెనగని దయాకర్ అన్నారు.ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా వ్యతిరేక పార్టీలు బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌తోనే రాజ్యాంగానికి రక్షణ ఉంటుందని అన్నారు. విద్యార్థులు నిరుద్యోగులు, విద్యావంతులు ఆలోచించాలని కోరారు.బీజేపీ సీట్లు పెరగడం కోసం కేసీఆర్ యాత్రలు చేస్తున్నారని ఆరోపించారు. రామమందిర్‌ను 10 ఏండ్ల అభివృద్ధిగా బీజేపీ చూపిస్తోందని ఎద్దేవా చేశారు. బీజేపీ వస్తే దేశానికి ప్రమాదం అని నిర్మలా సీతారామన్ భర్త పరకాల ప్రభాకర్ చెప్పాడని తెలిపారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఏమి అభివద్ధి చేశాడో, తెలంగాణ కు ఎన్ని నిధులు తెచ్చాడో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ లో ఐఐటీ వచ్చిందని, బీజేపీ హయాంలో ఏమి వచ్చిందని నిలదీశారు. ఇచ్చిన గిరిజన యూనివర్సిటీకి నిధులు ఇవ్వలేదన్నారు. మతం పేరిట రాజకీయాలు చేసే బీజేపీకి తెలంగాణలో సీట్లు రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీని ఎదగకుండా చేయాలని బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీకే మాలల మద్దతు

- మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మెన్ జి. చెన్నయ్య



నవతెలంగాణ-బంజారాహిల్స్

దళితుల అభ్యున్నతికి, సాధికారత కోసం గతంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో కృషి చేసిందని ప్రస్తుతం రాష్ట్రంతో పాటు దేశంలో అధికారంలో ఉంటే దళిత బలహీన వర్గాలకు మరింత మేలు జరిగే అవకాశం ఉన్నదని అందుకే కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మెన్ జి.చెన్నయ్య తెలిపారు. శనివారం బంజారాహిల్స్‌లోని జాతీయ కార్యాలయంలో మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మెన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్ లతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేయడంతో పాటు,రిజర్వేషన్లను పెంచి అణగారిన వర్గాలకు మేలు చేస్తుందని తెలిపారు. అందుకే రాష్ట్రంలోనీ అన్ని పార్లమెంట్ నియోజకవర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు విస్తృత ప్రచారం నిర్వహించామని, మాలలంతా జాతి భవిష్యత్తు కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. బీజేపీ కేవలం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ వారికి దేశ సంపదను దోచిపెడుతున్నదని, దేశంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చివేసి ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు తొలగించే ప్రమాదం ఉందన్నారు. అంబేద్కర్ వాదులను అణిచివేయడానికి తెలంగాణలో కంటోన్మెంట్ అసెంబ్లీతో సహా మూడు పార్లమెంటు రిజర్వ్ స్థానాలలో బీజేపీ ఒక్కటీ మాలలకు కేటాయించలేదని పేర్కొన్నారు. దళితులను కేసీఆర్ వంచించారని, ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని, సబ్ ప్లాన్ నిధులను దారి మళ్ళించారని ఆరోపించారు. దళిత బహుజనులు అభివద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని అభివద్ధి నిరోధకులైన బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు బంగి ఆనంద్,బురుగు రమేష్ ,రాజు, జి.రమేష్ ,వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ది ఎపిక్ న్యూ స్విఫ్ట్ కారు ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

శేరిలింగంపల్లిలోని పవన్ మోటార్స్ షోరూమ్‌లో మారుతి సరికొత్త స్విఫ్ట్ కారును సినీనటి సోనియా సింగ్, మారుతి సుజుకి రీజినల్ మేనేజర్ బిక్రమ్ సటాపతి, పవన్ మోటార్స్ ఎండీ.చంద్ర పవన్ రెడ్డితో కలిసి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా సినీనటి సోనియాసింగ్ మీడియాతో మాట్లాడుతూ మారుతి కార్లు బెస్ట్ మేంటేనెన్స్ ఫ్రీ కార్లని, ఎక్కువ మైలేజ్‌ను కూడా ఇస్తాయని, తనకు మారుతీ కార్లంటే ఇష్టమని తెలిపారు. పవన్ మోటార్స్ మ్యానేజింగ్ డైరెక్టర్ చంద్రపవన్ మాట్లాడుతూ ఇక్కడ శేరిలింగంపల్లిలోని తమ పవన్ మోటార్స్ షోరూమ్‌లో ఈ కొత్త స్విఫ్ట్‌ని మార్కెట్‌లోకి విడుదల చేయడం సంతోషంగా ఉందని, కొత్త స్విఫ్ట్ ఇప్పుడు మరింత సేఫ్టీతో వచ్చిందని, ఇందులో 6 ఎయిర్‌బ్యాగ్స్ స్టాండర్డ్‌గా అందిస్తున్నారని, మైలేజ్‌లో కూడా దిబెస్ట్ అని, మానువల్ ట్రాన్స్‌మిషన్‌లో 24.8 కెఎంపీఎల్, ఏటీఎంలో ఏకంగా 25.75 కెఎంపీఎల్ మైలేజ్ దొరుకుతుందని తెలిపారు. ఇంకా ఇందులో హిల్ హోల్డ్ అసిస్ట్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రాం, రివర్స్ కెమెరా పార్కింగ్, ఏబీఎస్ విత్ ఈబీడీ లాంటి ఎడ్వాన్స్ ఫీచర్స్‌నిచ్చారు. 6 సింగిల్ టోన్, 3 డ్యుయల్ టోన్ కలర్స్‌లతో.. మెత్తం 9 వారియంట్స్‌లలో ఇది అందుబాటులో ఉంది. పెట్రోల్‌లో మాత్రమే అందుబాటులో ఉండే కొత్త స్విఫ్ట్‌లో 1197 సీసీ ఇచ్చారు. దీని ప్రారంభ ఎక్స్‌షోరూమ్ ధర రూ.6,49,000గా ఉంది. ఈ కార్యక్రమంలో పవన్ మోటార్స్ బిజినెస్ హెడ్ రవి రెడ్డి, షోరూం సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.


ఓటు హక్కుపై ప్లకార్డులతో అవగాహన



నవతెలంగాణ-బేగంపేట్

ఓటు అనేది మన హక్కు అని,ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షులు మనీష్ కుమార్ అగర్వాల్ కోరారు. శనివారం సికింద్రాబాద్‌లోని అగర్వాల్ సమాజ్ కార్యాలయంలో సమాజ్ ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మనీష్ కుమార్ అగర్వాల్, మీడియా కమిటీ చైర్మెన్ అజయ్ అగర్వాల్‌లు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుంటే సరైన నాయకుడిని, ప్రభుత్వాలను ఎన్నుకోగలుగుతారన్నారు. ఓటును వినియోగించుకోవాలని ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవేళ్ల పార్లమెంట్ పరిధిలోని ప్రధాన కూడళ్ల సిగ్నల్ ప్రాంతాల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ, స్టిక్కర్లను అంటిస్తూ అవగాహన తీసుకుని వస్తున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పురుషోత్తం అగర్వాల్, అంజన్కుమార్, నవీన్కుమార్, కపుల్ చందు, కాంచన, వికాష్, బిక్కి తదితరులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



- ప్రముఖ వైద్య నిపుణులు
- రేడియాలజీపై అవగాహన సదస్సు

నవతెలంగాణ - బంజారా హిల్స్

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ప్రముఖ వైద్య నిపుణులు అన్నారు. తెలంగాణా చాప్టర్ ఆఫ్ ఇండియన్ రేడియాలజికల్ & ఇమేజింగ్ అసోసియేషన్, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ వారు సంయుక్తంగా రెండు రోజుల పాటూ రేడియాలజీలో కీలక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. బీఐఏసీహెచ్ ఆడిటోరియలో శనివారం ప్రారంభమైన మొదటి రోజు సదస్సు జరిగింది. డా. గ్యాన్ పి లాల్ సదస్సును బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చి ఇన్స్టిట్యూట్ కు చెందిన ఆడిటోరియంలో నిర్వహించిన ఈ సదస్సును ఇండియన్ రేడియాలజికల్ & ఇమేజింగ్ అసోసియేషన్ వారి ఆర్థిక సహాయంతో ఇండియన్ కాలేజి ఆఫ్ రేడియాలజీ & ఇమేజింగ్ వారు నిర్వహిస్తున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమం సాంప్రదాయ పద్ధతిలో జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది.

ముఖ్య అతిథులుగా ఇండియన్ కాలేజీ ఆఫ్ రేడియాలజీ & ఇమేజింగ్ చైర్మెన్ డా.ఎ అంబరసు, ఇండియన్ రేడియాలజికల్ & ఇమేజింగ్ అసోసియేషన్ సెక్రటరీ డా.యల్ మురళీకృష్ణ హాజరుకాగా మున్సిపల్ క్యాన్సర్ ఆస్పత్రి సీఈఓ డా.కె కృష్ణయ్య అధ్యక్షత వహించారు. ముందుగా అతిథులను ఉద్దేశించి సీఈవో కృష్ణయ్య మాట్లాడారు. వ్యాధి నిర్ధారణలో రేడియాలజీ పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న తీరు వైద్యులకు సవాలుగా మారుతోందన్నారు. ఆధునిక విజ్ఞానాన్ని ఎప్పటికపుడు తెలుసుకుంటూ రోగులకు మంచి సేవలు అందించాలని సూచించారు. అలానే తమ తమ అనుభవాలను ఇతరులతో ఆర్టికల్స్‌ను పబ్లిష్ చేయడం ద్వారానే కాకుండా ఇలాంటి సదస్సుల ద్వారా పంచుకో వాలంటూ హాస్పిటల్ పరిశోధనా విభాగం ఈ దిశగా ఎంతో కృషి చేస్తుందని వివరించారు. డా.యల్ మురళీకృష్ణ మాట్లాడుతూ... సంస్థ ఏటా వైద్యుల కోసం నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను వివరించారు. సంస్థ సభ్యులుగా ఉన్న వైద్యులకు ఎన్నో సదుపాయాలు కలిపిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా మహిళా వైద్యులకు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తద్వారా వైద్యులు ఎప్పటికపుడు కొత్త పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి దోహదపడుతోందని వివరించారు.

అనంతరం డాక్టర్ ఎ,అంబరసు మాట్లాడుతూ... దేశంలో రేడియాలజీ విభాగానికి చెందిన అంశాలపై అవగాహన, ఆధునిక పరిజ్ఞానాన్ని ఎప్పటికపుడు వైద్యులకు అందించడానికి తీవ్రంగా కృషి చేస్తోందని వివరించారు. ఇలాంటి సదస్సులు మరిన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. అంతకు ముందు హెచ్ ఓ డి,రేడియాలజీ విభాగం, డా కె వీరయ్య కార్యక్రమానికి హాజరైన వారికి స్వాగతం పలికారు. మొదటి రోజు రేడియాలజికి చెందిన పలు సాంకేతిక అంశాలపై నిపుణులైన వైద్యులు ప్రసంగించారు. వైద్య విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు హాజరైన వైద్యులు సమాధానమిచ్చారు. ఇండియన్ రేడియాలజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ సెక్రటరీ డా,అమిత్ దిసావల్, అసోసియేషన్ తెలంగాణ చాప్టర్ అధ్యక్షులు డా.టి రమేష్, సెక్రటరీ డా. పి కృష్ణ మోహన్‌లతో పాటూ అసోసియేషన్‌కు చెందిన ఆఫీర్ బేరర్లు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

'లిటిల్ ఫ్లవర్'లో ఘనంగా వీడ్కోలు పార్టీ





- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నవతెలంగాణ-ఓయూ

డా. ఎ.ఎస్.రావు నగర్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు డిగ్రీ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశ వేడుకలను యర్ర లలితా గార్డెన్స్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో డిగ్రీ జూనియర్, సీనియర్ విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపల్ కె.జ్యోతి సదానంద , వైస్ ప్రిన్సిపల్ రవీందర్‌రెడ్డి , అధ్యాపకులు, కళాశాల కార్యనిర్వాక సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె.జ్యోతి సదానంద మాట్లాడుతూ. విద్యార్థులంతా బాధ్యతాయు తంగా ఉన్నత ఆశయలతో ఆదర్శవంతమైన పౌరులుగా ఎదగాలని, దేశసేవలో తరించాలని కోరారు. వేడుకలలో జూని యర్ విద్యార్థులు సాంప్రదాయ, పాశ్చాత్య నృత్యరీతులతో, ఆట పాటలతో అలరించారు. విద్యాసం వత్సరంలో ఉన్నతంగా రాణించిన సాయి స్వరూప్(బి.బి.ఎ) బి.యష్ కుమార్ (బి.కామ్) , కె. బబిత (బి.యస్.సి) , సీనియర్ విద్యార్థులకు కళాశాల యాజమాన్యం బహుమ తులను ప్రదానం చేసింది. వీడ్కోలు సమావేశాన్ని అత్యంత శ్రద్ధాసక్తులతో నిర్వహించి , ఆహ్లాదాన్ని అందించిన జూని యర్ విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, కార్యనిర్వాహక సిబ్బంది పలువురు అభినందించారు.

'వైద్యశాలలో నర్సింగ్ ఆఫీసర్ల సేవలు కీలకం'

నవతెలంగాణ-సిటీబ్యూరో

నిలోఫర్ ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కోవిడ్ సమయంలో మన వైద్యశాలలో నర్సింగ్ ఆఫీసర్లు చాలా బాగా పనిచేశారని కొనియాడారు పేషంట్స్ డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళ్తుంటే వాళ్ళు ధన్యవాదాలు తెలుపుతుంటే చాలా సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. నర్సింగ్ ఆఫీసర్ల సేవలు లేకుండా వైద్యశాలలు ముందుకు సాగవు అన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను ఆమె కొనియాడారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వప్న మాట్లాడుతూ నేటి చిన్న పిల్లలే రేపటి పౌరులు అని.. వాళ్ళను సంరక్షించలవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. నర్సింగ్ ఆఫీసర్స్ సేవలు లేకుండా చిన్న పిల్లలకు వైద్యం అందించలేమని చెప్పారు. ఒక కుటుంబం లాగా మనం అందరం పని చేయాలి అని ఆమె పిలుపునిచ్చారు చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ ఇందిరా మాట్లాడుతూ నిలోఫర్ వైద్యశాల అనగానే చిన్నపిల్లలుల గుర్తుకు తెచ్చుకునేలాగా తమ నర్సింగ్ ఆఫీసర్లు పనిచేస్తున్నారని కొనియాడారు. ఆటల పోటీలలో గెలుపొందిన నర్సింగ్ ఆఫీసర్లకు బహుమతులు అందజేశారు సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు స్వరూప , నిరంజని అధ్యక్ష వహించారు.

జాన్సన్ గ్రామర్ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత



నవతెలంగాణ-హయత్ నగర్

పదో తరగతి ఫలితాలలో జాన్సన్ గ్రామర్ స్కూల్ ఐసీఎస్ఈ కుంట్లూర్ 100 శాతం ఉత్తీర్ణత సాధించింది. 99 శాతం మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించింది. 17 మంది విద్యార్థులు 95 శాతం పైగా మార్కులు సాధించారు. అందులో మొదటి ఐదు స్థానాలలో శ్రీ రాఘవేంద్ర అభినయ్ (99 శాతం) ,సుంకరం మధుహాసిత (98 శాతం), కందుల గీతిక లాస్య ప్రియ (97.3 శాతం), నిభనపురి నాగ విరాజ్ (96.5) ,యశస్వి మొవ్వ (96.3) మార్కులు సాధించారు. 60 మంది కి పైగా విద్యార్థులు 90 శాతం మార్కులు సాధించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు ఉపాధ్యా యులకు గర్వకారణంగా నిలిచారు.

బీజేపీ అత్యంత అవినీతి పార్టీ



- బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించండి
- మోడీ 400 సీట్ల ఆశలు అడియాశలే
- అవినీతిని చట్టబద్ధం చేసిన బీజేపీ
- సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం

నవతెలంగాణ-సిటీబ్యూరో

బీజేపీ అత్యంత అవినీతి పార్టీ అనీ, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తుగా ఓడించాలని సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం పిలుపునిచ్చారు. శామిర్‌పేటలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలను అడ్డుకోవడానికే కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నామన్నారు. మోడీ మాటలు చూస్తుంటే దిగజారి, ఆత్మరక్షణలో పడినట్టు అనిపిస్తున్నదన్నారు. 400 ఎంపీ సీట్లు వస్తాయన్న బీజేపీ ఆశలు అడియాశలు అయ్యేలా ఉన్నాయన్నారు. నార్త్ ఇండియాలో బీజేపీకి ప్రతికూల పరిస్థితులు ఉన్నాయని, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బీహార్ లాంటి రాష్టాల్లో ఓటింగ్ శాతం తగ్గిందన్నారు. స్టాక్ మార్కెట్ 1.5 శాతం తగ్గిందనీ, 7 లక్షల కోట్లు ఆవిరి అయిందని, ఇది బీజేపీకి ప్రతికూల వాతావరణం సూచిస్తోందన్నారు.

ఇండియా కూటమిలో ఉన్న వారు దేశ ద్రోహులు అని మోడీ మాట్లాడటం సరికాదన్నారు. బీజేపీకి దేశభక్తి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. దేశ స్వతంత్రంలో బీజేపీ పాత్ర శూన్యం అనీ, స్వాతంత్రం కోసం పోరాడింది, త్యాగాలు చేసింది కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వాళ్లు అన్నారు. బీజేపీ వారు నిజమైన దేశ భక్తులైతే ప్రజల స్థితిగతులను మార్చాలి అన్నారు. మోడీ పదేండ్ల పాలనలో అదానీ, అంబానీ ఆస్తులు పెరుగుతున్నాయి తప్పితే పేదల ఆదాయం మాత్రం పెరగడం లేదన్నారు. బీజేపీ ఎలక్టోరల్ బాండ్ల రూపంలో అవినీతిని చట్టబద్ధం చేసిందన్నారు. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో మొత్తం రూ.8వేల కోట్లు జమ కాగా.. ఇందులో బీజేపీకే సగం అందినట్టు తెలిపారు. కర్ణాటకలో డబ్బుల సంచులతో పట్టుబడుతున్న వారిపై ఎలాంటి చర్యల్లేవనీ, ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలను దుర్వినియోగం చేస్తూ వివిధ పార్టీల్లో ఉన్న అవినీతిపరులను తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా బీజేపీ పెద్ద అవినీతి పార్టీగా మారిందన్నారు. బీజేపీకి ఈ మూడు దశల్లో వచ్చిన ప్రతికూల వాతావరణం మల్కాజిగిరిలోనూ ఉంటుందని తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ ప్రతిపాదించిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేయడం ద్వారా జిల్లా ప్రజలకు ఉపాది కల్పించకుండా బీజేపీ ద్రోహం చేసిందన్నారు. ఎంఎంటీఎస్, రెండోదశ పనులు, ఉప్పల్ నుంచి నారపల్లి రహదారి పనులను పూర్తి చేయలేదన్నారు. ఆర్కేపురంలో 4 లైన్ల ఆర్‌ఓబీ పనులు చేపట్టలేదన్నారు. ఈటల రాజేందర్, బీజేపీకి మల్కాజిగిరి ప్రజలను ఓటు అడిగే హక్కు లేదన్నారు. బీజేపీ తాము చేసిన పనులు చెప్పుకోలేక విద్వేషాలపై ఆధారపడిందన్నారు. బీజేపీ మళ్ళీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందన్నారు. గతంలో ఓబీసీలకి కేంద్ర సర్వీసులు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తే బీజేపీ మండల కమిషన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించిందన్నారు. బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందనీ, రిజర్వేషన్లు రద్దు చేస్తుందనీ, లౌకికవాదం ఉండదన్నారు. బీజేపీ నార్త్, సౌత్ ఇండియా మధ్య వ్యత్యాసం చూపిస్తున్నదన్నారు. బీజేపీ అసత్య ప్రచారాలపై ఆధారపడి ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. బీజేపీని గెలిపించే బాధ్యత బీఆర్ఎస్ తీసుకోవద్దు అన్నారు. ఒకవేళ అలానే చేస్తే బీఆర్ఎస్ పతనానికి దారితీస్తుందని హెచ్చరించారు.

సీపీఐ(ఎం) మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి కోమటి రవి మాట్లాడుతూ ఉప్పల్, మల్కాజిగిరి, కంటోన్మెంట్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్ నియోజవర్గాల్లో ప్లానింగ్ ప్రకారం ప్రచారం చేసినట్టు తెలిపారు. డోర్ టూ డోర్, కార్నర్ మీటింగ్స్, బైక్ ర్యాలీలు నిర్వహించినట్టు చెప్పారు. సెక్యులరిజం, ఫెడరలిజం రక్షించాలంటే బీజేపీ ఓడిపోవాలి అన్నారు. ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమైన వ్యక్తులు జైళ్లలో ఉన్నారన్నారు. బీజేపీని ఓడించడానికి తాము కంకణం కట్టుకున్నామన్నారు. సునీతా మహేందర్ రెడ్డి గెలుపు కోసం కషి చేస్తాం అని తెలిపారు. ప్రజలు, కార్మికుల పక్షాన బీజేపీలేదన్నారు. ఓటమి భయంతోనే బీజేపీ నాయకులు రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నట్టు తెలిపారు. దేశంలో మీడియాకు స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. సునీతాను గెలిపించాలని, ఈటల రాజేందర్, రాగిడి లక్ష్మారెడ్డిని ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రబీర్ పురాయకత్ అనే న్యూ క్లిక్ ఎడిటర్‌ను 7 నెలలుగా జైలులో ఉంచడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జె.చంద్రశేఖర్ ఎం.వినోద, ఎర్ర అశోక్, జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, ఎం.నరేష్, శామిర్‌పేట మండల కార్యదర్శి కిష్టప్ప, సీపీఐ(ఎం) నాయకులు ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఎంఎల్ఆర్ఐటీ'లో

రోబోటిక్స్‌పై జాతీయ స్థాయి కార్యక్రమం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రోబోటిక్స్ రంగంలో అత్యాధునిక పురోగతులు, ఆవిష్కరణలను ప్రదర్శించే జాతీయ స్థాయి రోబోటిక్ ఈవెంట్‌ను రోబోటిక్ క్లబ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం, దుండిగల్‌లోని ఎంఎల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమం మన దేశంలో రోబోటిక్స్ పరిశ్రమను నడిపిస్తున్న విశేషమైన ఆవిష్కరణ, సృజనాత్మకతను ప్రదర్శించింది. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విపత్తు ప్రతిస్పందన, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో సవాళ్లను పరిష్కరించడానికి రోబోటిక్స్ సాంకేతికతను ఉపయోగించుకోవడం, వాస్తవ-ప్రపంచ సమస్యలకు తెలివి గల పరిష్కారాలను పాల్గొనేవారు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు, పాండిచ్చేరి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమారు 100 మంది పాల్గొని తమ రోబోటిక్ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రధాన ఆకర్షణలు రోబో సాకర్, రోబో సుమో, లైన్-ఫాలోయింగ్ రోబోట్‌లను అనుసరించి థ్రిల్లింగ్ రోబో రేస్, చివరిది ఆకర్షణీయమైన డ్రోన్ రేస్. ఎంఎల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు తయారు చేసిన "చిట్టి" అనే దాని స్వదేశీ ఏ1-ఆధారిత రోబోట్ ద్వారా ఉదాహరణగా చెప్పవచ్చు. చిట్టి తన ఆకర్షణీయమైన సంభాషణలతో ప్రేక్షకులను అలరిస్తూ, మనుషుల తరహా కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాల్గొన్న వారందరినీ ఆప్యాయంగా పలకరించింది.

ఈ సందర్భంగా ఎంఎల్ఆర్ఐటీ వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను కనబరచేందుకు, సాంకేతికతలో సరికొత్త ట్రెండ్స్‌పై అనుభవాన్ని అందించేందుకు వీలుగా వినూత్న కార్యక్రమాల్లో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఈసీఈ విభాగం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చివరగా మొత్తం రూ.లక్ష నగదు బహుమతుల పంపిణీతో కార్యక్రమం ముగిసింది.ఎంఎల్ఆర్ఐటీ చైర్మెన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, హెచ్ఓడీ, ఈసీఈ డాక్టర్ ఎస్ వీఎస్ ప్రసాద్, డీన్ డాక్టర్ రాధిక దేవి (ఈవెంట్ కో- ఆర్డినేటర్), ఫ్యాకల్టీ మెంటార్ రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని నమ్ముకుంటే ప్రజలు ఆగం

- రాష్ట్రాలకు మోడీ ఏమి ఇచ్చాడు
- మోడీ, రేవంత్ రెడ్డి ఇద్దరూ మోసగాళ్లే
- బీజేపీని అదుపులో ఉంచాలంటే బీఆర్ఎస్‌కే సాధ్యం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ - ముషీరాబాద్/ జూబ్లీహిల్స్

బీజేపీని నమ్ముకుంటే ప్రజలంతా ఆగమవుతారు.. ప్రధాని మోడీ రాష్ట్రాలకు ఏమి ఇచ్చాడు, తెలంగాణకు అసలు నిధులను కేటాయించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీజేపీని అదుపులో ఉంచాలంటే అది బీఆర్ఎస్‌కే సాధ్యమని తెలిపారు. శనివారం హైదరాబాద్ ముషీరాబాద్‌లోని ఓ హోటల్లో ఆత్మీయ, యువ, మైనారిటీ సమావేశానికి బీఆర్ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. అలాగే జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్ గూడా చెక్ పోస్ట్ లోని మహమూద్ ఫంక్షన్ హాల్ లో ముస్లిం సోదరులతో ఆత్మీయ సమ్మేళనాన్ని జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కేటీఆర్ బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, సనత్ నగర్ ఎమ్మెల్యే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు.

ఈ సమావేశాల్లో హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ మోడీ, రేవంత్ రెడ్డి, ఇద్దరూ మోసగాళ్లే అన్నారు. ఒకరు దేశాన్ని లూటీ చేస్తే ఇంకొకరు రాష్ట్రాన్ని లూటీ చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. ఓటుకు నోటు కేసులో రూ. 50 లక్షలు ఇస్తూ దొరికిపోయిన రేవంత్ రెడ్డి కేసు ఇంకా సుప్రీం కోర్టులో ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 10-12 సీట్లు తమకిస్తే ఆరు నెలల్లో మళ్లీ కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారన్నారు. కాంగ్రెస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా ఒక డమ్మీని నిలబెట్టిందని, అధికారం ఎక్కడుంటే అక్కడుండే వ్యక్తి దానం నాగేందర్ అని అన్నారు. రూ. 30 లక్షల కోట్ల నుంచి అదానీ, అంబానీ లాంటి పారిశ్రామిక వేత్తలకు రూ. 14 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని, తాను చెప్పింది తప్పని కిషన్‌రెడ్డి రుజువు చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేటీఆర్ సవాల్ విసిరారు.

మోడీ ఏం అభివృద్ధి చేసినవో చెప్పి ఓటు అడగాలన్నారు. బీజేపీకి ఓటు వేస్తే హైదరాబాద్‌ను లూటీ చేస్తారన్నారు. మోడీ ప్రధాని అయినప్పటికి ఇప్పటికీ క్రూడ్ ఆయిల్ ధర 16 డాలర్లు తగ్గిందన్నారు. కానీ పెట్రోల్, డిజీల్ ధరలు ఎందుకు పెరిగాయని ప్రశ్నించారు. పద్మారావుగౌడ్ హిందూ, ముస్లిం అనేది చూడడని.. సెక్యులర్ నాయకుడన్నారు. గల్లీలో కార్పొరేటర్‌గా గెలిచిన పద్మారావుగౌడ్‌ను ఢిల్లీకి పంపించాలన్నారు. ఆరు గ్యారంటీల్లో 5 అమలు చేసినం అని రేవంత్ రెడ్డి సిగ్గు లేకుండా హోర్డింగ్‌లు పెట్టుకున్నాడని విమర్శించారు. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంట్ కష్టాలు ఉండేనా ? అని అన్నారు. ఇప్పుడు హైదరాబాద్‌లో కరెంట్ పోతున్నదని.. తమ ఇంట్లోనే ఐదుసార్లు కరెంట్ పోయిందన్నారు. ఒక్కసారి మోసపోతే మోసం చేసిన వాడి తప్పు.. కానీ రెండో సారి మోసపోతే మోసపోయిన వాళ్లదే తప్పు అయితదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సలీం, ఎన్నికల ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి, యువ నాయకులు ముఠా జయసింహ, డివిజన్ ల అధ్యక్షులు వై శ్రీనివాస్, వల్లాల శ్యామ్ యాదవ్, కొండా శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్, మచ్చ కుర్తి ప్రభాకర్, మైనార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

ఇక యూసఫ్‌గూడలో ముస్లిం సోదరులతో ఆత్మీయ సమ్మేళంలో కేటీఆర్ మాట్లాడుతూ ముస్లిం సోదరులు గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అత్యధిక మెజార్టీతో గెలిపించారని, అదే విధంగా వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ను నమ్మి మోసపోవద్దని అన్నారు. కాంగ్రెస్ పార్టీ లోపా యికారి ఒప్పందం చేసుకొని, బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు రాష్ట్రంలో ఏడు చోట్ల బలహీన అభ్యర్థులను పెట్టారని తెలిపారు. బీజేపీ కాంగ్రెస్ ఒక్కటే అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్ గూడ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, వెంగళరావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య రావు, వెంకటేశ్వర నగర్ డివిజన్ కార్పొరేటర్ మన్నే కవిత, మరియు అన్ని డివిజన్లో అధ్యక్షులు, కార్యదర్శులు ముస్లిం కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



లాడ్జీలు, కల్యాణ మండపాల్లో క్షుణ్ణంగా తనిఖీ చేయాలి



- పోలీస్ సిబ్బందికి సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

క్రమ మద్యం, నగదు పంపిణీపై దృష్టి సారించాలని, లాడ్జీలు, కల్యాణ మండపాలు మొదలైనవాటిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీస్ సిబ్బందికి హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. రాబోవు 48 గంటలు, పోలింగ్ రోజున అనుసరించాల్సిన ముఖ్యమైన అంశాలపై హైదరాబాద్ సీపీ పోలీస్ సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. శనివారం గోషామహల్ శివకుమార్ లాల్ పోలీస్ స్టేడియంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రచార కార్యకలాపాలు ముగియడంతో చిన్న సమూహాలతో మాత్రమే ఇంటింటికీ ప్రచారం అనుమతి ఉంటుందని తెలిపారు. 100 మీటర్లు, 200 మీటర్లకు సంబంధించిన సూచనలు తప్పక పాటించాలని, ఈవీఎంల భద్రత విషయాలపై మరోసారి అవగాహన కల్పించారు. ప్రజా రవాణా, ప్రయివేటు రవాణా దుర్వినియోగం చేస్తూ ఓటర్లను రవాణా చేయడానికి అనుమతించవద్దు అని తెలిపారు. కొన్ని పోలింగ్ స్టేషన్‌లలో సాయంత్రం 6.00 గంటల తర్వాత కూడా ఓటర్లు క్యూలో ఉన్నట్టయితే, ప్రిసైడింగ్ అధికారి సూచనలు, టోకెన్‌ల జారీ ఆధారంగా, ఓటర్లు తమ ఓటు వేయడానికి అనుమతిం చడం జరుగుతుందని తెలిపారు. రిటర్నింగ్ అధికారులు జారి చేసిన ఐడి కార్డులతో మాత్రమే బూత్ లెవల్ ఆఫీసర్లను పోలింగ్ స్థానాల్లోకి ప్రవేశించడానికి అనుమతిం చాల న్నారు. పోలింగ్ కేంద్రం లోపలికి మొబైల్ ఫోన్‌ను అనుమతించరని తెలిపారు. ఓటర్లు తీసుకొచ్చిన మొబై ల్ ఫోన్‌లను బీఎల్ఓ కౌంటర్లలో జమ చేయాలని చెప్పారు. ఓటర్ల మొబైల్ ఫోన్‌లను పోలీసు సిబ్బంది కస్టడీలోకి తీసుకోకూడదని తెలిపారు.. పోలింగ్ రోజున పోలీసు సిబ్బంది నిష్పక్షపాత ప్రవర్తనను ప్రదర్శించాలని, చక్కని నీట్ యూనిఫాం కలిగి ఉండాలన్నారు. వివిధ విభాగాలకు చెందిన దాదాపు 8000 పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాకు కులం లేదు, మతం లేదు

- ఈటల రాజేందర్

నవతెలంగాణ-సిటీబ్యూరో



తనకు కులం లేదు, మతం లేదు అని, అన్ని వర్గాల ప్రజల ప్రేమను పొందిన వాడినని బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తన 24 సంవత్సరాల చరిత్రలో ఎవ్వరికి బాధ వచ్చినా, ఎవరికి సమస్య వచ్చినా, ఏ సంఘం ధర్నా చేసిన... ఆ పోరాటానికి, ఆ సంఘానికి, ఆ బాధితులకు అండగా ఉన్న వ్యక్తిని తాను అని తెలిపారు. అలాగే ఈ 20 ఏండ్లుగా ఏ సర్వీస్ అయితే చేశానో అదే పద్ధతిలో మళ్లీ ఆ సేవను రాబోయే రోజుల్లో కొనసాగిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను అర్థం చేసుకోకుండా ఎదురీదే ప్రయత్నం చేస్తున్నదన్నారు. అందులో భాగంగా కంటోన్మెంట్‌లో ప్రతి ఒక్కరికి 2000 చొప్పున డబ్బులు పంచిందని ఆరోపించారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో కూడా డబ్బులు పంచడానికి చూస్తున్నారన్నారు. కేసీఆర్ కూడా గతంలో అక్రమంగా సంపాదించిన డబ్బు సంచులతో, మందు బాటిల్స్ తో మీ ముందుకు వచ్చారని.. అయితే తీసుకునే దిక్కు తీసుకోవాలని, వేసుకునే దిక్కు వేసుకోవాలని చెప్పారు. బీజేపీ కంటోన్మెంట్ అభ్యర్థిగా వంశీ తిలక్, మల్కాజిగిరి అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నామని తెలిపారు.

మల్కాజిగిరిలో ఎన్ని స్లమ్స్ ఉన్నాయో, ఎన్ని రకాల బాధలు ఉన్నాయో తనకు తెలుసు అన్నారు. డ్రయినేజ్ సమస్య, రోడ్ల సమస్య, డ్రింకింగ్ వాటర్ సమస్య ఉద్యోగ కల్పన సమస్య కాబట్టి ఉన్నంతలో వాటిని పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నానన్నారు. నాలుగు దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ హయాంలో పంజాబ్, జమ్మూ కాశ్మీర్ విధ్వంసం అయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న నాడు అన్ని స్కాములే అని రేవంత్ రెడ్డి స్వయంగా టీడీపీలో ఉన్న నాడు కాంగ్రెస్ పార్టీ అంటే ఏందో నిర్వచనం ఇచ్చారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ఎప్పుడూ కాంట్రవర్సీ మాటలు మాట్లాడుతున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలల్లో ఉచిత బస్సు తప్ప ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని చెప్పారు. కేసీఆర్ మీద కోపంతో ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే రేవంత్ వచ్చాడు. కానీ కాంగ్రెస్ పార్టీ ఇక్కడ సచ్చిపోయిన పార్టీ అన్నారు. ముస్లింలలో చాలా మందికి బీసీ కింద, ఈబీసీ కింద పేద ముస్లింలకు రిజర్వేషన్లు అందుతున్న తరువాత మతాలపరంగా రిజర్వేషన్లు అవసరంలేదు అని బీజేపీ చెప్పడం తప్పా అని ప్రశ్నించారు. అమిత్ షా చెప్పినట్టు ఆర్ఆర్ టాక్స్ కు మీకు శిక్ష తప్పదని హెచ్చరించారు. రేవంత్ ఏమీ కాక ముందే తాను లీడర్ ను అని.. చీమల పుట్టలో పాములు చేరినట్టు రేవంత్ సీఎం అయ్యాడన్నారు. ఆయనకు సమర్థించిన సంఘాలు ఇప్పుడు బాధ పడుతున్నాయని తెలిపారు.

'అందుబాటులోకి వచ్చిన సాధికార బౌద్ధ సాహిత్యం'

నవతెలంగాణ-కల్చరల్

సుమారు ఇరవై ఏండ్ల క్రితం తెలుగు భాషలో కల్పిత వూహ జనిత కథలు తప్ప బౌద్ధం గురించి వాస్తవాలు అందు బాటులో లేవని నేడు సాధికార బౌద్ధ సాహిత్యం తెలుగులో అందుబాటులోకి వచ్చిందని విశ్రాంత పోలీస్ ఉన్నతాధికారి సీ.ఆంజనేయ రెడ్డి అన్నారు . ఈ సాహిత్య ప్రచురణలో కె కె రాజా కృషి ప్రశంస నీయమని అభినందించారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై లతా రాజా ఫౌండేషన్ నిర్వహణ లో బౌద్ధ సాహిత్యం పై పది రచనలతో పాటు ఇతర నాలుగుసామాజిక సాహిత్య సంపుటి ల ఆవిష్కరణ జరిగింది. ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ వేయి సంవత్సరాల క్రితం పాళీ భాషలో ఉన్న బౌద్ధ సాహిత్యం తెలుగులోకి సమగ్రం తీసుకువ స్తున్నమని తెలిపారు. అంబేకరిస్టులుగా కాక బుద్ధిస్టులుగా చెప్పుకోవటం వల్ల జనాభా సంఖ్య పెరుగుతుందని చెప్పారు.అన్ని దానాలలో ధర్మ దానం గొప్పదని బుద్ధిజం చెబుతుందని ధనం సంపాదించి ఉత్తమ సాహిత్య ప్రచురణలు ఖర్చు పెడుతున్న రాజా అభినందనీయులు అన్నారు. బుద్ధిస్ట్ బుర్ర గోవర్ధన్ మాట్లా డుతూ వైదిక సాహిత్యం కన్నా ముందు బుద్ధ సాహిత్యం ఉందన్నారు. కొన్ని కుట్రల వల్ల మరుగు పడిందన్నారు. మానవత్వం కావాలంటే బుద్ధుని బోధనలు సందేశం ప్రచారం కావాలన్నారు. రాజా సతీమణి లత పేరిట ఫౌండేషన్ ద్వారా రాజా చేస్తున్న సేవ ప్రశంసనీయం అన్నారు. ప్రజా వాగ్గేయ కారుడు జయరాజ్ మాట్లాడుతూ నాలో ఉన్న క్యాన్సర్ వంటి రుగ్మతలు అన్ని పోగొట్టుకొని బుద్ధిస్ట్ గా మారానన్నారు. గ్రీక్ యోధుడు అలెగ్జాండర్ శాస్త్రవేత్త ఇన్స్టీన్ వంటి వారిని బుద్ధిజం ప్రభావితం చేసింది అన్నారు. సంస్థ స్థాపకుడు రాజా మాట్లాడుతూ గ్రూప్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి వారు ఉండే హాస్టల్ కు లక్ష రూపాయలు విలువ చేసే గ్రంథాలు అందజేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు తమ సంస్థ 90 గ్రంథాలు ప్రచురించిందని తెలిపారు. గ్రంథాలు వరుసగా అంబేద్కర్ రచన కా న్వర్షన్, సుమేధ బోధ రచన సామాజిక బౌద్ధ ధర్మం, పారనంది నిర్మల రచన సంస్కరణలకు ప్రేరణ జ్యోతి బాయి పూలే, ధర్మ భూమి రచన నిర్మల, డాక్టర్ పద్మాకర్ రచన ఆదర్శం ఆచరణ, బండి సత్యనారాయణ రచన శీలం ఉత్తమ జీవనం, నిర్మల రచన అడవి మంటలు,రాష్ట్ర పాల్ రచన బౌద్ధం నియమిత కర్మలు, బొర్ర గోవర్ధన్ రచన సీల శిఖరం, ధర్మ చక్రం,తెలుగు భాషా సాహిత్యం సంకలనం సంపాదకులువిశ్వనాద్ రెడ్డి, ఈమని నాగి రెడ్డి, నటరాజ్ శాఖ్య రచననారాయణగురు ,డాక్టర్ బండి సత్యనారాయణ రచన నిర్వణ,పట్టాభి రామయ్య రచన నిత్య చర్య లను వరుసగా తాత్యా రావు,ఈమని నాగి రెడ్డి,ప్రొఫెసర్ సుధ రాణి,మధుకర్,డాక్టర్ పద్మాకర్, బండి సత్యనారాయణ, కె వీ.రావు,నటరాజ శాఖ్య,జయరాజ్,మల్లేపల్లి లక్ష్మయ్య ఆంజనేయ రెడ్డి, బి.నర్సింగ్ రావు, బొర్ర గోవర్ధన్ వినోద్ కుమార్ లు ఆవిష్కరించారు



నాంపల్లి ఎక్సైజ్ పరిధిలో మద్యం షాపులు బంద్

● నాంపల్లి ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ సుధాకర్ వర్మ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం 6 గంటలకు మద్యం షాపులకు బంద్ (సీల్) వేసినట్లు నాంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ వర్మ తెలిపారు. శనివారం నాంపల్లి ఎక్సైజ్ పరిధిలోని మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌లను, క్లబ్బులు, కల్లు దుకాణాలను బంద్ చేయించామన్నారు. వాటికి సీల్ వేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం 6 గంటల నుండి ఈనెల 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మద్యం షాపులు, క్లబ్బులు, కల్లుదుకాణాలు, రెస్టారెంట్లు బంద్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి ఎక్సైజ్ ఎస్‌ఐలు కె.చంద్రకాంత్ రెడ్డి, సూర్య ప్రకాష్, కానిస్టేబుళ్లు మహేశ్వరరావు, అర్చన, సునీల్ ,సాయి ప్రసన్న, అనూష తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించండి

నవతెలంగాణ-ధూల్‌పేట్



ఇండియా కూటమిని బలపరిచినటువంటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఉల్లా సమద్ సమీర్ గెలిపించండి అని సీపీఐ(ఎం) పార్టీ చాంద్రాయణ గుట్ట జోన్ కమిటీ సభ్యురాలు మీసాల లక్ష్మమ్మ అన్నారు. సీపీఐ(ఎం) సౌత్ జిల్లా ఆధ్వర్యంలో చాంద్రాయణ గుట్ట జోన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరూ ప్రజా స్వామిక లౌకిక శక్తులను బలపరచాలని, ఇండియా కూటమి నుంచి నిలబడుతున్నటువంటి మహమ్మద్ సమీవుల్లా గెలిపించాలని కమిటీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామ్ కుమార్ నాయక్ ఎస్ కిషన్ నాయక్, ఎల్ కోటయ్య, ఏ కృష్ణా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రచార పర్వం

● మూగబోయిన మైక్‌లు
● మొదలైన ప్రలోభాల పర్వం..!



నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి హైదరాబాద్ నగరంలో ఎన్నికల సందడి జోరుగా కొనసాగిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ప్రధాన పార్టీలన్నీ ఒకరిని మించి, మరొకరు విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. డప్పులు, డీజేలు, మైక్‌సౌండ్లు, సభలు, సమావేశాలు గల్లీ నుంచి ప్రధాన రహదారులు, గ్రౌండ్స్‌లో, కార్నర్ మీటింగ్‌లతో హెూరెత్తించారు. వేలాది మందితో పాదయాత్రలు, ర్యాలీలతో ఓటర్లను ఆకట్టుకున్నారు. అయితే శనివారం సాయంత్రం 5గంటలకు ప్రచార గడువు ముగియడం మైకులు మూగబోయాయి. ఒక్కసారిగా నగరం సైలెంట్‌గా మారింది. ఇక నాయకులు నలుగురు ఐదుగురితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించిడం కనిపించింది.

చివరి రోజు... హెూరాహెూరీ

మరి కొన్ని గంటలలో హైదరాబాద్ జిల్లాలోని హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాలకు, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికలు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎంలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. సిట్టింగ్ స్థానాలను నిలబెట్టుకోవడానికి ఓ వైపు ఎంఐఎం, బీజేపీలు విశ్వప్రయత్నం చేస్తుండగా, మరోవైపు ఆయా సెగ్మెంట్లు తమ ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కసరత్తు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం చివరి రోజు రోడ్ షోలు, పాదయాత్రలు, ర్యాలీలతో హెూరెత్తించారు. శనివారం అన్ని రాజకీయ పార్టీలు బైక్ ర్యాలీలు పాదయాత్రలతో హెూరెత్తించాయి. బస్తీలు, కాలనీల్లో ప్రచారం చేపట్టి ఓట్లు అభ్యర్థించాయి. తమ అమూల్యమైన ఓటును తమ పార్టీ అభ్యర్థులకు వేసి గెలిపించాలని ఓటర్లను ప్రాధేయపడ్డారు.

శనివారం రాత్రి నుంచే...

లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు మరి కొద్దిగంటలే గడువు ఉండటంతో రాజధాని పరిధిలో ప్రలోభాల పర్వం మొదలైనట్టు తెలుస్తోంది. దాదాపు అన్ని రాజకీయ పార్టీలు డబ్బుల పంపకాలపై దృష్టి సారించినట్టు విశ్వసనీయ సమాచారం. శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్ర వరకు ఓటర్లకు పంపిణీ చేసేందుకు ప్రధాన పార్టీల్లోని కొందరు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఓటుకింతా అని లెక్కగట్టి పోల్ చిట్టీలతో పాటు నగదును అందిస్తున్నారు. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలోని అభ్యర్థులు తమకు నమ్మకంగా ఉండే నాయకులు, అనుచరులతో పనిగానిస్తున్నారు. ఓ వైపు అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నా వారి కండ్లు గప్పి రహస్యంగా చేర్చాల్సిన చోటుకు చేరుస్తున్నారని తెలుస్తోంది.

మద్యం దుకాణాల వద్ద బారులు

ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి సోమవారం పోలింగ్ ముగిసేంత వరకు మద్యం దుకాణాలు మూసి వేయాలని పోలీసులు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీల నాయకులు అప్రమత్తమయ్యారు. ముందుగానే మద్యం దుకాణాల నుంచి పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి డంప్ చేశారనే ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా మద్యం ప్రియులు సైతం శనివారం మద్యం దుకాణాల ముంది బారులు తీరారు. పెద్దఎత్తున మద్యాన్ని కొనుగోలు చేశారు. దాంతో నగరంలో అన్ని వైన్స్‌షాప్ లు కిటకిటలాడాయి.

రాష్ట్రంలో బీజేపీకీ ఓటు అడిగే నైతిక హక్కులేదు

● కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

నవతెలంగాణ-ముషీరాబాద్

బీజేపీకీ రాష్ట్రంలో ఓటు అడిగే నైతిక హక్కులేదని, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావన్ని విభజన హామీలను విడమర్చి పది సంవత్సరాలు నుంచి తెలంగాణకు అన్యాయం చేసినటువంటి భారతీయ జనతా పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. శనివారం బీజేపీకు ఓటు వేయకూడదని పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా గౌరీ సతీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ప్రజలకు కావాల్సినటు వంటి సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందన్నారు. రాష్ట్రంలో గత నాలుగు నెలల నుంచి ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ ప్రజల యొక్క మన్ననలను పొందుతున్నటువంటి కాంగ్రెస్ పార్టీకి ఆదరించాల్సినటువంటి అవసరం ఎంతైనా ఉందని జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఖచ్చితంగా రాష్ట్రంలో 12 నుంచి 14 పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనుందన్నారు. బీజేపీ ప్రజలపై ఏ విధంగా కపట ప్రేమ చూపిస్తుందో ప్రతి ఒక్కరు గ్రహించాలన్నారు. ఉద్యోగాల కల్పన కోసం సంక్షేమ పథకాల కోసం సమ సమాజం కోసం అభివృద్ధి కోసం మనమందరం కాంగ్రెస్ పార్టీకి ఓటేసి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాల్సినటువంటి అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న వారికి కరాటేలో ఉచిత శిక్షణ



నవతెలంగాణ-అంబర్‌పేట

18 సంవత్సరాల దాటిన యువతీ, యువకులు ఓటు హక్కు వినియోగించుకునేలా యువతను ప్రోత్సహించడానికి జీవీఆర్ కరాటే అకాడమీ ఒక వినూత్న ఆలోచన చేసి ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతీ యువతీ, యువకులకు ఒక నెల రోజులు పాటు అకాడమీలో కరాటే ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్ గోపాల్ రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకుని దేశ భవిష్యత్తు కాపాడాలన్నారు. 18 ఏళ్ల పైబడిన వారైతే, మీకు భారతదేశంలో ఓటు వేసే రాజ్యాంగ హక్కు ఉందని ఓటర్లు ముఖ్యంగా మెట్రోపాలిటన్ ప్రాంతాలలో ఎన్నికల రోజును విశ్రాంతి దినంగా పరిగణించే ధోరణిని కలిగి ఉన్నారు. ఓటును దాటవేయడం వలన స్వల్పకాలిక ప్రతికూల పరిణామాలు లేనట్లు కనిపించవచ్చు. దీర్ఘకాలిక పరిణామాలు భయంకరంగా ఉంటాయి. ఓటు ప్రాముఖ్యత ను ప్రతీ యువతీ, యువకులకు తెలియజేయాలని కోరారు.

రాజ్యాంగ రక్షణకు ప్రజలంతా ఓటు వేయాలి

● ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్

నవతెలంగాణ-ధూల్‌పేట్



రాజ్యాంగ రక్షణకు ప్రజలంతా ఓటు వేయాలని ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. ఈనెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలంతా పెద్దసంఖ్యలో ముందుకు వచ్చి భారత రాజ్యాంగాన్ని కాపాడు కోవడానికి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కుల మతాలకతీతంగా కలిసిమెలిసి ఉంటున్న తెలంగాణలో మతపరమైన ఉద్రి క్తతలను వ్యాపింపజేస్తున్నారని, అందుకు ముస్లింలను బాహాటంగానే లక్ష్యంగా పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఒకవైపున అరాచకం, విచ్ఛిన్నకర వాతావరణం పెచ్చరిల్లిపోతుంటే, మరోవైపున నిర్దోషులకు, అమా యకులకు న్యాయం లభించటం దుర్లభంగా మారిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రజలంతా ఈ విషపూరితమైన వాతావరణాన్ని నిర్వీర్యం చేయడానికి, భారత సంవిధానాన్ని కాపాడుకోవటానికి కలసికట్టుగా ముందుకు వచ్చి ఫాసి స్టు శక్తులను ఓడించాలని ఆయన కోరారు. భారత రాజ్యాంగంలోని సెక్యులర్ క్యారెక్టర్ ను కాపాడుకోవడానికి, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవటానికి ఇండియా కూటమికి ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'ప్రజాస్వామ్య విలువలు కాపాడాలి'

● ఆల్ ఇండియా బ్యాక్వర్డ్ పీపుల్ సునామీ పార్టీ జాతీయ అధ్యక్షులు సి.హెచ్.భూపాల్ గౌడ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఆల్ ఇండియా బ్యాక్వర్డ్ పీపుల్ సునామీ పార్టీ జాతీయ అధ్యక్షులు సి.హెచ్. భూపాల్ గౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కొన్ని ప్రధాన పార్టీలు ఓటర్లను డబ్బులతో కొనుగోలు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయ న్నారు. వీటిపై ఎలక్షన్ కమిషన్ గట్టి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దేశాన్ని నిలువు దోపిడీ చేసిన అగ్రకులాల రాజకీయ పార్టీలకు ఓటు వేయ్యవద్దని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఆయన పిలుపునిచ్చారు.తమ పార్టీ నుంచి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానంలో బరిలో తాను పోటీలో ఉన్నానని తెలిపారు.ఎస్సీ, ఎస్సీ, బీసీల పార్టీ అయిన సునామీ పార్టీ ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీపీ బద్రీనాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బస్‌స్టాప్ వద్ద మృతదేహం లభ్యం..

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం బస్‌స్టాప్ వద్ద లభ్యమైన ఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అబిడ్స్ ఎస్ఐ సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో శనివారం ఓల్డ్ ఎమ్మెల్యే కోటర్స్ హైదర్ గూడ బస్‌స్టాప్ వద్ద ఓ గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్టు గుర్తించారు. ఆ శవాన్ని ఉస్మానియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఎవరైనా ఆ మృతుడి సంబంధికులు ఉంటే వెంటనే అబిడ్స్ పోలీసులను సంప్రదించాలన్నారు. మిగతా వివరాల కోసం ఫోన్ నెం.8712660114ను సంప్రదించ వచ్చని చెప్పారు.

దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

● రాష్ట్ర మున్నూరుకాపు ఐక్య పోరాట సమితి



నవతెలంగాణ-అంబర్‌పేట

కాంగ్రెస్ పార్టీ సికిం దాబాద్ లోక్‌సభ అభ్యర్థి దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర మున్నూరుకాపు ఐక్య పోరాట సమితి పిలుపునిచ్చింది. అందరివాడుగా.. అందుబాటులో ఉండే వ్యక్తిగా.. నగరంపై మంచి పట్టు ఉన్న వ్యక్తిగా.. ఆరుసారు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉన్న దానం నాగేందర్‌ను ఓటు వేసి అభివృద్ధికి దోహదపడాలని సమితి నేతలు పేర్కొన్నారు. మీడియా సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది కొండూరు వినోద్‌కుమార్, సమితి ప్రధాన కార్యదర్శి, మున్నూరు కాపు తరపున ప్రచార కమిటీ మెంబర్ కట్టెల సుభాష్, అంబర్‌పేట నియోజకవర్గం మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కె. రామ్మోహన్రావు, ఓల్డ్ సిటీ మున్నూరుకాపు సంఘం వైస్ ప్రెసిడెంట్ మడిగెల భాస్కర్రావు, శాలిబండ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ తిరుపతి చంద్రశేఖర్, మహిళా నాయకురాలు ఆకుల మంజుల తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతు తెలిపారు.

రిజర్వేషన్లు ఎత్తివేస్తే దేశాన్ని స్తంభింపచేస్తాం

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్ కృష్ణయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

బీజేపీ పార్టీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంది. రిజర్వేషన్లు ఎత్తివేస్తే దేశాన్ని స్తంభింపచేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. శనివారం విద్యానగర్ బీసీ భవన్‌లో రిజర్వేషన్ల అంశంపై బీసీ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ ఆర్.కృష్ణయ్య హాజరైగ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా మహిళా నాయకురాలు ప్రణీత రాణిని నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ పార్టీ అవలంబిస్తున్న విధానాలను సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ డిఎంకె వివిధ పార్టీలు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నాయన్నారు. అన్ని రాష్ట్రాలలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, హెూం శాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షులు నడ్డా రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల అంశంపై బిజెపి పార్టీపై ప్రజల్లో తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా బీసీల వ్యతిరేక పందా మార్చి బీసీల విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ విధానాలు ప్రకటించి అభివృద్ధి చర్యలు తీసుకుంటామని బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించాలని కోరారు. బీసీలకు అన్యాయం చేస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, అనంతయ్య, పి. సుధాకర్, రాజేందర్, నందగోపాల్, కృష్ణ మూర్తి, ప్రణీత రాణి, ఉమేశ్ యాదవ్, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

గాంజా శంకర్ సినిమా పేరును మార్చండి

● బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ



నవతెలంగాణ-ముషీరాబాద్

గాంజా శంకర్ సినిమా పేరును మార్చండని బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం విద్య నగర్ బీసీ భవన్ లో సాయి ధరమ్ తేజ నటించిన గాంజా శంకర్ అనే సినిమా పేరును మార్చాలని బీసీ విద్యార్థి సంఘం నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ హాజరై మాట్లాడుతూ గాంజా శంకర్ సినిమా పేరును మార్చండి.. దీనిపై దర్శకులు నిర్మాత పునరాలోచించాలని చేయాలన్నారు. ఇలాంటి పదాల వల్ల సమాజంపై ముఖ్యంగా విద్యార్థులు యువతపై పెను ప్రభావం చూపు తాయన్నారు. ఇటీవల కాలంలో పెద్ద పెద్ద పేరు గాంచిన హీరోలు సైతం సినిమాల్లో ధూమపానం, మద్యపానం సేవిస్తూ.. యువతకు ఏమి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. పేరు మార్చకపోతే విద్యార్థులతో కలిసి సినిమాల అడ్డుకుంటామని హెచ్చరించారు. కమర్షియల్ సినిమాలు తీయండి తప్పులేదు.. కమర్షియల్ అనే పేరుతో విదేశీ సంస్కృతి.. ధూమపానం మద్యపానం సేవించుకుంటూ.. హీరోలు చేసే యాక్టింగ్ యువతపై పెను ప్రభావం చూపుతోందన్నారు. దీనిపైన సెన్సార్ బోర్డ్ స్పందించి నోటీసులు అందజేయాలని కోరారు.

గోడ కూలి మృతి చెందిన వలస కూలీలకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి

● జన్ సేవా సంఘ్ అధ్యక్షులు ఆర్.పి.సింగ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

బాచుపల్లి రేణుక ఎల్లమ్మ కాలనీలో గోడ కూలి మృతి చెందిన వలస కూలీలకు రూ.50 పరిహారం చెల్లించాలని జన్ సేవా సంఘ్ అధ్యక్షులు ఆర్.పి.సింగ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘ్ ప్రధాన కార్యదర్శి రాజీవ్ రంజన్ చౌబే, కోశాధికారి బినీత్ కుమార్ సింగ్ లతో కలిసి ఆయన మాట్లాడుతూ కూలీల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక నివాసాల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందన్నారు. కూలీల జీవన విధానం జంతువుల కంటే అధ్వానంగా ఉందన్నారు. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెంది పలువురు గాయాల పాలైన రాజకీయ పార్టీలు, నాయకులు అసలు స్పందించకపోవడం విచారకరమన్నారు. చనిపోయిన కూలీలకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని, తీవ్రంగా గాయపడిన వారికి రూ.20 లక్షల నష్టపరిహారం వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. వలసదారుల సంక్షేమం గురించి ప్రకటన చేయని ఏ రాజకీయ పార్టీలకు తాము మద్దతు ఇవ్వబోమన్నారు.అభ్యర్థుల యోగ్యతను బట్టి వారికీ ఓట్లు వేయాలని ప్రజలకు వారు సూచించారు.ఈ సమావేశంలో సంఘ్ నేతలు ఎల్.ఎం.చౌదరి, ఎండీ.మునీర్, మదన్ లాల్, పరమానంద శర్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ద్రోహి పార్టీ బీజేపీని చిత్తుగా ఓడిస్తాం

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

బీసీలకు ద్రోహం చేస్తున్న బీజేపీ పార్టీని ఈ లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ బీసీలకు సూచించారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మెన్ చిన్న శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఎల్బీ స్టేడియంలోని పతే మైదాన్ క్లబ్ లో "సమగ్ర కుల గణన, బీసీల రిజర్వేషన్ల పెంపు" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తమ పూర్తి మద్దతు తెలుపుతున్నామని, 17 ఎంపీ స్థానాలలో బీసీలు కాంగ్రెస్ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని ఆయన సూచించారు. బీసీ ప్రధాని మోదీ కేంద్రంలో చేసింది ఏమీ లేదని ఆరోపించారు. బీసీ కులగణన చేస్తే దేశ సమైక్యత దెబ్బ తింటుందని, ఇది విదేశీ శక్తుల ఏజెండా అని బీజేపీ ప్రభుత్వం ప్రకటించడం హస్యాస్పదమని, బీసీలకు రాజ్యాంగ భద్రత, వాటా రావడంలో కులగణన ఒక్కటే పరిష్కారమన్నారు. 70 కోట్ల బీసీలను బీజేపీ ప్రభుత్వం దగా చేస్తుందని, అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేస్తావని, రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తామని, మహిళా బిల్లులో బీసీ సబ్ కోటా చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారని గుర్తు చేశారు. అందుకే ఇండియా కూటమికి జాతీయ స్థాయిలో సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని మోదీ, అమిత్ షాలు ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమని, బీజేపీ నేతలకు దమ్ముంటే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని సవాల్ విసిరారు.కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు బీసీలు ముందుకు సాగుతున్నామన్నారు. దేశవ్యాప్తంగా బీసీలు ఇండియా కూటమికి ఓటు వేసి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని కోరారు. బీజేపీకి బీసీల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఈ సమావేశంలో పలు బీసీ కుల సంఘాల నాయకులు ప్రొఫెసర్ భాగయ్య, వేముల వెంకటేష్, విక్రమ్ గౌడ్, నారా యణ గౌడ్, రాణి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

● ఇందిరా రాజీవ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇమంగారి అంజలయ్య

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



స్వాతంత్ర పోరాటంలో దేశం కోసం ప్రాణాలర్పించిన మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీల 200 అడుగుల విగ్రహా లను ఏర్పాటు చేయాలని ఇందిరా రాజీవ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఇమంగారి అంజలయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డుతూ రాహుల్ గాంధీ శివుడి భక్తుడని ఆయన కోరిక మేరకు శివాలయం నిర్మించాలని కోరారు. దీనికి సుమారు రూ.5 వేల కోట్ల బడ్జెట్ అవుతుందన్నారు. ఈ మహనీయుల విగ్రహాల ను దేశంలో ఎక్కడైనా 200 అడుగులు ఉండే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేస్తే మంచిదన్నారు. ఈ విషయంపై ఏప్రిల్ 11న సోనియా గాంధీని కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. సోనియా గాంధీ సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చిందని ఆయన చెప్పారు. దేశ అభివృద్ధిని మనసా, వాచా కోరుకునే నిరాడంబర వ్యక్తి రాహుల్ గాంధీ అని కొనియాడారు. మహాత్మా గాంధీ కోరుకున్న రామ రాజ్యం, నెహ్రూ కోరుకున్న సెక్యులర్, లిబరల్, సైంటిఫిక్ ఇండియాగా, ఇందిరాగాంధీ కోరుకున్న, పేదరికం లేని దేశంలా, రాజీవ్ గాంధీ కోరుకున్న ఉద్యోగాలు కల్పించే ఐటి, సాఫ్ట్ వేర్ రంగాలతో అభివృద్ధి చెందిన దేశంలా తీర్చిదిద్దుతాడనే నమ్మకం దేశ ప్రజలందరికి ఉందన్నారు. మోడీ ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఎల్ఐసీ, బీపీసీఎల్ వాటాలు అమ్మి ప్రైవేటీకరణకు ప్రయత్నించడం, చమురు కంపెనీలను, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించడం మొదలగు దేశద్రోహ పనులకు పాల్పడిందని విమర్శించారు. నరేంద్రమోదీ, బీజేపీ పార్టీని ఈ లోక్ సభ ఎన్నికల్లో ఓడించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీసుల విస్తృత తనిఖీలు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

లోకసభ ఎన్నికల నేపథ్యంలో నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్ లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని రైల్వే ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నాంపల్లి రైల్వే స్టేషన్, పార్సిల్ గోదాముల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో, ప్లాట్ ఫామ్‌లలో, రైల్వే భోగిల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నమన్నారు. ఈ తనిఖీల్లో ఇప్పటివరకు ఆరు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వివిధ కేసుల్లో ఉన్న19 మంది నిందితులను బందోవర్ చేస్తామన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి, లిక్కర్, వివిధ రకాల సామాగ్రిని పట్టుకున్నామన్నారు, తనిఖీల్లో ఏలాంటి పత్రాలు లేని నగదు 16 లక్షల 58 వేల పైచిలుకు పట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

'రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలి'

● కాంగ్రెస్‌కు భారత్ క్రిస్టియన్ కౌన్సిల్ సంపూర్ణ మద్దతు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణలోని 33 జిల్లాల క్రైస్తవ సంఘాలు, పాస్టర్లు, ఫెలోషిప్స్, అసోసియేషన్స్, బిషప్ కౌన్సిల్స్, తెలంగాణ క్రైస్తవులందరూ ఈ నెల 13న జరిగే లోక్ సభ ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని, అందుకు కాంగ్రెస్ పార్టీకి భారత్ క్రిస్టియన్ కౌన్సిల్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు, బిషప్ డా.ముల్కలా భాస్కర్ మాట్లాడుతూ బీజేపీ దేశాన్ని సర్వనాశనం చేస్తుందని, సెక్యులర్ పదాన్ని తీసివేసి రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ బహిరంగంగా ప్రకటిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్రంగా అన్యాయం చేస్తున్న మతతత్వ పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసి ప్రైవేట్ పరం చేసి దేశ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తూ దేశాన్ని చీకటిమయం చేస్తున్నారని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా క్రైస్తవ, ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైన, పార్శి కుల సమాజానికి సంరక్షణ కల్పించే నిజమైన సెక్యులర్ పార్టీ కాంగ్రెస్ పార్టీనేనన్నారు. రాష్ట్రంలో సీఎం ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో 17 ఎంపీ స్థానాలను గెలిపించి, రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చేసుకుని రాజ్యాంగాన్ని కాపాడుకుందామని, మణిపూర్ లాంటి మారణ హెూమం వంటి సంఘటనలు జరగకుండా నిలువరించే దమ్మున్న నాయకుడు రాహుల్ గాంధీ అని మేధావులు, విద్యావంతులు, విద్యార్థులు, ఉద్యోగులు ఆలోచించి కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో క్రైస్తవ కాంగ్రెస్ నాయకులు ఎస్.కెన్నెడీ, డా.జి.భరత్, సుధీర్, వెంకట్, ఎస్తర్ రాణి, వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటీ ప్రధాన కార్యదర్శి రాధా మాథ్యూస్, రెబెక్ కిషోర్, గ్రేస్ వనీలా తదితరులు పాల్గొన్నారు.



రోగుల పాలిట ఆశాదీపం

సేవ చేయాలనే సంకల్పం అందరికి ఉండదు. అది కొందరికి మాత్రమే ఉంటుంది. అందులోనూ రోగులకు సేవ చేయడం చిన్న విషయం కాదు. దానికి ఎంతో ఓర్పు, సహనం, ప్రేమ అవసరం. ఓ రోగం తగ్గేందుకు వైద్యం ఎంత అవసరమో నర్సుల సేవ కూడా అంతే అవసరం. అలా రోగులకు అనునిత్యం సేవ చేసిన గొప్ప వ్యక్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ ఈ రోజు ఆమె జయంతి. ఎంతోమంది జీవితాల్లో వెలుగు నింపిన ఆ సేవా మూర్తిని స్మరించుకుంటూ, ఆమె అడుగు జాడల్లో నడుస్తున్న నర్సులందరికి అభినందనలు.

ద లేడీ విత్ ద ల్యాంప్‌గా గుర్తింపు పొందిన ఫ్లోరెన్స్ నైటింగేల్ ఇటలీలోని ఓ దళిత కుటుంబంలో పుట్టారు. ఎంతో గొప్పింటి అమ్మాయి అయినా నర్సింగ్ చేయడానికే నిశ్చయించుకుంది. దీని కోసం తన సంఘంపై తిరగబడింది. స్త్రీలు ఇంటి పట్టునే ఉండాలన్న కట్టుబాట్లను ఛేదించింది. ఆ రోజుల్లో ఆస్పత్రులు అధ్వాన్న స్థితిలో ఉండేవి. శుచి, శుభ్రత ఉండేవి కావు. అయినా ఫ్లోరెన్స్ నర్సింగ్ చేయడానికే నిర్ణయించుకుంది. 1852లో ఐర్లండ్ వెళ్ళింది. అక్కడి ఆసుపత్రులు చూసి వాటిల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావాలని అనుకున్నది. 1853లో సిస్టర్ ఆఫ్ చారిటికి వెళ్ళింది. కొన్నేండ్లకు నాయనమ్మకు సేవ చేసేందుకు తిరిగి లండన్ వచ్చింది. అక్కడ కలరా వ్యాపించడంతో రోగులకు రాత్రీపగలు విశేష సేవలు అందించింది. 1854-56లో క్రిమియాలో ఘోర యుద్ధం జరిగింది. ఫ్లోరెన్స్ తోటి నర్సులను కూడగట్టుకొని యుద్ధంలో గాయాలైన సైనికులకు సేవలు అందించి వారికి ధైర్యం చెప్పేది. చిమ్మ చీకట్లో కూడా చిరు దీపం వెంట తీసుకెళ్లి సేవలు చేసేది.

కలకాలం జీవించి ఉంటుంది

మొదట్లో ఆమెను చూసి అధికారులు మండిపడేవారు. తర్వాత ఆమె సేవకు ముగ్ధులయ్యారు. ఆసుపత్రుల్లో చోటు సరిపోకపోతే, అధికారులను ఒప్పించి పాత ఇళ్ళను, భవంతులను ఆస్పత్రులుగా మార్చేది. విశ్రాంతి మరచి అనునిత్యం పనిచేసేసరికి ఆమె చిక్కిపోయింది. అయినా తన సేవలను కొనసాగించేది. 'తాగుడుకు డబ్బు ఖర్చు పెట్టకండి. మీ ఇళ్ళకి డబ్బు పంపండి. వారి భుక్తి గడుస్తుంది' అని ఆమె రోగులకు చెప్పేది. భారతదేశానికి కూడా ఆమె విశేష సేవలు అందించింది. 1859లో విక్టోరియా రాణి ఆరోగ్య సంస్కరణల కొరకు కమిషన్ నిర్మించింది. మహిళా నర్సులకు శిక్షణను ప్రోత్సహించారు. నగర పారిశుధ్యం మెరుగుపడింది. ఫ్లోరెన్స్ సలహాలతో మన దేశంలో మరణాలు రేటు తగ్గింది. సేవా నిరతి గల ప్రతి నర్సులో ఆమె కలకాలం జీవించి ఉంటుంది. ■

నా వృత్తికి న్యాయం చేస్తున్నా



మా సొంతూరు బండ కొత్త పల్లి, గుండాల మండలం, జనగామ జిల్లా. నేను చిన్నప్పుడు హాస్టల్లో ఉండి చదువుకున్నాను. అక్కడి పరిస్థితులు చూసి సేవ చెయ్యాలనే ఆలోచన వచ్చింది. అది కాక నర్స్‌గా శిక్షణ తీసుకుంటే కుటుంబానికి ఆర్థికంగా సపోర్ట్ చేయొచ్చు. అందుకే నర్సు వృత్తిలోకి వచ్చాను. 2010 నుంచి నర్స్‌గా చేస్తున్నాను. పిల్లల విభాగంలో ఎక్కువగా చేశాను. అనేక అనారోగ్య సమస్యలతో పిల్లలు ఆస్పత్రికి వస్తుంటారు. వాళ్ళను చూసినప్పుడు ఎలాగైనా కాపాడాలి అనే తపన నాలో మొదలవుతుంది. గర్భవతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, డెలివరీ తర్వాత బేబీని ఎలా చూసుకోవాలి వీటిపై అవగాహన కల్పిస్తుంటాను. ఐదేండ్ల నుండి ఎమర్జెన్సీ వార్డులో చేస్తున్నాను. నేను చాలా త్వరగా స్పందిస్తానని ఈ విభాగంలో వేశారు. అప్పుడే పుట్టిన బిడ్డల వార్డ్ అన్నమాట. ప్రమాద పరిస్థితుల నుండి బయట పడి తల్లీ, బిడ్డా క్షేమంగా ఇంటికి వెళ్తున్నప్పుడు నా వృత్తికి నేను న్యాయం చేశాననే తృప్తి ఉంటుంది.

- బి.పరిమళ,
పిర్జాదిగూడా, మేడిపల్లి

సేవలోనే తృప్తి



మాది నల్లగొండ జిల్లా హుజూర్నగర్. నాన్న సైకిల్ షాప్ నడిపేవారు. నేను గర్ల్స్ హైస్కూల్లో పదో తరగతి చదువుకున్నాను. మా స్కూల్ పక్కనే ప్రభుత్వ హాస్పిటల్ ఉండేది. మేము గోడలెక్కి ఆ హాస్పిటల్లో జరిగేవన్నీ చూస్తుండే వాళ్ళం. తెల్ల డ్రెస్సులు వేసుకొని నర్సులు రోగులకు సేవ చేయడం, వాళ్ళని అందరూ ప్రేమతో పలకరించటం చూసేవాళ్ళం. నాకూ నర్స్ కావాలని, రోగులకు సేవ చేయాలనే ఆలోచన వచ్చింది. అయితే అనుకోకుండా బీకాంలో చేరాల్సి వచ్చింది. డిగ్రీ తర్వాత లా చదవాలకున్నా. కానీ ఎందుకో బీకాం డిస్ కంటిన్యూ చేసి నర్సింగ్ ట్రైనింగ్‌కి వెళ్ళిపోయా. ట్రైనింగ్ వరంగల్ ఎంజీఎంలో. నా ఫస్ట్ పోస్టింగ్ పాలకుర్తి, వరంగల్ జిల్లా. నాది 30 ఏండ్ల అనుభవం. 15 ఏండ్లు ఎంజీఎంలో చేశాను. తర్వాత సీకేఎంకి వేశారు. అంటే హన్మకొండలోని గుట్ట కింద దవాఖానా అంటారు. ఇక్కడ అన్నీ డెలివరీ కేసెస్ వచ్చేవి. సిజేరియన్స్ కూడా చేయాల్సి వచ్చేది. నేను సిజేరియన్ కంటే నార్మల్ డెలివరీకే ప్రాధాన్యం ఇచ్చేదాన్ని. పేషంట్లకి ధైర్యం చెప్పే వాళ్ళం. ప్రస్తుతం నేను క్యాన్సర్ హాస్పిటల్లో చేస్తున్నా. నా ఉద్యోగ జీవితంలో తృప్తినిచ్చిన ఎన్నో సంఘటనలు ఉన్నాయి. ఏది ఏమైనా సేవలోనే తృప్తి, సంతోషం ఉన్నాయి. అందరూ బాగుండాలి. ఒక రోగి కోలుకుని వెళ్తున్నప్పుడు వాళ్ళ కళ్ళల్లో కనిపించే ఆనందం మాటల్లో చెప్పలేనిది.

- రాచకొండ పద్మావతి, హెడ్ నర్స్,
ఎంఎన్‌జె క్యాన్సర్ హాస్పిటల్, హైదరాబాద్

అమ్మ ప్రేమకు అవధుల్లేవు



అమ్మ అంటే అనురాగం, అనుబంధం, ఆత్మీయత. అన్నింటికీ మించి అమ్మంటే మనకు ముందుగా స్ఫురించేది ప్రేమ. నిస్వార్థ ప్రేమ ఆమె సొంతం. రెక్కలు ముక్కలు చేసుకొని బిడ్డల్ని పెంచి పెద్దచేస్తుంది. బుడిబుడి అడుగుల నుంచే నడతను, ఆ తర్వాత భవితను నిర్దేశిస్తుంది. చిన్న తప్పు చేసినా కడుపులో దాచుకుని కనికరిస్తుంది. బిడ్డ ఆకలి, బాధ, సుఖ, సంతోషాలు తల్లి మాత్రమే గ్రహించగలదు. బిడ్డ విజయాలు సాధించినప్పుడు అమ్మ ఆనందానికి అవధులుండవు. ఈ రోజు 'మాతృదినోత్సవం' సందర్భంగా ప్రముఖ బుల్లితెర నటి, కూచిపూడి కళాకారిణి జ్యోతిరెడ్డి అమ్మతో తన అనుబంధాన్ని మనతో ఇలా పంచుకున్నారు.

అమ్మ వెంకట రత్నం, నాన్న వెంకట సుబ్బారెడ్డి, బిఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగం చేసేవారు. మా స్వగ్రామం తెనాలి. నాన్న ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడిపోయారు. మేము ముగ్గురు ఆడ పిల్లలం. నేను అందరికంటే చిన్నదాన్ని. అమ్మకు నాట్యం అంటే చాలా ఇష్టం. నేను కడుపులో ఉన్నప్పుడు అమ్మ శోభా నాయుడు నాట్య ప్రదర్శనలు ఎక్కువగా చూసేవారట. నాకు ఆరేండ్లు ఉన్నప్పుడు నాట్య గురువు కృష్ణ కుమారి వద్ద నెల రోజులు కూచిపూడి నేర్చుకున్నాను. అప్పటి నుంచి ప్రోగ్రామ్స్ ఇవ్వడం మొదలు పెట్టాను.

ఏదైనా అమ్మతో చెప్పాల్సిందే

ఏ పని చేయాలన్నా, చీర, డ్రెస్ ఏది కొనుక్కోవాలన్న అమ్మతో చెప్పాల్సిందే. అమ్మ నన్ను ఒక డాన్సర్‌గా చూడాలని అనుకున్నారు. అయితే ఎవరి దగ్గర నేర్పించాలి అనే విషయంలో ఆవిడకు సరైన అవగాహన లేక పోయింది. నాకు చిన్నప్పుడు కాళ్ళ నొప్పులు ఉండేవి. అమ్మకు ఎవరో సలహా ఇచ్చారు ఫలానా చోట ఒకావిడ డాన్స్ నేర్పిస్తారు, మీ అమ్మాయికి డాన్స్ నేర్పించండి, కాళ్ళ నొప్పులు తగ్గిపోతాయి అని. అనుకోకుండా అమ్మ కోరిక అలా తీరింది. ఒక రోజు నాట్య ప్రదర్శన ఇస్తుండగా వేదాంత రాధేశ్యాం నా నాట్య ప్రదర్శన చూసి అమ్మతో మీ అమ్మాయికి కూచిపూడి నాట్యం నేర్పించండి, కళ అందరికీ రాదు అని. అలా గురువుల దగ్గర నేర్చుకుంటూ ప్రదర్శనలు ఇస్తూనే ఉన్నాను.

అమ్మతోనే అనుబంధం

అమ్మ కంటే మించిన హితులు, శ్రేయోభిలాషులు ఎవరుంటారు. కోప్పడినా, తిట్టినా, కొట్టినా అమ్మతోనే అనుబంధం. సుమారు 30 ఏండ్లుగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు కొన్ని వేల సంఖ్యలో ఇచ్చాను. ఒక రోజు త్యాగరాయ గాన సభలో ప్రదర్శన జరుగుతుండగా దేవదాసు కనకాల చూసి అమ్మతో దూరదర్శన్‌లో 'డామిట్ కథ అడ్డం



తిరిగింది' అనే సీరియల్ తీస్తున్నాను. అందులో మీ అమ్మాయి నటించడానికి అవకాశం ఇస్తాను పంపిస్తారా' అని అడిగారు. అమ్మ ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు. నేను ఈ రోజున ఇలా ఉన్నానంటే అమ్మ ప్రోత్సాహమే. నన్నూ, నా అవసరాలను దగ్గర ఉండి చూసుకునేవారు. నాకు పుట్టినరోజు, పండుగ రోజు అంటూ ఏమీ ఉండేవి కావు. ఎప్పుడు షూటింగ్స్, డాన్స్ అంతే. అమ్మ మాత్రం నా ఇష్టాలను గుర్తుపెట్టుకొని స్వయంగా వండి పెట్టేవారు.

నీ కంటూ ఓ జీవితం లేదు

'అమ్మా నీ పోస్టకి ప్రమోషన్ అంటూ లేదు. అప్పుడు నీ పిల్లలను చూసుకున్నావు, ఇప్పుడు నా పిల్లలను చూసుకుంటున్నావు. నీ కంటూ ఓ జీవితం లేదు' అని ఈ మధ్య అమ్మతో అంటే నవ్వేసి 'నా పిల్లలను, నా పిల్లల పిల్లలను చూసుకోవడంలో నాకెంతో సంతోషం, తృప్తి ఉన్నాయి. ఇంతకంటే నాకేం కావాలి' అంది. అమ్మా.. ఏమిచ్చి నీ రుణం తీర్చుకోగలను. ఈ రోజున నేను ఇలా ఉన్నాను అంటే నీ ప్రోద్బలంతోనే... ■



- పాలపర్తి సంధ్యారాణి

మతాల మధ్య బీజేపీ చిచ్చు

(మొదటిపేజి తరువాయి)

పారిశ్రామికవాడలోని అంబేద్కర్ సెంటర్ కార్నర్ మీటింగ్‌లో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. 'నీలం మధు, పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ రామ లక్ష్మణుల్లా కలిసి పని చేయండి.. మీ రాజకీయ భవిష్యత్‌కు మేం అండగా ఉంటాం' అని భరోసా ఇచ్చారు. మతాల మధ్య, మనుషుల మధ్య చిచ్చు పెట్టి కత్తులతో పొడుచుకునేలా బీజేపీ కుట్రలు చేస్తోందని విమర్శించారు. పటాన్‌చెరు ప్రాంతం ఒక మినీ ఇండియా అని, కులాలకు, మతాలకు అతీతంగా ఇక్కడి ప్రజలు కలిసి ఉంటారని అన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి నీలం మధు ఎంపీగా గెలవాలన్నారు. వైఎస్ హయాంలో మెదక్ అభివృద్ధి జరిగిందని, మళ్లీ ఇప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత తమదేనన్నారు. మొన్నటి వరకు బీఆర్ఎస్, బీజేపీ వాళ్లు ఎంపీలుగా ఉన్నా.. ఈ ప్రాంతానికి ఏం చేశారో ఒక్కసారి ఆలోచన చేసుకోవాలని సూచించారు. మెదక్ జిల్లా రైతులను ముంచి పోలీసులతో కొట్టించిన దుర్మార్గుడు బీఆర్ఎస్ అభ్యర్థి అని విమర్శించారు. వేల కోట్లు సంపాదించుకున్న ఆయన.. కేసీఆర్, హరీశ్‌కు వందల కోట్లు ఇచ్చి టికెట్ తెచ్చుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీగా కొనసాగుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి.. ఎంపీగా పోటీ చేస్తున్నారని, పెగ్గు మీద పెగ్గు వేసినట్టు కుర్చీ మీద కుర్చీ వేసుకుంటారా? అని ప్రశ్నించారు.

రాష్ట్రానికి వచ్చిన మోడీ, అమిత్ షా.. రాంచంద్రాపురం వరకు మెట్రో విస్తరణకు, మూసీ పరివాహక ప్రాంత అభివృద్ధికి నిధులు, బయ్యారం ఉక్కు కర్మాగారం గురించి ప్రస్తావిస్తారనుకున్నామని అన్నారు. ఇవేవీ ఇవ్వకుండా.. మతాల మధ్య కొట్లాట పెట్టాలని మోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ గెలవాలన్నారు. ఇందిరమ్మ గెలిచిన మెదక్ నుంచి నీలం మధును బరిలోకి దించామన్నారు. ఈ ప్రాంతానికి గోదావరి జలాలు రావాలన్నా, మెట్రో రైలు రావాలన్నా, మాదిగల వర్గీకరణ కేసు గెలవాలన్నా, ముదిరాజులు బీసీ-డీ గ్రూప్ నుంచి బీసీ-ఏలోకి మారాలన్నా నీలం మధును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈడీ, సీబీఐ, ఢిల్లీ పోలీస్, అదానీ, అంబానీలే ప్రధాని మోడీ పరివార్ అని, ఆ పరివార్‌ను ఓడించాలని కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి అన్నారు. జహీరాబాద్‌లో సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని కోరారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని తాండూరు సభలో సీఎం చెప్పారు. రైతు భరోసా వేస్తే కేసీఆర్ ముక్కు నేలకు రాస్తానని అన్నారని.. ఎప్పుడు రాస్తారో చెప్పాలని ప్రశ్నించారు.

నన్ను ఆశీర్వదించి గెలిపించండి..: మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధుముదిరాజ్

పార్లమెంట్ ఎన్నికలలో తనను ఆశీర్వదించి, గెలిపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ప్రజలను కోరారు. ఇందిరమ్మ ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంటు నుంచి పోటీ చేసే అవకాశం కాంగ్రెస్ అధిష్టానం తనకు కల్పించిందని అన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. తనను ఎంపీగా గెలిపిస్తే సీఎం రేవంత్ సహకారంతో, కేంద్రం నిధులతో పటాన్‌చెరు నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, టీఎస్‌ఐఐసీ చైర్మెన్ నిర్మల, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకునేందుకు 'ఇండియా'ను గెలిపించండి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకునేందుకు ఇండియా కూటమిని గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం వీడియో సందేశం ద్వారా రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'ఇవి రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న ఎన్నికలు. అంబేద్కర్ గొప్ప రాజ్యాంగాన్ని రాశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అంబేద్కర్ రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల వారు ఎదిగారు. రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ కుట్ర చేస్తోంది. రిజర్వేషన్ల రహిత దేశంగా మార్చాలని ప్రయత్నం చేస్తోంది. ప్రపంచ దేశాలతో పోటీ పడాల్సిన భారత్ బీజేపీ కుట్రలకు బలి అవుతోంది' అని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆలోచించి ఓటెయ్యాలి

(మొదటిపేజి తరువాయి)

పదేండ్ల బీజేపీ పాలనను చూసి ఆ పార్టీని చిత్తుగా ఓడిస్తారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన మోడీ సర్కార్‌ను ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యలు, ప్రజల పట్ల నిబద్ధతో పనిచేసే వారిని ఎన్నుకోవాలని కోరారు.

ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగాన్ని పెంచారని, రైతులకు మద్దతు ధర గ్యారంటీ చేస్తామని తెలిపి ఇప్పుడు మద్దతు ధర గ్యారంటీ చేయడానికి ససేమిరా అంటున్నారని తెలిపారు. ఈ పదేండ్లలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లో వ్యతిరేకత అసంతృప్తి పెరిగిందని, అందుకే బీజేపీని ప్రశ్నించేవారిపై, ప్రతిపక్షాలపై నిరంకుశ అణచివేత ధోరణి కొనసాగిస్తోం దని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని, రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్స్ ఎత్తేయాలని చూస్తోందని అన్నారు. భువనగిరి నియోజకవర్గంలో ప్రజాసమస్యలు తెలియని వారు డబ్బు సంచులతో పోటీలో నిలిచారని చెప్పారు. లౌకిక విలువల కోసం ప్రజాస్వామ్య విలువల కోసం నిబద్ధతతో నికరంగా నిలిచిన ఎర్రజెండాను గెలిపించాలని పిలుపునిచ్చారు.



ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకం : అభ్యర్థి జహంగీర్

13న జరిగే పార్లమెంట్ ఎన్నికలు చాలా ప్రతిష్టాత్మకమని భువనగిరి సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. ప్రజలంతా ఆచీతూచి ఓట్లు వేయాలని కోరారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై అవగాహన లేని వ్యక్తులు పోటీలో ఉన్నారన్నారు. ప్రజా సమస్యలపై పట్టింపులేని బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించాలని అన్నారు.

ఎన్నికల్లో డబ్బు, మందు, మతోన్మాద రాజకీయాలను ఓడించాలన్నారు. 13న జరిగే ఎన్నికల్లో సుత్తి కొడవలి నక్షత్రంపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్, కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, జగదీష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత, సీఐటీయూ రాష్ట్ర నాయకులు వంగూరి రాములు, శోభన్ నాయక్, నాయకులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, సిరిపంగి స్వామి, మాయ కృష్ణ, దయ్యాల నరసింహ, పగిళ్ల లింగారెడ్డి, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్లకే దేశ సంపద

(మొదటిపేజి తరువాయి)

ప్రసంగించారు. ఈ ప్రాంత ప్రజలు సోనియమ్మను సొంత కుటుంబ సభ్యురాలిగా కలుపుకొనిపోవడం, ఆప్యాయంగా పలకరించడం సంతోషంగా ఉందన్నారు. 'నా తల్లి సోనియాగాంధీని మీరు సోనియమ్మ అని పిలుస్తారు.. నేను మీ సోదరిని' అని అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు జవాబుదారీగా పని చేస్తారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు అందించడం లేదన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీతో సామాన్యుడి నడ్డి విరిగి పోయిందన్నారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఐఐఎం, మెడికల్ కాలేజీలు, నవోదయ లాంటి విద్యాసంస్థలను మంజూరు చేయలేదన్నారు. నిరుద్యోగం పెరిగిందన్నారు. బీజేపీ పాలనలో చిన్న, చిన్న వ్యాపారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దేశంలో మీడియా మోడీ చెప్పు చేతుల్లో ఉందని, మోడీకి కావాల్సిన వాటిని పెద్దపెద్దగా చూపిస్తున్నారని, వాస్తవాలు బయటకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై లైంగికదాడులు చేస్తున్న వారిని మోడీ ప్రభుత్వం వెనకేసుకొస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. దేశంలో మోడీకి, అమిత్ షాకి ఎన్నికలతో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఆర్ఆర్ సినిమా చూపించడం ఖాయమన్నారు. వ్యవసాయాధారిత పంటల ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గిస్తామన్నారు. ఈసారి ఇండియా కూటమికి పట్టం కట్టాలని కోరారు. 'రాజ్యాంగమే ప్రజలకు ఎన్నో అవకాశాలు కల్పించింది.. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేది రాజ్యాంగమే.. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని మరోసారి చాటి చెప్పాలి" అని పిలుపునిచ్చారు.

దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చాక రైతులకు సంబంధించిన ఎంఎస్‌పీ చట్టాన్ని అమలు చేస్తామని కామారెడ్డి సభలో ప్రియాంక గాంధీ చెప్పారు. ఉపాధి కూలీలకు రోజుకు 400 రూపాయలు వచ్చే విధంగా చూస్తామన్నారు. ప్రతి మహిళా అకౌంట్లో లక్ష రూపాయలు వేస్తామన్నారు. కాంగ్రెస్ గెలుపు తెలంగాణ నుండే మొదలైందన్నారు. " ఇక్కడి నుండే సందేశం ఇస్తున్నాను.. దేశాన్ని రక్షించుకుందాం.. మనమందరం కలిసి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందాం.." అని పిలుపునిచ్చారు. దేశంలో అన్ని మతాలు, కులాల వారు అన్నదమ్ముల్లా కలిసి ఉంటారని, అలాంటి వారి మధ్య బీజేపీ కొట్లాట పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా కుటుంబం దేశ ప్రజల కోసమే అని చెప్పారు. ఈ సభలకు వచ్చిన ప్రతి ఒక్కరూ మీకు ఎలాంటి నాయకుడు కావాలో ఆలోచించుకోవాలన్నారు. మీ గల్లీకి మీ ఊరికి.. మీ ఇంటికి వచ్చి.. మీ గురించి తెలుసుకునే వ్యక్తిని ఎంచుకోవాలన్నారు. ఈ సభల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, అభ్యర్థులు పాల్గొన్నారు.



సైలెన్స్..

(మొదటిపేజి తరువాయి)

కూడిన షాడో బృందాలు వెంటాడేలా ఈసీ ఏర్పాట్లు చేసింది. ఇన్ని రోజుల ఎన్నికల ప్రచారం ఒక ఎత్తు అయితే, చివరి రోజు ప్రయత్నాలు మరిన్ని ఫలితాలను ఇస్తాయని రాజకీయపార్టీలు భావిస్తున్నాయి. బస్తీలు, హెూటళ్లు, ఇతర ప్రాంతాల్లో మకాం వేసిన ఇతర నియోజకవర్గాల కార్యకర్తల్ని ఖాళీ చేయించే పనిలో పోలీసులు బిజీగా ఉన్నారు. ఎన్నికల సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం నుంచి ఫెలిసిటేషన్ సెంటర్లకు తరలివెళ్లాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఫలానా నియోజకవర్గంలో మీరు ఎన్నికల విధులకు హాజరుకావాలని మాత్రమే ఆదేశాలు ఇచ్చిన ఎన్నికల సంఘం, ఆదివారం వారికి ఏ బూత్‌లో విధులు కేటాయించిందీ వెల్లడిస్తుంది. కేవలం 24 గంటల ముందు మాత్రమే ఎన్నికల సిబ్బందికి తాము విధులు నిర్వహించాల్సిన బూత్ నెంబర్‌ను వెల్లడిస్తారు. ఫెలిసిటేషన్ సెంటర్ల నుంచి ఎన్నికల సామాగ్రి తీసుకొని, వారిని ఆర్టీసీ బస్సుల్లో ఆయా బూత్‌లకు తీసుకెళ్తారు. ఆదివారం రాత్రి ఎన్నికల సిబ్బంది అక్కడే ఉండాలి. సోమవారం ఉదయం 6 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 7 గంటల నుంచి ఓటర్లను అనుమతిస్తారు. సహజంగా ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. వేసవికాలం కావడంతో ఓటర్ల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సమయాన్ని పొడిగించారు. అయితే సమస్యాత్మక ప్రాంతాల్లో మాత్రం సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగుస్తుంది. ప్రతి పోలింగ్ బూత్‌లోనూ ఈవీఎమ్‌ల నిర్వహణ, మరమ్మత్తుల కోసం ఈసీఐఎల్‌కు చెందిన ఇంజినీర్లను ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచింది. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి రాష్ట్రంలో 144వ సెక్షన్ అమల్లోకి వచ్చింది. సోమవారం జరిగే పోలింగ్ బూత్‌ల వద్ద తప్ప, మరెక్కడా ప్రజలు గుమికూడరాదని ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో రహస్య బ్యాలెట్‌తో జరుగుతున్న ఎన్నికల్లో ఓటరు నాడి మాత్రం ఎవరికీ అంతుపట్టకుండా ఉండటం విశేషం! ఎగ్జిట్‌పోల్ అంచనాలను కూడా ఒక్కో సంస్థ ఒక్కో రకంగా నిర్వహిస్తుండటం గమనార్హం. అయితే దీనివల్ల మెజారిటీ ప్రజల అభిప్రాయం పాక్షికంగా వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే దేశంలో మరో మూడు దశల ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఎగ్జిట్‌పోల్స్‌పై ఎన్నికల సంఘం నిషేధం విధించింది. ఈనెల 13న పోలింగ్ జరిగితే, ఫలితాల కోసం జూన్ 4వ తేదీ వరకు వేచిచూడాల్సిందే!

కనీలాల్ మృతి పట్ల కేసీఆర్ సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ నాయక్ తండ్రి కనీలాల్ నాయక్ మరణం పట్ల ఆ పార్టీ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా, రత్యానాయక్ తండా సర్పంచిగా కనీలాల్ ప్రజలకు సేవలందించారని కొనియాడారు. ఆదివారం రత్యానాయక్ తండాకు వెళ్లి ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను కేసీఆర్ పరామర్శించనున్నారు

బాలికపై లైంగికదాడి

- **అదుపులో మహిళ సహా ముగ్గురు నిందితులు**

బైరెల్లి : ఓ బాలికపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం కాళ్ల చేతులు కట్టేసి రోడ్డు మీద విసిరేశారు. ఈ దారుణ సంఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బైరెల్లిలోని ఫరీద్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇద్దరు యువకులు బాలిక(15)పై లైంగికదాడికి పాల్పడ్డారు. అనంతరం అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాలిక కాళ్లు చేతులు కట్టేసి, ట్రాలీ కింద పడేట్టు రోడ్డుపైకి విసిరేశారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అపస్మారక స్థితిలో ఉన్న బాలికను ఆస్పత్రికి తరలించారు. కాగా బాధిత బాలిక గురువారం సాయంత్రం ఇంటి వద్ద అదృశ్యమైంది. ఓ మహిళ బాలిక గురించి ఫోన్‌లో అదే ప్రాంతానికి చెందిన యువకునితో మాట్లాడిన అనంతరం ఆ యువకుడు మరో వ్యక్తితో కలిసి బాలికను ఒంటరిగా మాట్లాడాలంటూ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. బాలిక కుటుంబసభ్యులు సదరు మహిళపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక స్పృహలోకి రాగానే కుటుంబ సభ్యులకు సంఘటన, నిందితుల తాలూకు వివరాలు వెల్లడించడంతో వారిని అరెస్టు చేసినట్టు పోలీసులు వెల్లడించారు.

మోడీ మాటల్లో నీతి.. రేవంత్ మాటల్లో రీతి లేవు

బీఆర్ఎస్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే యత్నం : సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



నవతెలంగాణ - సిద్దిపేట

మోడీ మాటలలో నీతి లేదు.. రేవంత్ రెడ్డి మాటలలో రీతి లేదని, ముఖ్యమంత్రి ఏనాడూ జై తెలంగాణ అనలేదని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో శనివారం సాయంత్రం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ సభలు ఆనాటి ఉద్యమ సభలను గుర్తుకు చేశాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ సభలకు ప్రజల నుంచి అంత ఆదరణ లేదన్నారు. అమిత్‌షా సిద్దిపేటలో సభ పెడితే ప్రజలు లేరని ఏడు నిమిషాలలో ముగించారని, రాహుల్ గాంధీ సభలో ప్రజలు లేకుంటే సీఎం స్వయంగా ప్రజలను రండి రండి అని పిలిచారని అన్నారు. కాంగ్రెస్ గ్యారంటీలను అమలు చేయనందుకు ప్రజలు తమ ఓటు ద్వారా ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మోడీ, రేవంత్ రెడ్డి ఉద్దెర మాటలు తమను ఉద్ధరించవని ప్రజలు భావిస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌ల అపవిత్ర బంధాన్ని చూసి ప్రజలు ఓట్ల రూపంలో తమ ఆగ్రహాన్ని చూపించబోతున్నారని తెలిపారు.

కేసీఆర్ హయాంలో పుట్టెడు వడ్లు పండిస్తే.. రేవంత్ రెడ్డి పుట్టెడు కష్టాలు తెచ్చాడని ఎద్దేవా చేశారు. వడ్ల కొనుగోలులో నేడు మూడు కిలోల తరుగు పెడుతున్నారని, రైతులు కూడా ఓట్లలో కాంగ్రెస్‌కు తరుగుపెడతారన్నారు. రెండు పార్టీలు బోగస్ సర్వేలతో బీఆర్ఎస్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. ఈ రెండు రోజులు బీఆర్ఎస్ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, సీ విజిల్ యాప్ ద్వారా కాంగ్రెస్, బీజేపీ అవినీతి పనులపై ఫిర్యాదు చేయాలని సూచించారు. కేసీఆర్ గ్యారంటీ తెలంగాణ ప్రజలకు శ్రీరామ రక్ష అన్నారు. పటాన్‌చెరులో కాంగ్రెస్ గెలిచి ఉంటే నిధులు వచ్చేవని రేవంత్ రెడ్డి అంటున్నారని, మెదక్, నారాయణఖేడ్‌లో మీరే గెలిచారు కదా ఎందుకు నిధులు ఇవ్వలేదని ప్రశ్నించారు. పటాన్‌చెరుకు కేసీఆర్ ఇచ్చిన నిధులను వెనక్కి తీసుకున్నారన్నారు. రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి మంత్రి పదవులలో, ఎమ్మెల్యే, ఎంపీ సీట్లలో ఎందుకు రిజర్వేషన్ పాటించలేదని ప్రశ్నించారు.

ఎమ్మెల్సీగా ఉన్న వెంకట్రామిరెడ్డికి ఎందుకు ఎంపీ టికెట్ ఇచ్చారని ప్రశ్నిస్తున్న రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీగా ఉన్న జీవన్ రెడ్డికి ఎందుకు ఎంపీ టికెట్ ఇచ్చారని, ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్‌ను ఎంపీ టికెట్ ఇచ్చి ఎందుకు పోటీ చేయిస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పూటకో మాట.. మాటల్లో విశ్వసనీయత లేదన్నారు. వెంకట్రామిరెడ్డి కరీంనగర్ నుంచి వచ్చి ఇక్కడ పోటీ చేస్తున్నాడని అంటున్న సీఎం, అచ్చంపేట నుంచి వచ్చిన నీవు కొడంగల్, మల్కాజిగిరి, కామారెడ్డిలలో పోటీ చేయలేదా అని ప్రశ్నించారు. ఐదు నెలల పాలనలో రాష్ట్రాన్ని ఐదు సంవత్సరాల వెనక్కి తీసుకుపోయారని విమర్శించారు. ఫేక్ వీడియోలను వదలడానికి బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు సిద్ధమయ్యారని, ఆ వీడియోలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. 22 సంవత్సరాలు ఈ ప్రాంతంతో సంబంధం ఉన్న వెంకట్రామి రెడ్డిని గెలిపించుకోవాలని, డబుల్ ఇంజిన్ ఎమ్మెల్యేగా తాను, ఎంపీగా వెంకట్రామిరెడ్డి పని చేసి అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు ఫారుఖ్ హుస్సేన్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గుండు భూపేష్, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, మోహన్ లాల్,దరిపల్లి శ్రీనుఉన్నారు.



అప్పులమయంగా తెలంగాణ

- అభివృద్ధికి ఎంతో కృషి
- ఇక్కడ కనీసం పది సీట్లు గెలుస్తాం
- ఇంకా ఎంఐఎం చేతుల్లోనే స్టీరింగ్ :కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులమయంగా మార్చిందనీ, కాంగ్రెస్ ప్రభుత్వమూ అప్పులు చేస్తూ పోతున్నదని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కనీసం పది స్థానాల్లో గెలువబోతున్నామనీ, కేంద్రంలో 400 సీట్లతో మళ్లీ మోడీ ప్రభుత్వమే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అవినీతి, కుటుంబ పార్టీలతో కూడిన ఇండియా కూటమి ఓటమి ఖాయమ న్నారు. పదేండ్లలో దేశాభివృద్ధి కోసం మోడీ ఎంతో పాటుపడ్డారనీ, టెర్రరిజాన్ని, నక్సలిజాన్ని నివారించగలిగారని వివరించారు. డిజిటల్ ఇండియా గ్రోత్ బాగుందన్నారు. తాము చెప్పినట్టుగానే ఆర్టికల్ 370, త్రిబుల్ తలాక్ రద్దు చేశామనీ, రామమందిరం నిర్మించామని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలతో తెలంగాణలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించడం లేదని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టారు. ఇక్కడ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేశామనీ, రామగుండం ఫర్టిలైజర్ ఫ్యాక్టరీని ప్రారంభించామనీ, రోడ్లు, రైళ్లు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి నిధులు కేటాయించామని వివరించారు. సీఏఏ తేవడం, ఆర్టికల్ 370 రద్దు, సర్జికల్ స్ట్రయిక్ కాంగ్రెస్‌కు ఏమాత్రం ఇష్టం లేదని విమర్శించారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ ఆర్టికల్ 370 పునరుద్ధరిస్తుందన్నారు. యూపీఏకు అవినీతి కాంగ్రెస్ నేతృత్వం వహిస్తోందనీ, ఎన్నికలు అయిపోగానే రాహుల్‌గాంధీ బ్యాంకాక్, థాయిలాండ్ పోతారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లలో కోతపెట్టి ముస్లిం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని విమర్శించారు. తాము వాటిని రద్దు చేస్తామన్నారు. కేంద్రంలో మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వం వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తామని తాను అన్నట్టు వీడియోను మార్ఫింగ్ చేసి కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేయడాన్ని ఖండించారు. పదేండ్లు కేంద్రంలో అధికారంలో ఉన్నామనీ, ఎక్కడైనా రిజర్వేషన్లకు కోత పెట్టామా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. సోనియాగాంధీ పుట్టిన రోజు అయిపోయింది కదా.. రైతులకు చేస్తామన్న రూ.2 లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్, విద్యార్థుల చదువుల కోసం రూ.5 లక్షల సహాయం, విద్యార్థునులకు స్కూటీలు, మండలానికో ఇంటర్నేషనల్ స్కూలు ఏర్పాటు హామీలు ఏమయ్యాయని నిలదీశారు. రేవంత్‌రెడ్డి తెలంగాణను కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మార్చారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ సర్కారొచ్చినా ప్రభుత్వ స్టీరింగ్ మాత్రం ఎంఐఎం చేతుల్లోనే ఉందని ఆరోపించారు. దేశ భవిష్యత్తు కోసం మోడీ ప్రభుత్వాన్ని మరోమారు గెలిపించాలని కోరారు. మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, అధికార ప్రతినిధి ఎన్వీ. సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి 12 సీట్లిస్తే రాష్ట్ర రాజకీయాలను శాసిస్తాం..

కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపించింది

- పదేండ్ల బీజేపీ పాలనలో ధరలు రెట్టింపు :చెన్నూర్‌లో మాజీ మంత్రి కేటీఆర్




నవతెలంగాణ-జైపూర్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను 10 నుంచి 12 స్థానాల్లో గెలిపిస్తే వచ్చే ఆరు నెలల్లో రాష్ట్ర రాజకీయాలను శాసిస్తా మని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్లతారక రామారావు అన్నారు.మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శని వారం ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో కేటీఆర్ మాట్లాడారు.కాంగ్రెస్, బీజేపీలే లక్ష్యంగా విమర్శలు గుప్పించారు.గని కార్మిక కుటుంబం నుంచి వచ్చిన కొప్పుల ఈశ్వర్ కావాలా.. కోటీశ్వరుడైన గడ్డం వంశీకృష్ణ కావాలో నియోజకవర్గ ప్రజలు ఆలోచించుకుని ఓటేయాలని కోరారు. మోసపూరిత వాగ్దానాలు,హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు మొండిచేయి చూపిస్తోందని విమర్శించారు.అధికారం లోకి వచ్చిన వెంటనే రైతుబంధు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి.. ఓట్ల సమయంలో గుర్తొచ్చిందని అన్నారు.చెన్నూర్ నియోజక వర్గంలో ఏడున్నర దశాబ్దాల్లో జరగని అభివృద్ధి కేసీఆర్ ప్రభుత్వంలో పదేండ్లలో చేసి చూపించిన బాల్క సుమన్ నిబద్ధతగల నాయకుడని కితాబిచ్చారు.లక్ష ఎకరాలకు సాగు నీరందించే చెన్నూర్ ఎత్తి పోతల పథకాన్ని ఎమ్మెల్యే వివేక్ పక్కన పెట్టేశా రన్నారు.అభివృద్ధిని పక్కన పెట్టి కొడుకు ను ఎంపీగా గెలిపించాలని ఉబలాట పడుతున్నారని విమర్శించారు.

దేశంలో పదేండ్ల బీజేపీ ప్రభుత్వ పాలన కాకులను కొట్టి గద్దలకు వేసినట్టుందని అన్నారు.ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసినా.. బీజేపీకి ఓటేసినా సింగరేణి సంస్థ ను అదానీ, అంబానీకి కట్టబెడతారని అన్నారు.మోడీ పాలనలో రేట్లు రెట్టింపు చేశారని,పెట్రోల్,డీజిల్, గ్యాస్,పప్పు,ఉప్పు ప్రతి వస్తువు ధరా పెంచారని వివరించారు పెట్రోల్, డీజిల్‌పై అదనంగా 34 శాతం పన్ను విధించడంతో వచ్చిన రూ.30 లక్షల కోట్ల నుంచి రూ.15లక్షల కోట్లు అదానీ, అంబానీకి రుణమాఫీ చేసిన ఘనుడు ప్రధాని మోడీ అని విమర్శించారు.పార్లమెంట్ ఎన్నికల్లో చెయ్యి, పువ్వుకు కాకుండా కారు గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పాల్గొన్నారు.

నవచిత్రం

కాండ్రకోట మిస్టరీ ఏంటి?



వరుణ్ సందేశ్

వరుణ్ సందేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'నింద'. యదార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రాజేష్ జగన్నాథం నిర్మించడమే కాకుండా కథ, కథనాన్ని రాసి దర్శకత్వం వహిస్తున్నారు.

ది ఫర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మించిన ఈ మూవీ టైటిల్ లోగో, పోస్టర్ అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. కాండ్రకోట మిస్టరీ అనే క్యాప్షన్‌తో ఈ చిత్రం రాబోతోంది. తాజాగా వరుణ్ సందేశ్ పాత్రకు సంబం ధించిన పోస్టర్‌ను రిలీజ్ చేశారు. భిన్నంగా ఉన్న ఈ పోస్టర్‌తోనే అందరిలోనూ ఆసక్తిని రేకెత్తించారు. ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ అయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈనెల 15న టీజర్‌ను కూడా మేకర్స్ విడుదల చేయబోతున్నారు. ఆనీ, తనికెళ్ల భరణి, భద్రం, సూర్య కుమార్, ఛత్రపతి శేఖర్, మైమ్ మధు, సిద్దార్థ్ గొల్లపూడి, అరుణ్ దలై, శ్రేయా రాణి రెడ్డి, క్యూ మధు, శ్రీరామ్ సిద్దార్థ్ కృష్ణ, రాజ్ కుమార్ కుర్రా, దుర్గా అభిషేక్ తదితరులు ఈ చిత్రంలోని ప్రధాన తారాగణం.

యువత రాజకీయాల్లోకి రావాలి

సముద్ర మూవీస్ బ్యానర్ నుండి 'రామ జన్మభూమి' టీజర్ రిలీజ్ అయ్యింది, యువత రాజకీయాలలోకి రావాలి అనే కాన్సెప్ట్‌లో వచ్చిన ఈ టీజర్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. వి. సముద్ర ఈ చిత్రానికి దర్శకుడు, నిర్మాత. కథకి తగ్గట్టుగా రవి శంకర్ మంచి మ్యూజిక్‌ని అందించారు.


డైరెక్టర్ సముద్ర మాట్లాడుతూ,'ప్రతి గ్రామంలో రామాలయం ఉంటుంది. దేవుడే రాముడిగా వచ్చినా మానవుడిగా ధర్మ బద్దంగా బతికారు, ఒక దేశానికి రాజుగా, ఒక తండ్రికి మంచి బిడ్డగా, తమ్ముళ్ళకి అన్నగా ఇలా ధర్మ బద్ధంగా బతికి మనకి చూపించారు. ప్రతి పౌరుడు రాముడిలా బ్రతకాలి, ధర్మంగా మెలగాలని, రాజకీయాలలోకి యువత కచ్చితంగా రావాలి అనే సందేశంతో ఈ సినిమా చేస్తున్నాను' అని చెప్పారు.

'సింహరాశి, శివ రామరాజు, టైగర్ హరిశ్చంద్ర ప్రసాద్, సేవకుడు, పంచాక్షరీ, మహానంది' లాంటి గొప్ప సినిమాలని అందించిన వి.సముద్ర దర్శకత్వంలో ఈ సినిమాతో నేను హీరోగా లాంచ్ అవ్వడం చాలా ఆనందంగా ఉంది' అని హీరో జై సిద్ధార్థ్ అన్నారు.



జై సిద్ధార్థ్, బి.గోపాల్, వి.సముద్ర

భిన్న కాన్సెప్ట్‌తో శివం భజే



అశ్విన్ బాబు

అశ్విన్ బాబు హీరోగా గంగా ఎంటర్టైన్మెంట్స్ మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్న చిత్రం 'శివం భజే'. అప్సర్ దర్శకుడు. ఇటీవల విడుదలైన టైటిల్ 'శివం భజే' అందరి దృష్టిని ఆకర్షించగా, శుక్రవారం చిత్రం నుండి హీరో అశ్విన్ బాబు ఫస్ట్ లుక్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ,'ఒక వైవిధ్యమైన కథ, కథనాలతో రూపొందుతున్న న్యూ ఏజ్ సినిమా ఇది. అర్బాజ్ ఖాన్, సాయి ధీనా, హైపర్ ఆది, మురళీ శర్మ, బ్రహ్మాజీ, తులసి లాంటి నటులు మా చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించారు. దాశరథి శివేంద్ర అదిరిపోయే విజువల్స్ అందించారు. ఇటీవల షూటింగ్ పూర్తవడంతో నిర్మాణాంతర కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి.

ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా జూన్‌లో విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాం' అని తెలిపారు. 'మా టైటిల్‌కి మించిన స్పందన ఫస్ట్ లుక్‌కి రావడం చాలా సంతోషంగా ఉంది. అందరి సహకారంతో అంచనాలకి మించి చిత్రం రూపొందింది. ఇది తప్పకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని దర్శకుడు అప్సర్ చెప్పారు.



ఆరంభానికి విశేష ప్రేక్షకాదరణ

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కళ్యాణ్, రవీంద్ర విజయ్ కీలక పాత్రల్లో నటించిన సినిమా 'ఆరంభం'. ఈ సినిమాను ఏవీటీ ఎంటర్ టైన్‌మెంట్ బ్యానర్ పై అభిషేక్ వీటీ నిర్మించారు.

అజయ్ నాగ్ వి దర్శకత్వం వహించారు. ఎమోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా విడుదలైన అన్ని చోట్ల నుంచి మంచి టాక్ తెచ్చుకుంది.

ఈ నేపథ్యంలో శనివారం ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించిన సినిమా సక్సెస్ మీట్‌లో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ వినయ్ రెడ్డి మామిడి మాట్లాడుతూ,'చూసిన వాళ్లంతా మూవీలో ఎమోషన్ బాగుంది, డ్రామా బాగుందని చెబుతున్నారు' అని తెలిపారు. 'నిన సాయంత్రం థియేటర్స్ నుంచి మంచి ఫీడ్ బ్యాక్ వచ్చింది' అని నిర్మాత అభిషేక్ వీటీ చెప్పారు. దర్శకుడు అజయ్ నాగ్ వి మాట్లాడుతూ, 'థియేటర్‌లో క్లైమాక్స్‌కు స్టాండింగ్ ఒవేషన్ వస్తోంది. మౌత్ టాక్‌తో పాటు కలెక్షన్స్ ఇంప్రూవ్ అవుతున్నాయి.

ఆటలు

ఐపీఎల్‌లో నేడు

చెన్నై X రాజస్థాన్
వేదిక: చెన్నై,సమయం :మ॥3.30
బెంగళూర్ X ఢిల్లీ
వేదిక : కోల్‌కత, సమయం : రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..



ప్లే ఆఫ్స్‌లో కోల్‌కత

- ముంబయిపై నైట్‌రైడర్స్ గెలుపు
- కోల్‌కత 157/7, ముంబయి 139/8



నవతెలంగాణ-కోల్‌కత

ఐపీఎల్ 17వ సీజన్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్ దర్జాగా ప్లే ఆఫ్స్‌లో అడుగు పెట్టింది. శనివారం ఈడెన్‌గార్డెన్స్‌లో ముంబయి ఇండియన్స్‌ను చిత్తు చేసిన నైట్‌రైడర్స్ సీజన్లో తొమ్మిదో విజయంతో దర్జాగా ప్లే ఆఫ్స్‌లో కాలుమోపింది. 158 పరుగుల ఛేదనలో ముంబయి ఇండియన్స్ చతికిల పడింది. 16 ఓవర్లలో 8 వికెట్లకు 139 పరుగులే చేసింది. ఓపెనర్లు ఇషాన్ కిషన్ (40, 22 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు), రోహిత్ శర్మ (19), తిలక్ వర్మ (32, 17 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించినా.. సూర్యకుమార్ యాదవ్ (11), హార్దిక్ పాండ్య (2), టిమ్ డెవిడ్ (0), నేహల్ వదేరా (3) విఫలమయ్యారు. దీంతో ముంబయి ఇండియన్స్ 18 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. అంతకుముందు, ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో ఈడెన్‌గార్డెన్స్‌లో మ్యాచ్ ఆలస్యంగా ఆరంభమైంది. సుమారు రెండు గంటలు ఆలస్యం కావటంతో ఇన్నింగ్స్‌లో నాలుగు ఓవర్లకు కోత పడింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆతిథ్య కోల్‌కత 157 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (6), సునీల్ నరైన్ (0) సహా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (7) విఫలమయ్యారు. వెంకటేశ్ అయ్యర్ (42, 21 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు), నితీశ్ రానా (33, 23 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) కీలక భాగస్వామ్యంతో నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. ఆండ్రీ రసెల్ (24, 14 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు), రింకూ సింగ్ (20, 12 బంతుల్లో 2 సిక్సులు), రమన్‌దీప్ సింగ్ (17 నాటౌట్) ఆఖర్లో విలువైన పరుగులు జోడించారు. 16 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి కోల్‌కత నైట్‌రైడర్స్ 157 పరుగులు చేసింది.

పంత్‌పై వేటు

ఆర్సీబీతో మ్యాచ్‌కు దూరం



ముంబయి : ఓ వైపు ఐపీఎల్ 17వ సీజన్ ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరంగా సాగుతుండగా ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌పై వేటు పడింది. ఈ సీజన్లో మూడు మ్యాచుల్లో స్లో ఓవర్‌రేట్ కారణంగా పంత్ జరిమానాకు గురయ్యాడు. రాజస్థాన్‌తో గత మ్యాచ్‌లోనూ స్లో ఓవర్ రేట్‌తో పంత్‌పై మ్యాచ్ రిఫరీ జరిమానా విధించాడు. మూడు సార్లు స్లో ఓవర్‌రేట్‌కు గురైతే కెప్టెన్‌పై ఓ మ్యాచ్ నిషేధం విధిస్తారు. దీనిపై ఢిల్లీ క్యాపిటల్స్ అప్పీల్‌కు వెళ్లినా మ్యాచ్ రిఫరీ నిర్ణయాన్నే బీసీసీఐ అంబుడ్స్‌మన్ సమర్థించాడు. దీంతో నేడు చిన్నస్వామిలో ఆర్సీబీతో మ్యాచ్‌లో క్యాపిటల్స్‌కు అక్షర్ పటేల్ సారథ్యం వహించనున్నాడు.

బ్రిజ్‌భూషణ్‌పై విచారణ

అభియోగాల నమోదుకు కోర్టు ఆదేశం



నవతెలంగాణ-న్యూఢిల్లీ

భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక ఆరోపణల అంశంలో విచారణ ఎదుర్కొనున్నాడు. ఈ మేరకు న్యూఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ (ఏసీఎంఎం) ప్రియాంక రాజ్‌పుత్ ఆదేశాలు జారీ చేశారు. ఐపీసీ సెక్షన్ 506(1), 354, 354(ఏ) ప్రకారం బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా అభియోగాలు నమోదు చేసేందుకు సరిపోయే ఆధారాలు ఉన్నాయని న్యాయస్థానం గుర్తించిందని న్యాయమూర్తి తెలిపారు. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక ఆరోపణల అంశంలో అభియోగాల నమోదు, విచారణపై న్యాయస్థానం పూర్తి తీర్పు కాపీలు రావాల్సి ఉంది.

ఆధారాలు ఉన్నాయి : బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై అభియోగాల నమోదుకు అవసరమైన ఆధారాలు ఉన్నాయని ఓపెన్ కోర్టులో న్యాయమూర్తి తెలిపారు. అవుట్రేజింగ్ ది మోడెస్టీ ఆఫ్ ఏ ఉమెన్ (సెక్షన్ 354), లైంగిక వేధింపులు (సెక్షన్ 354 (ఏ)) సహా క్రిమినల్ ఇంటిమిడేషన్ (సెక్షన్ 506(1)) ఆరోపణల్లో బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై శిక్షార్హమైన అభియోగాలు నమోదు చేయనున్నారు. సెక్షన్ 354, 354(ఏ) కింద ఐదుగురు మహిళా రెజ్లర్లను వేధించినట్టు ఆధారాలు ఉండగా.. సెక్షన్ 506(1) ప్రకారం ఇద్దరు రెజ్లర్లపై వేధింపులకు దిగినట్టు ప్రాథమికంగా న్యాయస్థానం గుర్తించింది. సస్పెన్షన్‌కు గురైన భారత రెజ్లింగ్ సమాఖ్య సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌పై సెక్షన్ 506(1) కింద అభియోగాలు నమోదు చేయనున్నారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు సహకరించిన ఆరోపణల నుంచి వినోద్ తోమర్‌కు న్యాయస్థానం ఉపశమనం కలిగించింది.



న్యాయం దిశగా.. : బిజెపి నాయకుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై సుదీర్ఘ పోరాటం న్యాయస్థానం చొరవతో బాధిత మహిళా రెజ్లర్లకు న్యాయం అందించే దిశగా సాగుతుందని మల్లయోధులు భావిస్తున్నారు. '18 నెలల న్యాయ పోరాటంలో ఇది పెద్ద మైలురాయి. 2023 జనవరిలో వీధుల్లో మొదలైన పోరాటం.. ఇప్పుడు న్యాయస్థానంలో ముగిసింది. న్యాయ వ్యవస్థపై పూర్తి నమ్మకం ఉంది. పారదర్శక, న్యాయమైన విచారణ జరిపి మహిళా రెజ్లర్లకు న్యాయం చేస్తారని ఎదురుచూస్తున్నాను' అని సాక్షి మాలిక్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. భారత అగ్రశ్రేణి రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్‌లు న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నెలల పాటు ఆందోళన చేపట్టగా.. మే 2023లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 1,000 పేజీలతో చార్జ్‌షీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టుకు సమర్పించారు. అభియోగాల నమోదుకు ఆదేశాలు జారీ చేస్తున్న సమయంలో న్యాయస్థానంలో ఉన్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్.. 'ఆరోపణలు అన్నీ అబద్ధాలు, ప్రేరేపితం' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బీజేపీ విధానాలతో బీడీ పరిశ్రమ కుదేలు



గొడ్డుబర్ల భాస్కర్
9849934514



దేశంలో పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్నాయి. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పార్టీ బీజేపీ. మూడోసారి అధికారంలోకి రావాలని కుయుక్తులు పన్నుతున్నది. మోడీ ఈ పదేండ్ల పాలనలో కుదేలైన రంగాల్లో బీడీ పరిశ్రమ ఒకటి. అందులో పనిచేసే వారికి గ్రాట్యూటీ, పిఎఫ్, ఈఎస్ఐ, వంటి చట్టబద్ధ సౌకర్యాలున్నా అమలు నోచని పరిస్థితి. బీడీ పరిశ్రమలో కార్మికులకు నేడు పని లేదు. ఏ కార్ఖానాలో పని దినాలు ఏ రకంగా ఉంటాయో తెలియదు. అంటే నెలలో ఎన్ని రోజుల పని ఉంటుందనేది అంచనాకు రాలేము. ఉన్ననాడే పని లేని నాడు పస్తులే అన్నట్టు ఉంటుంది బీడీ కుటుంబాల పరిస్థితి. అంతే కాదు వారికి ఆకు సమస్య, తంబాకు సమస్య వంటివి కోకొల్లలు. వీటి గురించి పట్టించుకునే వారెవ్వరూ లేరు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ పరిశ్రమలో ఉపాధిలేమి విలయతాండవం చేస్తున్నది. కేంద్రంలో బీజేపీ తీసుకుంటున్న నిర్ణయాలతో ఏ కార్ఖానా ఎప్పుడు మూతపడుతుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొన్నది.

దేశం మొత్తంలో కోటిన్నరమంది బీడీ పరిశ్రమ ఆధారంగా జీవిస్తున్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విధించిన ఆంక్షలతో పరిశ్రమలు కునారిల్లుతున్నవి. బీడీ కట్టలపై డేంజర్ గుర్తులు పెట్టాలని సర్కార్ శాసిస్తున్నది. కంపెనీ పేరు కనబడకుండా డేంజర్ గుర్తులే ప్రధానంగా ఉండాలని చెబుతున్నది. ప్రతి ఏడాది ఈ డేంజర్ గుర్తులు మారుతుంటాయి. ఏ గుర్తు వస్తుందో తెలియదు. శాశ్వతమైన ట్రేడ్ మార్కు కనబడకుండా, కంపెనీ పేరు కనబడకుండా డేంజర్ గుర్తు మాత్రమే ప్రధానంగా కనబడడం వల్ల మార్కెట్ తగ్గుతుందనేది వాస్తవం. దీనికి తోడు బీడీ పరిశ్రమ ముడిసరుకు పైన, బీడీ ఉత్పత్తులపైన జీఎస్టీ 28 శాతం నేటి కేంద్రసర్కార్ అమలు చేస్తున్నది. వెయ్యి బీడీలు వెయ్యి రూపాయలకు మార్కెట్లో అమ్మితే అందులో నుండి రూ.280 జీఎస్టీ కింద చెల్లించవలసిందే. అంటే కష్టపడి బీడీలు చేసే బీడీ కార్మికుల కూలి కన్నా తక్కువేమీ కాదు. వసూలు చేసుకున్న పన్ను నుండి బీడీ పరిశ్రమ కోసం గానీ, వారి సంక్షేమానికి గానీ ఖర్చుపెట్టేది శూన్యం.

కార్మికుల పోరాటాల ద్వారా సాధించుకున్న బీడీ, చుట్ట కార్మికుల చట్టం-1966తో పాటు 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చింది మోడీ ప్రభుత్వం. ఈ లేబర్‌కోడ్‌లు కార్మికులకు ఊపిరాడకుండా చేస్తున్నది. అధిక పనిగంటలతో అవస్తల పాలు చేస్తున్నది. బీడీలు తాగితే అనారోగ్యం కదా! కాబట్టి బీడీ పరిశ్రమపైన ఆంక్షలు విధించడమేమిటి? నిషేధమే సరైనదని కూడా వాదించే వారు కూడా అధికమే. ఆరోగ్యమే మహాభాగ్యం. ఎంతటి వారికైనా ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రధానంగా ఉంటుంది. బీడీలు తాగిన వెంటనే చనిపోయినది ఎంతమంది? ఎవరూ లేరు. బీడీ కన్నా మద్యం,గుట్కా ,పాన్ పరాగ్,డ్రగ్స్ వంటివి చాలా ప్రమాదం కదా! వాటిని ఎందుకు మూసివేయించరు? పర్యావరణం దెబ్బతింటుందని భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, పంటలు దెబ్బతింటున్నాయని పలుచోట్ల కొన్ని ఫ్యాక్టరీలను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్నారు. అనుమతులిచ్చేది సర్కారే. మరి వీరంతా పాలకులను ఎందుకు నిలదీస్తలేరు?

అనేక ప్రాంతాలలో చేనేత పరిశ్రమ దెబ్బతిన్నప్పుడు బీడీ పరిశ్రమ ఆదుకున్నది. వ్యవసాయంలో కూడా

> **కార్మికుల పోరాటాల ద్వారా సాధించుకున్న బీడీ, చుట్ట కార్మికుల చట్టం-1966తో పాటు 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చింది మోడీ ప్రభుత్వం. ఈ లేబర్‌కోడ్‌లు కార్మికులకు ఊపిరాడకుండా చేస్తున్నది. అధిక పనిగంటలతో అవస్తల పాలు చేస్తున్నది. బీడీలు తాగితే అనారోగ్యం కదా! కాబట్టి బీడీ పరిశ్రమపైన ఆంక్షలు విధించడమేమిటి? నిషేధమే సరైనదని కూడా వాదించే వారు కూడా అధికమే. ఆరోగ్యమే మహాభాగ్యం. ఎంతటి వారికైనా ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రధానంగా ఉంటుంది. బీడీలు తాగిన వెంటనే చనిపోయినది ఎంతమంది? ఎవరూ లేరు. బీడీ కన్నా మద్యం,గుట్కా,పాన్ పరాగ్,డ్రగ్స్ వంటివి చాలా ప్రమాదం కదా! వాటిని ఎందుకు మూసివేయించరు?**

ఎగుడుదిగుడులు వచ్చి,పని చేయగలిగిన ప్రతి ఒక్కరికి అవకాశం ఇచ్చింది. ఆ విధంగా సుమారు కోటిన్నర మంది భారతీయులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా పని కల్పించిందీ బీడీ పరిశ్రమ. మన సర్కారు వేలకోట్ల రూపాయల పెట్టుబడి పెడుతున్నామని చెబుతున్నా వందల్లో కూడా ఉద్యోగాలు దొరకడం కష్టంగా ఉన్నది. ఒక్క రూపాయి కూడా ప్రభుత్వపరంగా కేటాయించలేదు. అయినప్పటికీ, యజమానులు పరిశ్రమలో పనిచేస్తున్న వారందరూ సమన్వయంతో పనిచేయడం వల్ల లక్షల మందికి ఉపాధి దొరుకుతున్నది. ఇంతమందిని ఇముడ్చుకున్న బీడీ పరిశ్రమను కాపాడుకోవలసిన బాధ్యత సర్కారుదా? కాదా? ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన కనీస బాధ్యతను విస్మరించి, నేడున్న అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు బీడీ పరిశ్రమపై శీతకన్ను వేసింది. డేంజర్ గుర్తుపెట్టాలని దాడి చేయడంతో పాటు 28శాతం జీఎస్టీని విధించింది.ఆ కారణంగానే బీడీ పరిశ్రమ సంక్షోభానికి గురై క్రమేణా క్షీణిస్తూ పోతున్నది. పరోక్షంగా కార్మికులను ఉపాధికి దూరం చేస్తున్నది.

'కొట్పా' చట్టం తీసుకొస్తూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనేక ఆంక్షలు జోడించింది. వీటివలన బీడీకట్టపై డేంజర్ సింబల్ ముద్రించాలని, అమ్మకం ప్రాంతాల్లో కూడా అనేక రకమైన ఆంక్షలు విధించడం వలన నేడు బీడీ పరిశ్రమ మార్కెట్ దెబ్బతిని అంతిమంగా బీడీ కార్మికులకు నెలలో పని దినాలు తగ్గుతూ కార్మిక కుటుంబాలకు ఆర్థిక నష్టం జరుగుతున్నది. అలాగే కార్మికులు 50 ఏండ్లు వచ్చే వరకు అనేక రకాల ఆరోగ్య సమస్యలను లెక్కచేయకుండా బీడీలు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. రిటైర్మెంట్ అనంతరమైన తను జీవించడానికి సరిపడా పెన్షన్లు అందించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. అనేక సంవత్సరాలుగా బీడీ కార్మికులకు రిటైర్మెంట్ పెన్షన్ పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కనీసం నెలకు పదివేల రూపాయలు కూడా అందడం లేదు. దీనిపై పోరాడుతున్నా పట్టించుకునే దిక్కులేదు.

గతంలో బీడీ కార్మిక కుటుంబాలలో ప్రాథమికవిద్య నుంచి ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఉపకార వేతనాలు అందేవి. వీటిని పూర్తిగా ఎత్తేశారు. కార్మికులు సొంతిల్లు నిర్మించుకుంటే గతంలో కేంద్ర కార్మిక సంక్షేమ శాఖ నుండి రుణాలు అందేవి. అవి కూడా నిలిపివేశారు. బీడీ కార్మికులకు డిస్పెన్సరీ హాస్పిటల్స్ ద్వారా సంచార వాహనం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందించేవారు. పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఈ విధంగా బీడీ కార్మిక కుటుంబాలను అన్ని విధాలుగా కేంద్రం మోసం చేసింది.ఈ నేపథ్యంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక, ప్రజా వ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించి, లౌకికతత్వాన్ని నెలకొల్పే 'ఇండియా' కూటమిని గెలిపించాలి. ■

ఆది గురువు అమ్మే...



పాకాల శంకర్‌గౌడ్
9848377734

'మాతృత్వం కంటే గొప్ప హీరోయిజాన్ని నేను ఊహించలేను' అంటాడు లాన్స్ కాన్రాడ్. ఎందుకంటే సృష్టికి మూలం అమ్మ. ఆమె లేకపోతే లేదీ జన్మ. కనిపించని దేవుళ్ల కన్నా మనల్ని కనీ పెంచిన అమ్మే మన ప్రత్యక్ష దైవం.ప్రతి వ్యక్తి జీవి తంలో తల్లి అత్యంత ప్రభావశీలమైన వ్యక్తి. బిడ్డ సమగ్రాభివృద్ధిలో అమ్మే కీలకం.అమ్మ అనే పదంలోనే ఆత్మీయత, అనురాగం, ప్రేమ, త్యాగం, నిస్వార్థం ఇమిడి ఉన్నాయి. నవ మాసాలు మోసి కని పెంచి పిల్లల కష్టసుఖాల్లో అన్ని తానై వారి ఎదుగుదలే తన లక్ష్యమై బిడ్డల విజయంలోనే తన ఆనందాన్ని చూసుకునే గొప్ప త్యాగశీలి అమ్మ.తన బిడ్డల ఎదుగుదల కోసం అమ్మ అనేక త్యాగాలకు సిద్ధపడుతుంది.పిల్లలు ఉన్నత స్థానాలకు ఎదిగినప్పుడు అమ్మ అనుభవించే ఆనందం అనిర్వచనీయం. అందుకే మదర్స్ డేని తల్లులకు ప్రత్యేక అనుభూతిని కలిగించడానికి, ఆమెపై మన ప్రేమను కురిపించడానికి, ప్రతి సంవత్సరం మే రెండవ ఆదివారం జరుపుకుంటారు, అయినప్పటికీ మన తల్లులకు ప్రత్యేక అనుభూతిని కలిగించడానికి, గౌరవించడానికి ప్రతిరోజూ మదర్స్ డేగా జరుపుకోవాలి.అమెరికాలో 1907 మే 12న అన్నా జార్విస్ అనే మహిళ తన తల్లి కోసం స్మారక సేవను నిర్వహించినప్పుడు ఈ మదర్స్ డే ఆలోచన మొదలైంది. అప్పటినుండి అమెరికాలోని చాలా ప్రాంతాల్లో ఈ మదర్స్ డే జరుపుకుంటున్నారు. 1914 నుండి అమెరికాలో జాతీయ సెలవుదినంగా మదర్స్ డే ప్రకటించి ప్రతి సంవత్సరం మే రెండవ ఆదివారం రోజున మదర్స్ డే జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.



ఉదయం నుండి రాత్రి దాకా అలుపెరగని శ్రమ చేస్తూ,కుటుంబ బాధ్యతలను,ఉద్యోగ బాధ్యతలను మోస్తూ కంటికి రెప్పలాగా తన బిడ్డలను చూసుకుంటూ బతికే సహనశీలురు మాతృమూర్తులే.నవ మాసాలు మోసి ప్రసవించిన తర్వాత తన బిడ్డను చూసి తాను పడ్డ ప్రసవవేదన మర్చిపోతుంది.ఆడవారికి ప్రసవం పునర్జన్మ అంటారు. ప్రసవానంతరం మాతృమూర్తులు వారి పిల్లల కోసం పునర్జన్మ పొందినట్టే.అప్పుడే పుట్టిన పసిగుడ్డును చూస్తూ తను ఆనందపడుతూ, అనుక్షణం బిడ్డను పరిరక్షిస్తూ, పర్యవేక్షిస్తారు. తన బిడ్డల మీద ఈగ వాలకుండా జాగ్రత్త పడుతూ వారి శారీరక, మానసిక ఎదుగుదలకు నిరంతరం శ్రమించే శ్రమజీవి. తన బిడ్డ ముఖంలో సంతోషాన్ని చూసి తానుపడ్డ బాధల్ని, కష్టాల్ని మర్చిపోయే త్యాగశీలి.తన బిడ్డ బుడిబుడి అడుగులు వేస్తుంటే అమ్మ ఆనందానికి అవధులుండవు.బిడ్డ పడుతూ లేస్తూ నడక ప్రారంభించగానే తన బిడ్డ నడుస్తున్నాడని సంబరపడుతూ తన చుట్టుపక్కల వాళ్లతో ఆనందాన్ని పంచుకుంటుంది అమ్మ.

మొదటిసారి తన బిడ్డ బడికి వెళ్తుంటే ఆ తల్లి మనసులో ఒకపక్క ఆనందం ,మరో పక్క భయం. ఎందుకంటే తన బిడ్డ తాను లేకుండా ఎలా ఉంటాడో అనే ఆందోళన. చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదుగుతాడనే సంతోషం.ఈ రెండిటి కలయికే మొదటిసారి బడిలోకి పంపేటప్పుడు మానసిక సంఘర్షణతో సతమతమవుతుంది తల్లి.చిన్నతనం నుండే పిల్లలకు తెలియకుండానే మంచి చెడులు నేర్పడం, గెలుపు, ఓటమని తట్టుకునే లాగా తన పిల్లల్ని తయారు చేయడం,సమాజంలో ఎలా మెదలాలి, ఎలా ఎదగాలో నేర్పే గొప్ప మానసిక శాస్త్రవేత్త, ఆది గురువు అమ్మే. తండ్రి సహాయ సహకారాలతో కుటుంబం ఎదిగేలా చేస్తూ తన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ,నిద్రాహారాలు,త్యాగం చేస్తూ పిల్లలు ఉన్నత స్థానాలకు ఎదగాలని అనుక్షణం తపిస్తూ ఉండే గొప్ప మానవతామూర్తులు తల్లులు. ఇంటి నిర్వహణ, ఉద్యోగం నేటితరం మహిళలకు అదనపు బాధ్యతలు. కాయ కష్టం చేస్తూ బతికే తల్లులు తన పిల్లలను వారు పనిచేసే చోటుకే తీసుకెళ్లి వారి ఆలనా,పాలన చూస్తూ జీవనో పాధి పొందే శ్రమజీవి తల్లి మాత్రమే. నిద్రహారాలు మానివేసి పిల్లలను చదివిస్తూ వారి పరీక్షల రోజు తానే పరీక్షలు రాస్తున్నట్టుగా శ్రమిస్తూ పరీక్ష సమయంలో తన బిడ్డ ఆరోగ్యంగా ఉండడం కోసం పౌష్టికాహారాన్ని అందిస్తూ పరీక్షల సమయంలో తన పిల్లలు ఉన్నత స్థాయిలో ఉత్తీర్ణులు కావాలని కోరుకుంటుంది. తన బిడ్డ పరీక్షలో విజయం సాధిస్తే తానే విజయం సాధించినట్టు సంబరపడుతూ గర్వపడుతుంది.

మాతృదేవోభవ, పితృదేవోభవ అన్నట్టుగా భారతీయ సమాజంలో తల్లిదండ్రులకు అత్యున్నతమైన, విశిష్ట స్థానం కల్పించారు. తల్లిదండ్రుల్లో ప్రథమ స్థానం తల్లిదే. ప్రపంచ దేశాలలో మదర్స్ డే, ఫాదర్స్ డే, చిల్డ్రన్స్ డే, బ్రదర్స్ డే,సిస్టర్స్ డే ఇలాంటి దినోత్సవాలు జరుపుకొని వారిని ఆ రోజుల్లో ఆనందంగా ఉండేటట్లు చూస్తారు. భారతీయ సమాజంలో వృద్ధాప్యంలో తల్లిదండ్రుల బాధ్యతలను నిరంతరం పర్యవేక్షిస్తూ వారి ఆలనా పాలన చూసే బాధ్యత వారి పిల్లలదే. దురదృష్టవశాత్తు భారతీయ సమాజంలో కూడా వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయడం వాటిలో తల్లిదండ్రులను ఉంచి బాధ్యతల నుంచి తప్పు కుంటున్నారు. కలిసి ఉంటేనే కలదు సుఖం అనే నానుడిని మరిచి విడివిడిగా ఉంటూ అనుబంధాలు, ఆప్యాయతలకు దూరం అవుతూ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో బిడ్డలను హాస్టల్లో వేస్తూ ప్రేమానురాగాలకు దూరమవుతుందీ ఆధునిక సమాజం.

సోషల్ మీడియా మానియాలో పడి మనలను కనీపెంచిన తల్లిదండ్రులతో మాట ముచ్చటలకు కూడా దూరమవుతున్నారు. ప్రపంచంలో అత్యంత విలువైన వ్యక్తులతో ప్రతిరోజులో కనీసం ఒకసారైనా మాట్లాడాల్సిన బాధ్యత వారి పిల్లలుగా మనందరి పైన ఉంది. ఉద్యోగిగా, వ్యాపారవేత్తగా ఎంత బిజీగా ఉన్నా కన్న తల్లిదండ్రులను రోజుల్లో ఒకసారి పలకరిస్తే వారికి చాలా ఆనందంగా ఉంటుంది. తన బిడ్డల నుండి ఫోన్ రాగానే ఆ తల్లి కండ్లలో కలిగే ఆనందం వర్ణనాతీతం. ఉన్నత చదువులు, ఉద్యోగ వ్యాపారాలు రిత్యా తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నప్పటికీ కనీసం రోజుల్లో ఒకసారి మన తల్లిదండ్రులతో ఫోన్లో నైనా మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకుంటే వృద్ధాప్యంలో వారు చాలా ఆనందపడతారు.మా తల్లిదండ్రులతో ప్రతిరోజు ఏదో ఒక సమయంలో తప్పకుండా మాట్లాడుతామని మదర్స్ డే సందర్భంగా మనమందరం ప్రతినపూనాల్సిన అవసరం ఉంది. పండుగలకు, పబ్బాలకు అందరూ కలిపి ఆనందోత్సాహాలతో జరుపుకుంటే వారు చాలా సంతోషపడతారు.

పిల్లలు కూడా పెద్దవారితో ఎలా ఉండాలో నేర్చుకుంటూ,ప్రేమానురాగాలు, ఆప్యాయత పొందుతారు. జీవితంలో విజయం సాధించడానికి ఎల్లప్పుడూ సహాయపడే మార్గదర్శి. ఆమె వృద్ధాప్యంలో ఉన్నప్పుడు, ఆమెను ఎల్లప్పుడూ సంతోషంగా ,సౌకర్యవంతంగా ఉంచడానికి ఎల్లప్పుడూ తమవంతు కృషి చేయాలి.పదాలు తెలియని పెదాలకు అమృత వాక్యం అమ్మ. ఆమె చల్లని ఒడిలోనే మొదలైంది మన ఈ జన్మ. కనులు తెరిచిన క్షణం నుండి బంధం కోసం, బాధ్యత కోసం, కుటుంబం కోసం,తన సర్వాన్ని త్యాగం చేసి అందర్నీ కనుపాపలా చూస్తూ, ఆత్మీయత పంచుతూ, వారి ఎదుగుదలకు అహర్నిశలు కృషిచేస్తూ,వారి భవిష్యత్తు కై ఇంటిని నందనవనం చేసే తల్లులకు పాదాభివందనం.హ్యాపీ మదర్స్ డే.

(మే12 మాతృ దినోత్సవం) ■

'గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' దేని కోసం పనిచేస్తుంది ?



డాక్టర్ కె. శశిధర్
పర్యావరణ నిపుణులు
94919 91918

'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్' 2024 నాటికి వాయు కాలుష్యాన్ని ఎంత శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది?

పర్యావరణ పరంగా ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించి, సమగ్ర అభివృద్ధి సాధించడానికి ఆది నుండి భారత ప్రభుత్వం అనేక పథకాల్ని ప్రవేశ పెడుతూనే ఉంది. 70వ దశకం నుండి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల ప్రస్థానం నేటికి దిగ్విజయంగా సాగుతూనే ఉంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల మధ్య పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి మరియు ఆహార భద్రతను నిర్ధారించడానికి భారతదేశం 2010లో 'నేషనల్ మిషన్ ఫర్ సస్టెయినబుల్ ప్రారంభించింది. తదనంతరం, 2019లో ప్రారంభించబడిన 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్' దేశంలోని ప్రధాన నగరాల్లో వాయు కాలుష్యాన్ని నివారించడానికి తద్వారా పట్టణ కేంద్రాలలో జీవన నాణ్యతను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తుంది. 1995లో 'జాతీయ నదుల పరిరక్షణ ప్రణాళిక' ద్వారా ప్రారంభించబడిన జీవనాధార నదుల స్థిరత్వాన్ని నిర్ధారించడంతో పాటు జలవనరుల సంరక్షణ కార్యక్రమాలు 2014లో ప్రారంభించబడిన 'నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా' వంటి కార్యక్రమాలు ద్వారా మరింత వేగవంతమయ్యాయి. దీనితో పాటు 2016లో ప్రారంభించబడిన 'ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన,' గ్రామీణ గృహాలకు స్వచ్ఛమైన వంట ఇంధనాన్ని అందించడానికి, తద్వారా ఇండోర్ వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి, అట్టడుగు వర్గాల్లో ఆరోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహించడానికి ఒక పరివర్తన ప్రయత్నంగా ఆవిర్భవించింది. అదేవిధంగా, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక సాధికారత కోసం వెదురు పెంపకం యొక్క సామర్థ్యాన్ని ఉపయోగించుకునే లక్ష్యంతో 2006లో 'నేషనల్ వెదురు మిషన్', సముద్ర వనరుల స్థిరమైన నిర్వహణ లక్ష్యంగా 2015లో 'బ్లూ రెవల్యూషన్' , పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ 'అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్) పథకాలు ప్రారంభించబడ్డాయి. పర్యావరణ పరిరక్షణ దిశగా అనేక కార్యక్రమాలు చేపట్టటం ద్వారా, దేశంలో రాబోయే తరాలకు పచ్చని, పరిశుభ్రమైన మరియు మరింత స్థితిస్థాపక భవిష్యత్తుకు మార్గం సుగమం చేయడానికి ప్రయత్నిస్తుంది.

1. భారతదేశంలో సేంద్రీయ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి ఆర్థిక సహాయం అందించడానికి ఉద్దేశించిన పథకం ఏది?
ఎ) నేషనల్ క్లీన్ ఎనర్జీ మిషన్
బి) ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన
సి) పరంపరాగత్ కృషి వికాస్ యోజన
డి) జాతీయ అటవీ నిర్మూలన కార్యక్రమం

2. 'నమామి గంగే' కార్యక్రమం ముఖ్య లక్ష్యం ఏమిటి ?


ఎ) గంగా నది పరిశుభ్రతను కాపాడటం
బి) గంగానది వెంబడి పర్యాటకాన్ని ప్రోత్సహించడం
సి) గంగానది వెంబడి వన్యప్రాణులను సంరక్షించడం
డి) గంగానది వెంబడి పరిశ్రమల స్థాపన

3. గ్రామీణ ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి ఉద్దేశించిన జల్ జీవన్ మిషన్ కార్యక్రమం ఎప్పుడు ప్రారంభించబడింది ?
ఎ) ఆగష్టు 15, 2019 బి) ఆగష్టు 15, 2018
సి) జనవరి 26, 2019 డి) జనవరి 26, 2018

4. భారతదేశంలో నేషనల్ అడాప్టేషన్ ఫండ్ ఫర్ క్లైమేట్ చేంజ్ (NAFCC) ఏ సంవత్సరంలో ప్రారంభించబడింది ?
ఎ) 2019 బి) 2018
సి) 2015 డి) 2020

5. 'నేషనల్ మిషన్ ఫర్ సస్టెయినబుల్ హాబిటాట్' అనేది ఏ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్ కింద స్థిరమైన పట్టణాభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది?
ఎ) వాతావరణ మార్పుపై జాతీయ కార్యాచరణ ప్రణాళిక (NAPCC)
బి) జీవవైవిధ్యంపై జాతీయ కార్యాచరణ ప్రణాళిక (NAPB)
సి) క్లీన్ గంగ కోసం జాతీయ మిషన్
డి) నేషనల్ మిషన్ ఫర్ గ్రీన్ ఇండియా (GIM)

6. భారతదేశంలోని తీరప్రాంత పర్యావరణ వ్యవస్థల పరిరక్షణపై దృష్టి సారించే కార్యక్రమం ఏది?
ఎ) క్లీన్ గంగ కోసం జాతీయ మిషన్
బి) సుస్థిర వ్యవసాయం కోసం జాతీయ మిషన్
సి) పరంపరాగత్ కృషి వికాస్ యోజన
డి) బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్

7. 'అటల్ భుజల్ యోజన ' పథకం ప్రధానంగా దేనిపై దృష్టి పెడుతుంది ?
ఎ) సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం
బి) భూగర్భ జల వనరుల పరిరక్షణ
సి) నదుల అనుసంధాన ప్రాజెక్టులు
డి) సముద్ర జీవవైవిధ్య పరిరక్షణ

8. గ్రామీణ గృహసముదాయాలకు తక్కువ ఖర్చుతో స్వచ్ఛమైన వంట ఇంధనాన్ని అందించడం ఈ కింది వాటిలో ఏ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం?
ఎ) ఉజాలా
బి) ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన
సి) ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన
డి) స్వచ్ఛ భారత్ అభియాన్

9. 'ఫేమ్ ఇండియా స్కీమ్' ఈ కింది వాటిలో దేనికి సంబంధించినది ?
ఎ) జీవవైవిధ్య పరిరక్షణ
బి) ఎలక్ట్రిక్ మరియు హైబ్రిడ్ వాహనాలను ప్రోత్సహించడం
సి) క్షీణించిన భూముల పునరుద్ధరణ
డి) అంతరించిపోతున్న జాతుల రక్షణ

10. కింది వాటిలో ఏది భారతదేశం అమలుచేస్తున్న పర్యావరణ పరిరక్షణ పథకం కాదు?
ఎ) స్వచ్ఛ భారత్ అభియాన్
బి) నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం
సి) మేక్ ఇన్ ఇండియా ఇనిషియేటివ్
డి) నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్

11. కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ప్రారంభించిన 'గ్రీన్ గుడ్ డీడ్స్' అనే సామాజిక ఉద్యమం యొక్క ప్రధాన లక్ష్యం ఏమిటి ?
ఎ) పౌరులలో పర్యావరణ అనుకూల అలవాట్లను ప్రోత్సహించడం
బి) పట్టణ ప్రాంతాల్లో అడవుల పెంపకం
సి) సముద్ర జీవవైవిధ్య పరిరక్షణ
డి) స్థిరమైన పర్యాటకాన్ని ప్రోత్సహించడం

12. 2018లో ప్రారంభించబడిన 'సోలార్ చరఖా మిషన్' పథకం యొక్క ముఖ్య లక్ష్యం ఏమిటి ?
ఎ) గ్రామీణ ప్రాంతాల్లో సౌరశక్తిని ప్రోత్సహించడం
బి) గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించండి
సి) సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించండి
డి) గ్రామీణ ప్రాంతంలోని వ్యక్తులకు మరియు కళాకారులకు ఉపాధి కల్పించడం

13. పేద మహిళలకు గ్యాస్ కనెక్షన్లు అందించడానికి నిర్దేశించిన 'ఉజాలా' పథకం ఏ సంవత్సరంలో ప్రారంభించబడింది ?
ఎ) 2019
బి) 2018
సి) 2016
డి) 2021

14. పర్యావరణ సుస్థిరతపై దృష్టి సారించి పట్టణ పేదలకు గృహాలను అందించడం ఏ పథకం యొక్క లక్ష్యం?
ఎ) ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన
బి) పునరుజ్జీవనం మరియు పట్టణ పరివర్తన కోసం అటల్ మిషన్ (అమృత్)
సి) స్మార్ట్ సిటీస్ మిషన్
డి) స్వచ్ఛ భారత్ అభియాన్

15. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు బీమా కవరేజ్ మరియు ఆర్థిక సహాయం అందించడం ఏ పథకం లక్ష్యం?
ఎ) పరంపరాగత్ కృషి వికాస్ యోజన
బి) ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన
సి) సుస్థిర వ్యవసాయం కోసం జాతీయ మిషన్
డి) నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్

16. 'నేషనల్ మిషన్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్' దేనిపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది ?
ఎ) సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం
బి) గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించడం
సి) చిత్తడి నేలల పరిరక్షణ
డి) నేల మరియు నీటి వనరుల పరిరక్షణ

17. 'క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజం (CDM)' ఈ కింది వాటిలో దేనితో సంబంధం కలిగి ఉంటుంది?
ఎ) వ్యర్థ పదార్థాల నిర్వహణ
బి) గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడం
సి) తీరప్రాంత పర్యావరణ వ్యవస్థల రక్షణ
డి) జీవవైవిధ్య పరిరక్షణ

18. చెరువులు మరియు సరస్సుల వంటి సాంప్రదాయ నీటి వనరులను పునరుద్ధరించడం మరియు సంరక్షించడం ఏ కార్యక్రమం యొక్క లక్ష్యం?
ఎ) క్లీన్ గంగ కోసం జాతీయ మిషన్
బి) సుస్థిర వ్యవసాయం కోసం జాతీయ మిషన్
సి) అటల్ భుజల్ యోజన
డి) జల్ శక్తి అభియాన్

19. భారతదేశంలో స్థిరమైన పర్యాటకాన్ని ప్రోత్సహించడంపై ఈ కింది వాటిలో ఏది ప్రధానంగా దృష్టి సారిస్తుంది?
ఎ) నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం
బి) ఎకో-సెన్సిటివ్ జోన్‌లు (%జుగ్గా%లు)
సి) గ్రీన్ గుడ్ డీడ్స్ ప్రచారం
డి) స్వచ్ఛ భారత్ అభియాన్

20. 'నేషనల్ మిషన్ ఫర్ హిమాలయన్ స్టడీస్' యొక్క ప్రధాన లక్ష్యం ఏమిటి ?
ఎ) హిమాలయ హిమానీనదాల పరిరక్షణ
బి) హిమాలయ ప్రాంతాలలో పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడం
సి) హిమాలయ జీవవైవిధ్య పరిరక్షణ
డి) హిమాలయాల్లో స్థిరమైన పర్యాటకాన్ని ప్రోత్సహించడం

21. భారతదేశంలో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించడంపై ఏ పథకం దృష్టి పెడుతుంది?
ఎ) క్లీన్ గంగ కోసం జాతీయ మిషన్
బి) అటల్ భుజల్ యోజన
సి) సౌర చరఖా మిషన్
డి) ప్రధాన్ మంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్ (PM KUSUM)

22. 'గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' దేని కోసం పనిచేస్తుంది?
ఎ) పునరుత్పాదక ఇంధన రంగంలో నైపుణ్యాభివృద్ధిని అందించడం
బి) వన్యప్రాణుల సంరక్షణలో సిబ్బందికి శిక్షణ
సి) పర్యావరణ పర్యాటకాన్ని ప్రోత్సహించడం
డి) వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్ధతుల్లో వ్యక్తులకు శిక్షణ ఇవ్వడం

23. 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్' 2024 నాటికి భారతీయ నగరాల్లో వాయు కాలుష్యాన్ని ఎంత శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది?
ఎ) 10%
బి) 20%
సి) 30%
డి) 50%

24. పట్టణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణకు స్థిరమైన పరిష్కారాలను అందించడం ఏ కార్యక్రమం యొక్క లక్ష్యం?
ఎ) క్లీన్ గంగ కోసం జాతీయ మిషన్
బి) స్వచ్ఛ భారత్ అభియాన్
సి) నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం
డి) నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్

25. వ్యర్థ పదార్థాల నిర్వహణ కోసం పట్టణ స్థానిక సంస్థలకు ఆర్థిక సహాయం అందించడానికి నిర్దేశించిన 'అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్)' కార్యక్రమం ఏ సంవత్సరంలో ప్రారంభించబడింది ?
ఎ) 2013 బి) 2014
సి) 2015 డి) 2016

సమాధానాలు

1. సి	2. ఎ	3. ఎ	4. సి	5. ఎ
6. డి	7. బి	8. సి	9. బి	10. సి
11. ఎ	12. డి	13. సి	14. ఎ	15. బి
16. డి	17. బి	18. డి	19. బి	20. సి
21. డి	22. బి	23. బి	24. బి	25. సి